దర్శి సాగర్ కాలువ నుంచి పైపులైన్ ద్వారా నీటిని తెచ్చుకోవడం పొదిలి ప్రజల చిరకాల స్వప్నం. దాన్ని తాము నిజం చేస్తున్నామంటూ వైసీపీ ప్రభుత్వం గతంలో డాంభికాలు పలికింది. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి స్వయంగా పనులు ప్రారంభిస్తూ శిలాఫలకం ఆవిష్కరించారు. చోటామోటా నేతల నుంచి ప్రజాప్రతినిధుల వరకు అందరూ అది తమ కీర్తిగా చెప్పుకున్నారు. అనుకున్నదే తడవుగా కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే ఈ పనులకు అసలు ఆర్థికశాఖ అనుమతే లేదన్న విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన అధికారులు నాలుక్కరుచుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ కాడి కిందేశారు. ఇప్పటివరకు రూ.10కోట్ల మేర ఖర్చుపెట్టినట్లు పేర్కొంటున్న అతను తన పెట్టుబడి కూడా వెనక్కువచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.





బిల్లులు రాకపోవడంతో అర్ధంతరంగా నిలిచిన పైప్‌లైన్ పనులు (ఇన్‌సెట్‌లో) పొదిలి పెద్దచెరువు పక్కన ఏర్పాటు చేసిన తాగునీటి పథకం శిలాఫలకం

# ఇంత మోసమా!

## పొదిలిలో వైసీపీ మార్క్ మాయాజాలం

- ఎన్నికల వేళ హడావుడిగా రక్షిత నీటి పథకం పనులు
- ఉత్తుత్తి అనుమతులు
- ఆర్థిక శాఖ క్లియరెన్స్ లేకుండానే టెండర్ల ప్రక్రియ నిర్వహించిన అధికారులు
- వెంటనే ప్రారంభించిన కాంట్రాక్టర్
- ఎంబుక్ నమోదుకాక లబోదిబో
- రూ.10కోట్ల పెట్టుబడి పరిస్థితేమిటో..?
- అర్ధంతరంగా ఆగిన పనులు

పొదిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సక్రమంగా అనుమతులు తీసుకోకుండా ఎన్నికలకు ముందు హడావుడిగా వైసీపీ ప్రభుత్వ పెద్దలు చేసిన మాయాజాలం పొదిలి ప్రజలకు శాపంగా మారింది. ఏళ్లుగా వెంటాడుతున్న తాగునీటి సమస్యను తీరుస్తామంటూ ఆ పార్టీ నేతలు ప్రగల్భాలు పలికి చివరకు చేతులెత్తేశారు. అధికారులు కూడా నేతల బాటలోనే సాగారు. పనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించారు. తీరా ఎంబుక్ చేసే సమయంలో పథకం బండారం బయటపడింది. దీంతో సదరు కాంట్రాక్టర్ లబోదిబోమంటూ పనులను అర్ధంతరంగా నిలిపేశారు. వివరాల్లోకి వెళితే.. దర్శి సాగర్ కాలువ నుంచి పైపులైన్ ద్వారా పొదిలి పెద్దచెరువుకు నీటిని నింపే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం కోసం గత వైసీపీ పాలనలో రూ.50.13కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించారు. ఈ పనులకు 2022లో అప్పటి ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. దీంతో ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆగమేఘాల మీద టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. 2023 ఏప్రిల్‌లో మార్కాపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన అప్పటి సీఎం జగన్ వర్చువల్ విధానంలో భారీ రక్షితనీటి పథకానికి శిలాఫలకం ఆవిష్కరించారు.



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న అప్పటి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి (ఫైల్)

### అప్పట్లో పెద్దఎత్తున సంబరాలు

ప్రజల ఆకాంక్షల మేరకు రక్షిత నీటి పథకాన్ని ప్రారంభించి పొదిలి ప్రాంతప్రజల చిరకాలవాంఛ నేరవేర్చామని వైసీపీ నేతలు ఆర్భాటంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి పర్యటన తరువాత

మిగతా 6వ పేజీలో

### ఎంబుక్ చేయడం కష్టమే

ప్రభుత్వం ఇచ్చిన జీవో నకలు కిందిభాగంలో ఆర్థిక అనుమతులు ఉన్నట్లు పొందుపరచకపోవడంతో ఎంబుక్ రికార్డ్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. మరి ఆర్థిక అనుమతులు లేకుండా టెండర్లు పిలవడంపై అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్లు తెల్లముఖం వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు ప్రక్రియ ఎలా నిర్వహించారని ప్రజలు మండిపడుతున్నారు.

### ఎనిమిది నెలలుగా నిలిచిన పనులు

ఎంబుక్ నమోదు కష్టం కావడంతో సదరు కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. ఏడెనిమిది నెలలుగా పనుల్లో కదలిక లేకపోవడంతో పొదిలి ప్రజల ఆశలు ఆవిరవుతున్నాయి. ప్రస్తుత శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సమ్మర్ స్టోరేజ్ పనులు పూర్తిచేయిస్తామని పేర్కొంటున్నారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. మొత్తం మీద వైసీపీ ప్రభుత్వం పశ్చిమప్రాంత ప్రజలను మభ్యపెట్టిందనే విషయం మరోసారి తేటతెల్లమైంది.

### ప్రజలను మభ్యపెట్టేందుకే ఉత్తుత్తి జీవోలు

అభివృద్ధి పనులు చేపట్టకుండానే చేసినట్లు చూపి ప్రజలను మభ్యపెట్టడం వైసీపీకే చెల్లింది. వెలిగొండ పూర్తికాకుండానే జాతికి అంకితం చేస్తున్నామని అప్పటి సీఎం జగన్‌రెడ్డి గొప్పలు చెప్పారు. ఐదేళ్ల పాలనలో కనీసం 10 శాతం పనికూడా చేయలేదు. అదేవిధంగా దర్శి-కొత్తరెడ్డిపాలెం నుంచి పైపులైన్ ద్వారా పొదిలి పెద్దచెరువుకు నీరుతెచ్చి మండల ప్రజల కష్టాలు తీరుస్తామన్నారు. రూ.50.13 కోట్లతో ఉత్తుత్తి జీవో విడుదల చేశారు. ఇప్పుడు దానికి ఆర్థిక అనుమతులు లేవని స్పష్టమైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పంతాలకు పోకుండా నిధులు విడుదల చేయించి పనులు పూర్తిచేయిస్తాం.



కందుల నారాయణరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే

# పండుగకు వచ్చేదెలా!

- ముందే నిండిన బస్సుల రిజర్వేషన్
- సంక్రాంతికి రవాణా వ్యవస్థకు డిమాండ్
- నెల క్రితమే ప్రయాణికుల ప్లానింగ్
- ఆర్టీసీ ఆధ్వర్యంలో అదనపు బస్సులు
- అయినా ఇంకా అవసరం
- రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ కూడా కష్టమే







ఒంగోలు కార్పొరేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ప్రభావంతో రవాణా వ్యవస్థకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తెలుగు వారు పెద్ద పండుగను సొంతూర్లలో తల్లిదండ్రులు, ఆత్మీయులు, బంధుమిత్రుల మధ్య జరుపుకోవాలని చూస్తారు. ఉద్యోగ, ఉపాధి, చదువుల నిమిత్తం ఎక్కడెక్కడో దూరప్రాంతాల్లోని నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్న వారు జిల్లాకు వచ్చేందుకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. గత పదిహేను రోజుల నుంచి రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లు, ప్రైవేటు రవాణా సౌకర్యాలన్నింటిలో రిజర్వేషన్ ఫుల్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. బుధవారం నుంచి ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. పైగా ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో వారు ఇంటికి వచ్చేందుకు సిద్ధమయ్యారు. దీంతో అటు ఆర్టీసీ, ఇటు రైల్వేలో రిజర్వేషన్లు ఫుల్ అయ్యాయి. ఇప్పటికే జిల్లా ఆర్టీసీ అధికారులు పండుగను పురస్కరించుకుని 264 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయగా, వాటిలో కూడా సీటు దొరికే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో కొందరు ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ, రైల్వేలో రిజర్వేషన్ లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో గ్రామాలకు రావాలని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో అద్దె కార్లకు డిమాండ్ పెరిగింది. రైళ్లలో రిజర్వేషన్‌లు లేక, ఆర్టీసీలో ప్రయాణించేందుకు టికెట్లు దొరక్క పండుగకు ఇంటికొచ్చేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది.

# అక్రమాలు.. అవినీతి

- అడ్డగోలుగా వ్యవహరించిన శీనారెడ్డి
- కార్యాలయ సిబ్బందికీ భాగస్వామ్యం
- త్రిసభ్య కమిటీ ఎదుట పలువురు ఫిర్యాదు
- కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- నేడు ఉద్యోగులను విచారించనున్న కమిటీ
- 31 మందికి ముందస్తు నోటీసులు



త్రిసభ్య కమిటీ ఎదుట హాజరై శీనారెడ్డి అక్రమాలను వివరిస్తున్న ఫిర్యాదుదారులు రాజశేఖర్, శైలజ

ఒంగోలు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో నిబంధనలు, సామాజిక న్యాయం వంటి వాటికి పాతరేసి అడ్డగోలుగా వ్యవహరించారని పలువురు ఆయనపై త్రిసభ్య కమిటీకి ఫిర్యాదు చేశారు. ఆయన పనిచేసిన కాలంలో జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పనుల్లో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని తెలిపారు. అక్రమార్కులకు, అవినీతిపరులకు అండగా శీనారెడ్డి నిలిచారని ఆరోపించారు. శీనారెడ్డిపై విచారణకు కలెక్టర్ నియమించిన త్రిసభ్య కమిటీ విచారణ కొనసాగుతున్న విషయం విదితమే. డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో జిల్లా ఆడిట్ అధికారి శివనారాయణరెడ్డి, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణలతో కూడిన కమిటీ ఈ విచారణ చేస్తోంది. అందులో

మిగతా 6వ పేజీలో

# బండరాళ్ల మధ్య బంగారు పంట!

- పింఛన్ డబ్బుతో పెట్టుబడి
- తక్కువ ఖర్చుతో మంచి దిగుబడి
- 72 ఏళ్ల వ్యవసాయ కూలీ ఆదర్శ సాగు

7లో



చీమకుర్తి శివారున గ్రానైట్ డంపుల మధ్య లింగయ్య సాగు చేసిన వరి

# ఆరేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ కార్డులు

- ప్రతి మండలంలో ప్రత్యేక కేంద్రాలు
- కలెక్టర్ అన్సారియా వెల్లడి



ఒంగోలు ఇస్లాంపేటలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో వివరాల నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ కార్డులు మంజూరు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టిందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక ఇస్లాంపేటలో ఏర్పాటు చేసిన బాల ఆధార్ నమోదు శిబిరాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఆధార్ కోసం పిల్లల వివరాలను నమోదు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బర్త్ సర్టిఫికెట్ ఉన్న పిల్లలందరికీ తక్షణమే ఆధార్ కార్డు కోసం వివరాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. లేని వారికి తొలుత బర్త్ సర్టిఫికెట్ అధికారులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలల ఆధార్ నమోదు కోసం ప్రతి మండలంలోనూ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# గిద్దలూరు - దిగువమెట్ట డబ్లింగ్ లైన్ ప్రారంభం

- విశాఖలో జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ
- సంబరాలు చేసిన బీజేపీ శ్రేణులు

గిద్దలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు-దిగువమెట్ట మధ్య నూతనంగా నిర్మించిన రైల్వే డబ్లింగ్ లైన్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం జాతికి అంకితం చేశారు. విశాఖపట్టణంలో ప్రధాని మోదీ రాష్ట్రవ్యాప్తంగా రూ. 2లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు వర్చువల్‌గా చేయగా ఇందులో గిద్దలూరు-దిగువమెట్ట మధ్య నిర్మించిన రెండో లైన్ నిర్మాణం, ఎలక్ట్రిఫికేషన్ ఉంది. ప్రధాని అక్కడ ప్రారంభోత్సవం చేసిన సమయంలో గిద్దలూరు, దిగువమెట్ట రైల్వే స్టేషన్లలో బీజేపీ నాయకులు సంబరాలు చేశారు. ప్రారంభోత్సవ ఫ్లెక్సీల వద్ద రైల్వే చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు ఎ.ఉదయ్‌శంకర్, బీవీ రామాంజనేయులు, మట్టిమల్ల పుల్లయ్య, మునగనూరి రామకృష్ణ, రైల్వే ఉద్యోగులు ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. ఇప్పటికే గుంటూరు నుంచి గిద్దలూరు వరకు డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్ పూర్తయ్యాయి. గిద్దలూరు నుంచి దిగువమెట్ట వరకు 12 కిలోమీటర్ల మేర రూ.108 కోట్లతో డబ్లింగ్, విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. ఇక గుంటూరు నుంచి దిగువమెట్ట వరకు రెండులైన్లు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.



రైల్వే డబ్లింగ్ లైన్ ప్రారంభోత్సవం సందర్భంగా గిద్దలూరు స్టేషన్‌లో అధికారులు, బీజేపీ నాయకులు

# జీజీహెచ్‌లో హెచ్‌ఎంపీ వార్డు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఒంగోలులోని సర్వజన ప్రభుత్వ వైద్యశాల (జీజీహెచ్)లో హెచ్‌ఎంపీ వైరస్ నివారణకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున తెలిపారు. ఈ వార్డులో స్త్రీ, పురుషులు వేర్వేరుగా మొత్తం 20 బెడ్‌లతో ఐసోలేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డాక్టర్ కల్యాణి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. పల్మనాలజీ, పిడియాట్రిక్, మైక్రోబయాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, బయోకెమిస్ట్రీ హెచ్‌వోడీలతో కమిటీ ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ వెల్లడించారు.





జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన హెచ్‌ఎంపీవీ వార్డు

# తులసి దండు ఓవరాక్షన్

- విజయవాడ నుంచి ర్యాలీగా వచ్చిన తులసిబాబు
- ఎస్పీ కార్యాలయం వద్ద అడ్డుకున్న పోలీసులు
- పలుమార్లు వాగ్వాదం, తోపులాట, ఆపై దౌర్జన్యం

6లో



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం

# మోదీకి బ్రహ్మరథం





విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

## భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర టూరిజం చైర్మన్ నూకసాని, సినీ నటుడు రఘుబాబు, భ్రమర టౌన్ షిప్ చైర్మన్ రామచంద్రరావు



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న సినీ నటుడు రఘుబాబు

# రావినూతలలో క్రికెట్ పోటీలు ప్రారంభం

మేదరమెట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు రావినూతలలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ వీటిని ప్రారంభించారు. చిన్న గ్రామంలో స్టేడియం నిర్మాణం, 30 ఏళ్లకు పైగా సంక్రాంతి క్రికెట్ పోటీలు జరుపుతున్న అసోసియేషన్ సభ్యుల కృషి అభినందనీయమని ఆయన అన్నారు. బాలాజీతోపాటు సినీనటుడు రఘుబాబు, భారత బ్యాడ్మింటన్ సమాఖ్య మాజీ కార్యదర్శి కరణం చెంచు పున్నయ్య చౌదరి, భ్రమర టౌన్ షిప్స్ చైర్మన్ గల్లా రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఎంతో ఖర్చుతో కూడుకున్న క్రికెట్ పోటీలను ఇన్ని సంవత్సరాలుగా నిర్వహించడం, స్టేడియంను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేయడం, ఆటగాళ్ల వసతి సౌకర్యాలను చూడడం ఎంతో శ్రమ, వ్యయంతో కూడుకున్న పని అన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ప్రాంతాన్ని, సింగరకొండ వద్ద భవనాసి రిజర్వాయర్‌ను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. సినీనటుడు రఘబాబు మాట్లాడుతూ తాను అతిథిగా రాలేదని, ఆర్‌ఎస్‌సీపీ ప్రారంభం నుంచి తాను కూడా సభ్యుడినేనన్నారు. స్టేడియం అభివృద్ధికి నాగేశ్వరరావు (బాబు) ఎంతగానో పాటుపడ్డారన్నారు. గ్రామీణ ప్రాంతాలల్లో క్రీడల అబివృద్ధికి తాము ఎప్పుడూ ముందుంటామని భ్రమర టౌన్ షిప్ చైర్మన్ గల్లా రామచంద్రరావు అన్నారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. సినీనటుడు రఘుబాబు, డాక్టర్ బాలాజీ, రామచంద్రరావులకు అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు (బాబు) అతిథులను పరిచయం చేశారు. అనంతరం రఘుబాబు, బాలాజీ బ్యాటింగ్ చేశారు. కార్యక్రమం అనంతరం స్టేడియంలో నూతనంగా నిర్మించిన ఇండోర్ షటిల్ కోర్టును భారత బ్యాడ్మింటన్ సమాఖ్య మాజీ కార్యదర్శి కరణం చెంచు పున్నయ్య చౌదరి ప్రారంభించారు. కార్యక్రమంలో అద్దంకి మల్లికార్జునరావు, ఎస్‌ఐ షేక్ మహమ్మద్ రఫీ, అసోసియేషన్ కార్యదర్శి మోపర్తి శేషారావు, కారుసాల సుబ్బాయ్య, రామినేని శ్రీనివాసరావు, చేబ్రోలు నాగేశ్వరరావు, యడ్లపల్లి నరసింహారావు, కారుసాల బ్రహ్మానందం, కారుసాల గురుబాబు, చెన్నుపాటి హరిబాబు, మేదరమెట్ల శ్రీనివాసరావు, సాధినేని మస్తాన్‌రావు, నాదెండ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**ఉత్కంఠగా సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు**

రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న భ్రమర సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు మొదటి రోజు పోటీలు గుంటూరు, తిరుపతి జట్ల మధ్య హోరాహోరీగా జరిగాయి. బుధవారం జరిగిన ఈ పోటీలో జీడీసీఏ 12 గుంటూరు జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. స్పార్టమ్ వారియర్స్ తిరుపతి జట్టు బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 168 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన జీడీసీఏ 12 గుంటూరు జట్టు 19.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి గెలుపు లక్ష్యాన్ని సాధించింది. ఈ జట్టులోని మహిత్ కుమార్ అత్యధికంగా 49 పరుగులు చేశాడు. స్పార్టమ్ 12 తిరుపతి జట్టుపై జీడీసీఏ 12 గుంటూరు జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ పోటీలకు ఎంపైర్‌లుగా శ్రీనివాస్, రాజ్ వ్యహరించారు. స్కోరర్‌గా సాయినాథ్ ఉన్నారు.

**నేటి పోటీల వివరాలు**

గురువారం ఉదయం నెక్స్‌జన్ 12 హైదరబాద్, మస్తాన్ 12 మార్టూరు జట్ల మధ్య పోటీ జరుగుతుంది. సాయంత్రం ఎంఆర్‌సీసీ 12 చెన్నై, ఎస్‌సీ రైల్వే సికింద్రాబాద్ జట్ల మధ్య పోటీ జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కారుసాల నాగేశ్వరరావు (బాబు), కార్యదర్శి మోపర్తి శేషారావు తెలిపారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు

- ఎస్పీ దామోదర్
- ‘మత్తుపై యుద్ధం’ ప్రత్యేక గీతం ఆవిష్కరణ



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(కల్చరల్), జనవరి 8(ఆంధ్రజ్యోతి): గంజాయి, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉన్నప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. ప్రజాగాయకుడు నూతకోటి శరత్‌బాబు రూపొందించిన మత్తుపై యుద్ధం ప్రత్యేక గీతాన్ని ఆయన బుధవారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ఒకసారి డ్రగ్స్ వాడటం ప్రారంభిస్తే దాని నుంచి బయటపడటం అంత సులభం కాదన్నారు. అది మానసిక ఆరోగ్యం, అంతర్గత అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, దీంతో దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి వాటికి యువత అలవాటుపడుతున్నారని చెప్పారు. అదేవిధంగా డ్రగ్స్ కేసులో పట్టుబడితే భవిష్యత్‌లో ఉద్యోగాలు పొందలేరని ఆయన స్పష్టం చేశారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీసుశాఖతో పాటు కళాకారులు తమ పాటల ద్వారా సమాజాన్ని చైతన్య పరచాలని పేర్కొన్నారు. మత్తుపై యుద్ధం గీతాన్ని తమ సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఒంగోలు సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొల్లా మధు, దుగ్గినేని వెంకట్రావు, గొట్టిపాటి నాగేశ్వరరావు, ఏజే సొల్యూషన్ ప్రియ, పేస్ ఎస్‌ఆర్ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంత మోసమా!

(5వ పేజీ తరువాయి)

స్థానిక వైసీపీ నాయకులు అత్యుత్సాహంతో రక్షితనీటి పథకం తెచ్చిన ఘనత మాదేనంటూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో పెద్దఎత్తున ప్రార్థనలు చేసి నానా హంగామా చేశారు. ఈ పనులకు సంబంధించి కాంట్రాక్టును రఘురామ పైపుల కంపెనీ దక్కించుకుంది. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ పైపులైన్ నిర్మాణ పనులను చురుగ్గా చేపట్టింది. ఇప్పటివరకు రూ.10 కోట్ల మేర పనులు పూర్తిచేసింది. ఇక్కడే కథ మరో మలుపు తిరిగింది. చేసిన పనులకు ఎం-బుక్ రికార్డ్ చేసే సమయంలో ఈ పైపులైన్ వర్క్‌కు అసలు ఆర్థిక శాఖ అనుమతులు లేవని బయటపడింది. దీంతో లబోదిబోమనడం కాంట్రాక్టర్ వంతైంది.

**త్వరలో అనుమతులు తెచ్చి పనులు ప్రారంభిస్తాం**

గత ప్రభుత్వ పాలనలో ఇరిగేషన్ శాఖ నుంచి రూ.50.13 కోట్ల పైపులైను పనులకు జీవో విడుదలైంది. దాని ఆధారంగానే టెండర్లు పిలిచారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థలకు పార్ట్ పేమెంట్ కోసం ఎం-బుక్ నమోదు చేస్తుండగా ఆర్థికశాఖ అనుమతులు లేవని స్పష్టమైంది. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో అనుమతులు వస్తాయి. పనులు ప్రారంభించి పూర్తిచేస్తాం.

**శివరాంప్రసాద్, ఇరిగేషన్ డీఈ**

# అక్రమాలు.. అవినీతి

(5వ పేజీ తరువాయి)

భాగంగా ప్రభుత్వానికి ఫిర్యాదులు పంపిన ఐదుగురిని తమ ఎదుట హాజరుకావాలని కమిటీ చైర్మన్ లోకేశ్వరరావు నోటీసులు ఇవ్వగా గురువారం డ్వామా కార్యాలయంలో జరిగిన విచారణకు నలుగురు హాజరయ్యారు. ప్రధాన ఫిర్యాదుదారుడుగా ఉన్న పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్, పొదిలికి చెందిన న్యాయవాది పి.శైలజ, మార్కాపురానికి చెందిన ఇనగంటి రాజశేఖర్, కొండపి ప్రాంతానికి చెందిన శివశంకర్‌లు ఈ విచారణకు హాజరై తాము చేసిన ఫిర్యాదులు, వాటికి సంబంధించి తమ వద్ద ఉన్న ఆధారాలను కమిటీ సభ్యులకు వివరించారు.

**అక్రమార్కులకు తిరిగి పోస్టింగ్‌లు**

సోషల్ ఆడిట్‌లో భారీగా అవకతవకలు, అవినీతి చోటుచేసుకుందని అందులో సస్పెండ్ అయిన వారికి తిరిగి పోస్టింగ్‌లు ఇచ్చే విషయంలో పీడీగా ఉన్న శీనారెడ్డి పూర్తి పక్షపాతంగా వ్యవహరించడంతోపాటు భారీగా అవినీతికి పాల్పడ్డారని విచారణకు హాజరైన వారు కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇక్కడ జరిగిన అక్రమాలపై పీడీ సరిగా చర్యలు తీసుకోని విషయం తమ దృష్టికి రావడంతో అప్పటి ప్రభుత్వ ఉన్నతాధికారుల ప్రత్యేక బృందాలను పంపి విచారణ చేయించారన్నారు. అందులో అక్రమాలను గుర్తించి పలువురు సిబ్బందిని సస్పెండ్ చేయగా వారికి తిరిగి పోస్టింగ్‌లు శీనారెడ్డి ఇచ్చారన్నారు. అందుకు వీలుగా ఏపీడీలతో పునర్విచారణ చేయించారన్నారు. అలాంటి అధికారం పీడీకి లేకపోయినా అవినీతికి పాల్పడి నిబంధనలకు విరుద్ధంగా చేశారన్నారు. ఇలాంటివి అనేకం ఉన్నాయని ఆరోపించారు. అదేసమయంలో ఇష్టారీతిన శీనారెడ్డి వ్యవహరించడంలో పలువురు డ్వామా కార్యాలయ సిబ్బంది సంపూర్ణ సహకారం ఉందన్నారు. తద్వారా వారు కూడా లబ్ధిపొందారని ఆరోపించారు. అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. రాజశేఖర్, శివశంకర్‌లు ఇరువురూ తీవ్ర ఆరోపణలు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా శీనారెడ్డితోపాటు ఫైళ్లతో సంబంధం ఉన్న ప్రస్తుత, పూర్వ డ్వామా ఉద్యోగులను కమిటీ సభ్యులు గురువారం విచారించనున్నారు. ఏపీడీల నుంచి అటెండర్ వరకు స్థాయి కలిగిన మొత్తం 31మంది ఉద్యోగులను విచారణకు గురువారం హాజరుకావాలని కమిటీ చైర్మన్ లోకేశ్వరరావు డ్వామా ప్రస్తుత పీడీ ద్వారా గతంలోనే నోటీసులు ఇచ్చారు.

# తులసి దండు ఓవరాక్షన్

- విజయవాడ నుంచి ర్యాలీగా వచ్చిన తులసిబాబు
- ఎస్పీ కార్యాలయం వద్ద అడ్డుకున్న పోలీసులు
- పలుమార్లు వాగ్వాదం, తోపులాట, ఆపై దౌర్జన్యం

ఒంగోలుక్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కామేపల్లి తులసిబాబు విచారణ సందర్భంగా అతని అనుచరులు ఓవరాక్షన్ చేశారు. బుధవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం విచారణకు తులసిబాబు విజయవాడ నుంచి భారీగా కార్లతో ర్యాలీగా వచ్చారు. పోలీసు కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద తమ కాన్వాయ్‌ని లోపలికి పంపాలని అక్కడ విధులలో ఉన్న పోలీసులతో వాదనకు దిగారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు తులసిబాబుని మాత్రమే లోపలకు అనుమతించి గేట్లు వేశారు. అయితే బయట ఉన్న అనుచరులు పోలీసులపై రెచ్చిపోయారు. ‘యూనిఫామ్‌తో గుడివాడ రండి మీ అంతు చూస్తాం’ అంటూ రెచ్చగొట్టే వాఖ్యలు చేశారు. అంతేకాకుండా తులసి అన్న జిందాబాద్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. తులసిబాబు అనుచరులు ప్రధాన ద్వారాన్ని నెట్టుకొని పోలీసు కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కొద్దిసేపు పోలీసులు, తులసిబాబు అనుచరుల మధ్య తోపులాట జరిగింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో జిల్లా పోలీసు కార్యాలయం ఎదురుగా తులసి దండు కార్లను పార్కు చేశారు. సాయంత్రం 6.30 సమయంలో ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్, ట్రాఫిక్ పోలీసులు వచ్చి కార్యాలయం ఎదుట ఉంచిన కార్లను తీయమని తులసిబాబు అనుచరులను కోరారు. దీంతో మరోసారి రెచ్చిపోయిన వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సీఐ గట్టిగా హెచ్చరించడంతో వారు అక్కడి నుంచి వాహనాలను తీసివేయించారు.

**రాత్రి పొద్దుపోయే వరకు విచారణ**

తులసిబాబును బుధవారం రాత్రి పొద్దుపోయే వరకు ఎస్పీ ఏఆర్.దామోదర్ విచారిస్తూనే ఉన్నారు. అదే సమయంలో రిటైర్డ్ సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను పోలీసు కస్టడీకి తీసుకొని ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో ఉంచారు. సీఐడీ కస్టడీ సమయంలో ప్రైవేటు వ్యక్తి తన గుండెల మీద కూర్చొని వేధించాడని ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆరోపణ చేశారు. ఈ మేరకు తులసిబాబుకు పోలీసులు నోటీసు ఇచ్చి విచారణకు పిలిచిన విషయం విదితమే.





కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు దూసుకొస్తున్న తులసిబాబు అనుచరులను వారిస్తున్న పోలీసులు

# పోలీస్ వర్సెస్ ఎక్సైజ్

- బెల్ట్ షాపుల నిర్వహణలో లైసెన్సీల మధ్య ఆధిపత్య పోరు
- వైన్ షాపుల వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌లు
- చూసీచూడనట్లు వదిలేస్తున్న ఎక్సైజ్ శాఖ
- కన్నెర్ర చేస్తున్న పోలీస్ శాఖ
- రాజకీయ రంగు పులుముకుంటున్న మద్యం వ్యాపారం
- 265 మద్యం సీసాలు పట్టుకున్న వేటపాలెం పోలీసులు

వేటపాలెం(చీరాల), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వైట్ కాలర్ వ్యాపారంలోకి మద్యం దుకాణాలు కూడా చేరాయి. మద్యం దుకాణాలకు సంబంధించి లైసెన్స్‌లు ఎవరి పేరున ఉన్నప్పటికీ అంతిమంగా వారి వెనుక రాజకీయ కోణం దాగి ఉంటుంది. ఇది బహిరంగ రహస్యం. ఇదిలావుంటే మద్యం బెల్ట్ షాపులు అనేవి ఉండకూడదు. ఎంఆర్‌పీల కన్నా అదనపు ధరకు మద్యం విక్రయించకూడదని సాక్షాత్తు సీఎం చంద్రబాబు పదేపదే చెప్తున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో ఆ మాటలకు అటు రాజకీయ నాయకులు, ఇటు అధికారులు కట్టుబడి ఉండడం లేదు. తాజాగా వేటపాలెం మండలం కఠారిపాలెంలో బుధవారం 265 క్వార్టర్ మద్యం బాటిల్స్, 25 బీరు సీసాలను వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి పట్టుకున్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ విచ్చలవిడిగా జరుగుతుందనేందుకు ఇదొక నిదర్శనమని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. బెల్ట్ షాపులను నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు ఏంచేస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇదిలావుంటే వైన్ షాపుల వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌లకు సంబంధించి పోలీస్ శాఖ వారు సంబంధీకులకు నోటీసులు ఇచ్చారు. దీనిపై స్పందించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం వ్యాపారానికి సంబంధించిన నిబంధనలు అమలులో ఎక్సైజ్ వర్సెస్ పోలీస్ అన్నట్లుగా అడుగులు పడుతున్నాయి. జరుగుతున్న పరిణామాలు అందుకు దర్పణం పడుతున్నాయి.

**సింగిల్‌గా వద్దు.. సిండికేట్ ముద్దు**

చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మొత్తం 24 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో పాలక, ప్రతిపక్షాలకు చెందిన వారు భాగస్తులుగా ఉన్నారు. ఈ క్రమంలో అదనపు సంపాదన కోసం బెల్ట్‌షాపుల నిర్వహణకు తెరతీశారు. అయితే ఎవరికివారు సింగిల్‌గా వెళదామా, సిండికేట్‌గా వెళదామా అనే విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. వీలున్నచోట ఎవరికివారు బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

**అన్నదమ్ముల వివాదానికి రాజకీయ రంగు**

దీర్ఘకాలంగా మద్యం వ్యాపారంలో ఉన్న ఇద్దరు అన్నదమ్ముల మధ్య నెలకొన్న వివాదం రాజకీయ రంగు పులుముకుంది. సర్కిల్ పరిధిలో టీడీపీ, జనసేన, కాంగ్రెస్, వైసీపీలకు చెందిన వ్యక్తులు మద్యం దుకాణాల లైసెన్స్ పొందినవారిలో ఉన్నారు. వారికి కొందరికి ఆ అన్నదమ్ముల్లో ఒకరు, మరికొందరికి మరొకరు ప్రాతినిథ్యం వహించేందుకు ముందుకొచ్చారు. అయితే ఆ అన్నదమ్ముల మధ్య ఉన్న విభేదాలతో అది రాజకీయ రంగు పులుముకుంది. ఆ రంగు కాస్తా అధికార పార్టీకి చెందిన కీలక నేతలకు అంటుకుంటుంది.

**పోలీస్ X ఎక్సైజ్**

వాస్తవానికి మద్యం విక్రయాల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టాలి. అయితే వారు ఆ విషయాన్ని పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాల వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసినవారికి పోలీస్‌శాఖ పరంగా నోటీసులు ఇచ్చారు. తాజాగా కఠారిపాలెంలో బెల్ట్‌షాపులో విక్రయిస్తున్న 265 క్వార్టర్ బాటిళ్లు, 25 బీర్ బాటిళ్లను వేటపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై తమ ఇలాకాలో పోలీస్ చర్యలేంటని ఎక్సైజ్ అధికారులు గుర్రగా ఉన్నట్లు సమాచారం.



కఠారిపాలెంలో పట్టుబడ్డ మద్యం సీసాల వివరాలు తెలుపుతున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

**స్వామి కార్యం ఎంత.. స్వకార్యం ఎంత**

బెల్ట్ షాపుల నిర్వహణ, అధిక ధరలకు విక్రయాలకు సంబంధించి కొందరు అధికారులు రాజకీయ నాయకలకు అండగా నిలిచారని విశ్వసనీయ వర్గాల భోగట్టా. అయితే అందులో స్వామి కార్యం ఎంత .. స్వకార్యం ఎంత అని విషయం తెలిసినవారు నర్మగర్భంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత నేతలు జాగ్రత్తగా ఉండకపోతే ఆ మకిలీ వారికి వారికి అంటుకునే ప్రమాదం ఉందనడంలో సందేహం లేదని ఆ రంగంలో ఉన్నవారు అంటున్నారు.

# బండరాళ్ల మధ్య బంగారు పంట!

## గ్రానైట్ డంపు పక్కన 8 ఎకరాల్లో వరిసాగు

- తక్కువ ఖర్చుతో మాగాణి సాగు
- పింఛన్ డబ్బుతో పెట్టుబడి
- 72 ఏళ్ల వ్యవసాయ కూలీ ఆదర్శ సాగు



చీమకుర్తి శివారున గ్రానైట్ డంపుల మధ్య సాగుచేసిన వరి

ఆయనకు 72 ఏళ్ల వయస్సు. పింఛన్ పొందుతున్నాడు. ఆ పింఛన్‌ను ఎవరైనా బతుకు దెరువుకో.. లేక ఆరోగ్య ఖర్చులకో వాడుకుంటారు. కానీ ఆయన భిన్నంగా ఆలోచించాడు. వ్యవసాయ కూలీగా పనిచేస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుని.. పింఛన్ డబ్బులను దాచుకున్నాడు. తనకు ఎంతో ఇష్టమైన సాగుకు పెట్టుబడిగా ఉపయోగించాడు. అతి తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితం సాధిస్తూ సాటి రైతుల నుంచి అభినందనలు అందుకుంటున్నాడు. ఆయనే చీమకుర్తి శివారులోని యానాదికాలనీకి చెందిన వై.లింగయ్య. ఆహార పంటలు గిట్టుబాటుకాక వాణిజ్య పంటలవైపు రైతులు మరలుతున్న ఈ తరుణంలో తిండి గింజలకు ఇబ్బంది రాకూడదని మాగాణి సాగు చేస్తున్న లింగయ్య కృషిపై ప్రత్యేకం..

చీమకుర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి అంటే బండరాళ్లు.. గ్రానైట్ క్వారీలు.. వరుసకట్టి పరుగు పెట్టే టిప్పర్ల నుంచి వెలువడే దుమ్మూధూళితో నిండిపోయే ప్రాంతంగా పేరు. పట్టణానికి శివారున యానాది కాలనీ ఉంది. ఇక్కడ ఎక్కువ మంది కంకర కొట్టడానికి కూలికి వెళ్తుంటారు. ఇదే కాలనీకి చెందిన వై.లింగయ్య చిన్నప్పటి నుంచి రైతుల వద్ద కూలీగా పనిచేస్తూ ఉండేవాడు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వీరికి వివాహమైంది. వారు కంకరకొట్టే పనికి వెళ్తూ వారి జీవితం వారు చూసుకుంటున్నారు. లింగయ్య తన భార్యతో కలిసి కాలనీలోనే ఉంటున్నాడు. భార్య కొన్నేళ్లక్రితం జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడి ఇంటికే పరిమితమైంది. లింగయ్య చీమకుర్తికి చెందిన రైతు తోపూరి కృష్ణయ్య వద్ద కొన్నేళ్లగా రైతు కూలీగా పనిచేస్తూ ఉన్నాడు. యానాదికాలనీకి సమీపంలోనే ఖాళీగా ఉన్న కృష్ణయ్య పొలాన్ని తాను సాగుచేసుకుంటానని లింగయ్య అడిగాడు. రైతు అంగీకరించడంతో 8 ఎకరాల్లో వరిసాగుకు ఉపక్రమించాడు. ఎకరాకు రూ.7వేల కౌలు. వృద్ధాప్య పింఛన్‌తో చిట్టీలు కట్టుకొని కూటబెట్టిన డబ్బును సాగుకు పెట్టుబడిగా ఉపయోగించాడు. ఇప్పటికీ కౌలు కాకుండా సాగుకు రూ.లక్షన్నర వరకూ లింగయ్య ఖర్చు చేశాడు. ఈ ఎనిమిది ఎకరాల్లో పంట బాగోగులన్నీ ఆయన ఒక్కడే చూసుకుంటున్నాడు. పైరు ఏపుగా పెరిగింది. మరో నెలలో కోతకొస్తుంది. దాదాపు 300 బస్తాలకుపైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. పొలాన్ని చూసి చుట్టుపక్కల రైతులు ఆయన్ను అభినందిస్తున్నారు. కూలీగా తనకున్న అనుభవంతో చక్కటి దిగుబడి సాధిస్తున్నాడని మెచ్చుకుంటున్నారు. సాగుకు అవలంబిస్తున్న విధానాలనూ, ప్రతికూల పరిస్థితుల్లో పంటను పండిస్తున్న తీరునూ చూసిన యానాదికాలనీ వాసులు తాము కూడా అదే పద్ధతిని అనుసరిస్తామంటున్నారు.

### అందరు వదిలేస్తే తిండి గింజలు ఎలా?

నేను చిన్ననాటి నుంచి రైతుల వద్ద కూలీగా ఉన్నాను. రైతుల బాధలు, కష్టాలు దగ్గరగా చూశాను. ధర గిట్టుబాటు కాకపోవటంతో రైతులు సాగుకు ఇష్టపడటం లేదు. అందరూ అలా అనుకుంటే తిండిగింజలు ఎలా? పండిస్తేనేగా వచ్చేది. అందుకనే కష్టమో, నష్టమో అనుకుని కౌలుకు తీసుకొని ఎనిమిది ఎకరాల్లో వరి సాగుచేశాను. ఒక్కడినే పంటను చూసుకోవడం నాకేమీ కష్టం అనిపించటంలేదు.

- వై.లింగయ్య, రైతు





కాకి స్వర్ణలత ప్రదర్శించిన జాబిల్లి జిలుగులు (చంద్రయాన్-3) ప్రాజెక్టు

## జాతీయస్థాయి ప్రదర్శనకు రెండు ప్రాజెక్టులు ఎంపిక

ఒంగోలు విద్య, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాకు చెందిన రెండు ప్రాజెక్టులు జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో వ్యక్తిగత, సామూహిక టీచర్ ఎగ్జిబిట్ మూడు విభాగాల్లో ఒక్కొక్క విభాగంలో రెండేసి చొప్పున మొత్తం ఆరు ప్రాజెక్టులను విజయవాడ రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ప్రదర్శించారు. ఆ ఆరింటిలో రెండు ప్రాజెక్టులు జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ఈదుమూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కాకి స్వర్ణలత ప్రదర్శించిన జాబిల్లి జిలుగులు (చంద్రయాన్-3) ప్రాజెక్టు ఉత్తమ ప్రాజక్టుగా ఎంపికైంది. ఇస్రో వెల్లడించిన వివరాల ప్రకారం చంద్రయాన్-3 ప్రయోగంలో కనుగొన్న అంశాలు, వాటి ప్రయోజనాలను గుర్తించి ఈ ప్రాజెక్టులో వివరించారు. దీంతో ఈ ప్రాజెక్టు జాతీయ ప్రదర్శనకు ఎంపికైంది. విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో మార్కాపురం జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని డి.కీర్తన ప్రదర్శించిన స్మార్ట్ పోచ్ ప్రాజెక్టు కూడా ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైంది.





డి.కీర్తన ప్రదర్శించిన స్మార్ట్ పోచ్ ప్రాజెక్టు

స్మార్ పోచ్ అంటే సాధారణంగా ఉపయోగించి పనిచేసే ఎల్ఈడీ బల్బులు, వైఫైరోటర్, సర్వేలెన్స్ కెమెరాలు, డిజిటల్ సైన్స్‌బోర్డులు, వాతావరణ సెన్సార్, విద్యుత్‌తో నడిచే వాహనాలకు చార్జర్లు కలిగి ఉన్న స్తంభాలను ఏర్పాటు చేయడం. ఈనెల 20 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో నిర్వహించే సాధన ఇండియా జాతీయస్థాయి సైన్స్ పెయిర్‌లో ఈ రెండు ప్రాజెక్టులు ప్రదర్శిస్తారు.

## రోగులకు మెరుగైన సేవలు అందించాలి

### కలెక్టర్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు ఆసుపత్రుల గౌరవాన్ని పెంచేలా వైద్యులు పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఆదేశించారు. బుధవారం ఒంగోలులోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్) సందర్శించిన కలెక్టర్ అక్కడి వైద్యాధికారులు, వైద్యులతో సమీక్ష నిర్వహించారు. విభాగాల వారీగా ఆసుపత్రుల నిర్వహణకు అవసరమైన బడ్జెట్ వివరాలు కోరారు. లోపాలను సరి చూసుకుని వైద్య సేవలను అందించాలన్నారు. వైద్య సేవలు అందించడంలో అలసత్వం వీడాలని చెప్పారు. వైద్యాధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులపట్ల శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పనితీరు ఇండికేటర్స్‌లో మంచి ప్రతిభ చూపాలని, రోగులకు వసతులు కల్పనలో ఆసుపత్రులకు కావాల్సిన సదుపాయాల కల్పనకు ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. ఆసుపత్రిలో చేపట్టాల్సిన మరమ్మతులు తక్షణం చేయాలని ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, హెచ్‌వోడీలు, ఎంపీఎంఎస్ఐడీసీ అధికారులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి అండర్-17 టీ20కి విద్యార్థి ఎంపిక

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం లాయర్‌పేటలోని శ్రీచైతన్య ఒలంపియాడ్ స్కూలు విద్యార్థి మోహిత్‌కుమార్ అండర్-17 జాతీయ స్థాయి టీ20 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక స్కూలులో బుధవారం ప్రిన్సిపాల్ అపర్ణ శిరీష మాట్లాడుతూ చైతన్య స్కూలు విద్యార్థి జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. మోహిత్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రీజనల్ ఇన్‌చార్జి వై.అనిల్‌కుమార్, సమన్వయకర్త జి.శ్రీనివాసరావు, డీన్ వై.శ్రీనివాసరావు, ఏవో బాలకృష్ణ, పీఈటీ రామారావు తదితరులు పాల్గొన్నారు.



మోహిత్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

## పోలీసు శాఖకు డ్రోన్ కెమెరా బహూకరణ

టంగుటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖకు ఆలకూరపాడుకు చెందిన ఎన్ఆర్ఐ అనుమోలు రవిచంద్ర డ్రోన్ కెమెరాను బహూకరించారు. బుధవారం ఒంగోలులో దాన్ని ఎస్పీ దామోదర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల కట్టడి, ట్రాఫిక్ నియంత్రణతోపాటు ఇతర పోలీసింగ్ అవసరాలకు డ్రోన్ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. ఒక ఎన్ఆర్ఐ స్వదేశానికి సేవ చేయాలన్న దృక్పథంతో డ్రోన్‌ను బహూకరించడం అభినందనీయన్నారు.

## డిప్యూటీ స్పీకర్‌పై టీఎన్ఎస్ఎఫ్ నేత ఫైర్

ఒంగోలు క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రతి రోజు ప్రెస్‌మీట్లు పెట్టి అవాకులు చావాకులు పేలుతూ తన ప్రతిష్టను దిగజార్చుకుంటున్నారని టీఎన్ఎస్ఎఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు సత్యసాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఒంగోలు ఎస్పీ కార్యాలయం వద్ద కామేపల్లి తులసిబాబుకు సంఘీభావంగా మీడియాతో సత్యసాయి మాట్లాడారు. పోలీసులతో సంబంధం లేని ప్రైవేటు వ్యక్తి, రాజకీయ నాయకుడు, లాయర్ అయిన తులసిని కుట్ర పూరితంగా కేసులో ఇరికించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గుడివాడ నియోజకవర్గంలో కమీషన్లు తీసుకుంటున్నారని రఘురామకృష్ణరాజు ఇటీవల మాట్లాడటం సరైంది కాదన్నారు. గత ప్రభుత్వంలో కొడాలి నానికి అంటకాగిన 300 మంది అధికారులు, ఉద్యోగులను బదిలీ చేయించామని తెలిపారు. గుడివాడ నియోజకవర్గంలో ఎలాంటి కమీషన్లు లేకుండా కాంట్రాక్ట్ వర్కులు ఇస్తున్నామని తెలిపారు. అయితే కొడాలి నాని, వైసీపీ బలం పెరిగేలా ట్రిపుల్‌ఆర్ మాట్లాడటం సరైన చర్య కాదన్నారు. ఆయన అనేక పార్టీలు మారి తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

## ఒంగోలులో మ్యూజిక్, డాన్స్ కాలేజీని ఏర్పాటు చేయాలి

- కేంద్రాన్ని కోరిన ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రకాశం జిల్లాలో మ్యూజిక్, డాన్స్ కాలేజీని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. ఢిల్లీలో కేంద్ర సాంస్కృతిక శాఖ సెక్రటరిని బుధవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఒంగోలు సాంస్కృతికతను, అధ్యాత్మికతను సూచిస్తుందన్నారు. సంస్కృత పదం ఒంగోలు నుంచే ఉద్భవించిందని, ఇంత సాంస్కృతిక ప్రాముఖ్యత ఉన్న ఒంగోలులో మ్యూజిక్, డాన్స్ కాలేజీని ఏర్పాటు చేయాలని కోరారు. ఒంగోలు సమీపంలో సింగరాయకొండ, అద్దంకి, వేటపాలెం, చీరాల, కనిగిరి, బాపట్ల, చిలకలూరిపేట, వినుకొండ ప్రాంతాల ఆశావాహులు, కళాకారులు, విద్యార్థులు, జిల్లా ప్రజానీకం కాలేజీని స్థాపించాలని కోరుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలేజీ ఏర్పాటు వల్ల శాస్త్రీయ సంగీతం, నృత్యం సంరక్షించడం, అధిక నాణ్యత పెంపుదల, అన్ని కోర్సుల ఏర్పాటు చేయడం వల్ల జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. దీనిపై కేంద్ర సాంస్కృతిక శాఖ సెక్రటరి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని ఎంపీ మాగుంట తెలిపారు.



పరుగు తీస్తున్న అభ్యర్థులు

## కానిస్టేబుళ్ల రాత పరీక్షకు 332 మంది అర్హత

ఒంగోలు క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గల పెరేడ్ మైదానంలో కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన పరీక్షలకు 448 మంది అభ్యర్థులు హాజరుకాగా 332 మంది రాత పరీక్షకు అర్హత సాధించినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలకు ఇప్పటివరకు హాజరుకాలేని అభ్యర్థులు ఈనెల 10న హాజరుకావాలని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యోగాల కోసం దళారులను నమ్మవద్దని ఆయన సూచించారు.



లాంగ్ జంప్‌లో అభ్యర్థి



అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు

## వైద్యపరీక్షలను సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో ల్యాబ్ టెక్నీషియన్లు వైద్య పరీక్షలు సక్రమంగా చేసేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక మలేరియా ఆఫీసులో బుధవారం ల్యాబ్ టెక్నీషియన్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ల్యాబ్ టెక్నీషియన్స్‌కు సంబంధించిన అన్ని పరీక్షలు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయపాలన కూడా ముఖ్యమన్నారు. ప్రతి ల్యాబ్ టెక్నీషియన్ ప్రతిరోజు చేసిన రక్తపరీక్షల వివరాలను ఐహెచ్ఐపీ పోర్టర్‌లోని ఎల్.ఫారంలో నమోదు చేయాలని సూచించారు. వారంతపు నివేదికలను ఐఎంఎస్ పోర్టర్‌లో నమోదు చేయాలన్నారు. డీఎంవో డాక్టర్ వి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రికార్డులన్నీ బయట కనిపించే విధంగా పెట్టాలన్నారు. సమావేశంలో ఏఎంవో పి.శ్రీనివాసులు, ఎస్‌యూవో సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖ పరిధిలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు శ్రీకారం చుట్టారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చి నిలిచిపోవడంతో ప్రస్తుతం ఆ పోస్టులను భర్తీ చేసేందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి టి.వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న మహిళా నర్సింగ్ ఆర్డనర్లీ(ఎఫ్ఎన్‌వో)లు 5, శానటరి అటెండర్ కం వాచ్‌మెన్( ఎస్ఏడబ్ల్యూఎస్) 8 కలిపి మొత్తం 13 పోస్టులు భర్తీ చేయనున్నారు. గురువారం నుంచి ఈనెల 18వతేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని ఆ నోటిఫికేషన్‌లో కోరారు. ఇతర వివరాలకు వైద్యశాఖ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని డీఎంహెచ్‌వో కోరారు.

## క్షేత్రస్థాయిలో హెల్త్ పెన్షన్ల పరిశీలన



రాజీవ్‌నగర్‌లో లబ్ధిదారుని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నడవలేని స్థితిలో ఉండి నెలకు రూ.15వేలు హెల్త్ పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారుల గృహాలను బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులోని రాజీవ్‌నగర్, సంతనూతలపాడు మండలం పి.తక్కెళ్ళపాడులో ఎన్‌టీఆర్‌భరోసా పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల గృహాలను జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి డాక్టర్ సూరిబాబుతో కలిసి సందర్శించారు. పెన్షన్‌దారులను వైద్యబృందాలు తనిఖీ చేస్తున్న సమయంలోనే డీఎంహెచ్‌వో కూడా ప్రత్యక్షంగా పరిశీలించారు. పెన్షన్ పొందేందుకు ఇచ్చిన ధ్రువీకరణపత్రాలతో పాటు లబ్ధిదారుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ ఇస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు. అనర్హులు ఉంటే తొలగిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో స్పెషలిస్టు డాక్టర్లు కె.విజయచంద్, ఉడతా నిర్మల, ఎస్.గిరిరాజ్, ఆంజనేయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు హరిణి, వాణి పాల్గొన్నారు.

## 17 మంది జూదరుల అరెస్టు

టంగుటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పునాయుడుపాలెం పొగాకు గోడౌన్‌లో నడుస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. 17 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద రూ.3.62లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

## పొలం విషయమై వివాదం - పరస్పర ఫిర్యాదులు

పొన్నలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పొలం విషయమై మండలంలోని చవటపాలెం గ్రామానికి చెందిన రెండు కుటుంబాల మధ్య వివాదం చోటుచేసుకుంది. పోలీసు స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. గ్రామానికి చెందిన నడిపి నరసింహం తనతో పొలం విషయమై గొడవ పడి చెప్పుతో కొట్టి చంపుతానని బెదిరించాడని అదేగ్రామానికి చెందిన జ్యోత్స్న ఫిర్యాదు చేశారు. తాను పొలం పనులకు వెళ్తుండగా అనుమాల ప్రసాద్, చెంచురామయ్య, బోయపాటి జ్యోత్స్న గొడవపడి చంపుతానని బెదిరించారని నడిపినేని కిరణ్ ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనూక్ తెలిపారు.

## అత్యున్నత వ్రతం 'తిరుప్పావై'



గోదాదేవి, శ్రీకృష్ణుల వేషధారణలో అలరిస్తున్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 8(ఆంధ్రజ్యోతి): భగవత్ సాక్షాత్కారం కోసం చేసే వ్రతాలలో జ్ఞానదశను దాటి ప్రేమదశకు చేర్చే అత్యున్నత వ్రతం తిరుప్పావై అని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వెంకటశ్రీనివాసులు పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలు నగరం గాంధీరోడ్డులోని గీతామందిరంలో 24వ రోజు తిరుప్పావై ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా భక్తబృందం గోదాదేవి, శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు కృష్ణ, సురేఖ, దోగిపర్తి సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి, ముప్వల సుబ్బారావు, విజయలక్ష్మి, గుర్రం రాజేష్, చీమకుర్తి శివ తదితరులు పాల్గొన్నారు. అటు సంతపేట సాయిబాబా మందిరంలో తిరుప్పావై పాశుర గోష్ఠిగానం చేశారు. ఆండాళ్ సేవాసమితి నిర్వాహకురాలు దామచర్ల ప్రసన్నకుమారి, అర్చకులు సుధాకర్, సాయి, రామకృష్ణ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

### 12న శ్రీసుదర్శన లక్ష్మీనారసింహ యజ్ఞం

అటు బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలోని స్థానిక గడియారంవారివీధి శ్రీఅనంత కోదండ రామస్వామి దేవస్థానంలో బుధవారం భక్తులు ధనుర్మాస మంగళా శాసన పాశురాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఉపన్యాసకులు శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో గోదాదేవి, శ్రీకృష్ణులకు ప్రత్యేక హారతి ఘనంగా జరిగింది. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త గడియారం సుబ్బయ్యశర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

నాగులుప్పలపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని డీఎల్‌డీవో వై.మహాలక్ష్మి బుధవారం తెలిపారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు తగిన ధ్రువపత్రాలతో గ్రామ సచివాలయాల్లో ఈ నెల 16లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలంలోని 14 గ్రామ పంచాయతీలలోని బీసీలు, ఈబీసీలు సబ్సిడీ రుణాలకు 8 నుంచి 16వతేదీలోపు ఉపాధి యూనిట్లు కోసం బీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో శేషుబాబు కోరారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

మద్దిపాడు: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలను పొందేందుకు ఈనెల 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వి.జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

## తెలుగునాడు డైరీ ఆవిష్కరణ

నాగులుప్పలపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం డైరీని బుధవారం నాగులుప్పలపాడు మండల రిసోర్స్ భవనం వద్ద మాజీ జడ్పీ ఉపాధ్యక్షులు మారెళ్ల వెంకటశేషయ్య, ఎంఈవోలు టి.రవి, ఈవీ. రమణయ్యలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కొత్తగర్ల వెంకట్రావు, గోరంట్ల శ్రీనివాసరావు, చంద్రా శ్రీనివాసరావు, బొద్దులూరి ఆంజనేయులు, గుండ్లాపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## 12న ముగ్గుల పోటీలు

నాగులుప్పలపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 12న ఉప్పుగుండూరు గ్రామంలోని యూనియన్‌బ్యాంక్ వద్ద వాస వి క్లబ్, మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నాలుగు మండలాల స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు క్లబ్ సభ్యులు అమరా వేణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చినగంజాం, కొరిశపాడు, ఇంకొల్లు, నాగులుప్పలపాడు మండలాల పరిధిలోని మహిళలు హాజరుకావాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి దివాన్‌కాట్, రెండో బహుమతి సిల్వర్, మూడు, నాల్గవ బహుమతిగా వెట్ గ్రైండర్, ఐదో బహుమతి మిక్సీ అందించనున్నట్లు తెలిపారు. కన్సోలేషన్ బహుమతులను అందిస్తామని తెలిపారు. వివరాల కు 9866497631, 9985268422 సెల్‌నంబరులో సంప్రదించాలని కోరారు.

## క్విస్ హెచ్‌వోడీకి ఏఐసీటీఈ పీజీ సర్టిఫికెట్



హిమబిందును అభినందిస్తున్న చైర్మన్ సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలు(విద్య), జనవరి8(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ హెచ్‌వోడీగా పనిచేస్తున్న డాక్టర్ సీహెచ్.హిమబిందుకు పాట్నా ఐఐటీ నుంచి ఏఐసీటీఈ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ పీజీ పట్టాను ప్రదానం చేసింది. బ్లాక్ చైన్ అండ్ డేటా సైన్స్ అంశంలో ఆమెకు ఈ సర్టిఫికెషన్ లభించింది. ఏఐసీటీఈ ఫండింగ్‌తో హిమబిందు ఈ ఆరునెలల ప్రత్యేక కోర్సును పూర్తి చేశారు. ఢిల్లీలోని ఏఐసీటీఈ ప్రధాన కార్యాలయంలో ఆమెను ఈనెల 31న సన్మానించనున్నారు. ఈ మేరకు హిమబిందుకు సంస్థ నుంచి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కళాశాలలో హిమబిందును క్విస్ విద్యాసంస్థల చైర్మన్ ఎన్.సూర్యకల్యాణచక్రవర్తి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు అభినందించారు.

## ఆటపాటలతో ఆరోగ్యం : ఎంపీపీ



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంపీపీ అరుణ, ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆటపాటలతో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపీపీ వాకా అరుణ పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయంలో సచివాలయాల ఉద్యోగులకు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి సంతోష భవాని, మ్యూజికల్ చైర్స్‌లో పి.మానస, రెండో బహుమతి కె.శివదుర్గ సాధించారు. లెమన్ అండ్ స్పూన్‌లో ఎన్.హేమలత ప్రథమ బహుమతి, ద్వితీయ స్థానంలో డి.సంతోష్ భవాని, తృతీయ స్థానంలో పి.మానస నిలిచారు. టగ్ ఆఫ్ వార్ పోటీలో వైద్యశాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తలపడగా సచివాలయ సిబ్బంది గెలుపొందారు. కబడ్డీ పోటీలో ఈ రెండు జట్లు తలపడగా సచివాలయ సిబ్బంది విజయం సాధించారు. విజేతలకు ఎంపీపీ అరుణ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో వరప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సుగుణరావు, వినయ్, సీహెచ్‌వో రంజితకుమారి, కె.బాలకోటయ్య పాల్గొన్నారు.

## సచివాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలి

మద్దిపాడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నందిపాడు వ్యవసాయ పరపతి సంఘం రైతులు సచివాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలని సొసైటీ సీఈవో ఎన్.రామచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో సచివాలయాల్లో మాత్రమే రైతులు ఈకేవైసీ అప్డేట్ చేయించుకోవాలని కోరారు.

## బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

మద్దిపాడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన జుట్టి పద్మారావు బైక్‌పై వెళుతూ నాగేశ్వరరావు అనే వ్యక్తిని ఢీకొనగా అతని కుడికాలుకు బలమైన గాయం అయింది. అతనిని హైవే అంబులెన్స్ ద్వారా రిమ్స్ వైద్యశాలకు తరలించారు. దీంతో పద్మారావును స్థానికులు పోలీసులకు అప్పగించారు.

## పంట పొలాల పరిశీలన

కొండపి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెట్లూరు, మూగచింతల, చినకండ్లగుంట, తాటాకులపాలెం గ్రామాల్లో వ్యవసాయాధికారులు బుధవారం పంట పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మిర్చి, వరి, కంది పైర్లను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు ఇచ్చారు. వీఏఏలు పద్మ, వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

# 'లఖ్‌పతి దీదీ'తో మహిళల అభ్యున్నతి

గ్రామీణ మహిళలకు ఆర్థిక భరోసా

విరివిగా బ్యాంకు లింకేజీ రుణాలు

స్వయంగా పథకం గురించి వివరించిన ప్రధాని



డ్వాక్రా గ్రూపు సభ్యుల సమావేశం (ఫైల్)

సంతనూతలపాడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపు సంఘాల సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించి, వారిని లక్షాధికారిని చేయాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం లఖ్‌పతి దీదీ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీడియో సమావేశంలో డ్వాక్రా గ్రూపు సంఘాల సభ్యులకు ఈ పథకం లక్ష్యం, అమలు తీరును స్వయంగా వివరించారు. మహిళలకు వివిధ రకాల నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి కల్పిస్తారు. పెట్టుబడిగా వడ్డీ లేని రుణాలను అందిస్తారు. గత సంవత్సరం ఈ పథకం వచ్చిన ఎక్కువమంది వినియోగించుకోలేదు. ఈ ఏడాది బడ్జెట్లో సుమారు 3కోట్ల మందికి అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### అర్హులు ఎవరంటే..

గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళలు, డ్వాక్రా గ్రూపు సంఘాలలో సభ్యులై 18 ఏళ్లపైబడి, 50 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలి. ఈ అర్హతలు కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. సంఘం సభ్యత్వ కార్డు, ఆధార్, పాన్‌కార్డు, కులధృవీకరణ పత్రం, బ్యాంకు పాసుపుస్తకం, ఫోన్‌నెంబరు, రెండు చిన్న పాసుపోర్టు సైజు ఫొటోలు అవసరం. మహిళ శిశు అభివృద్ధి కార్యాలయం దరఖాస్తు తీసుకుని పూర్తి చేసి, పైన తెలిపిన ధృవీకరణ పత్రాలను జతచేసి అధికారులకు అందించాలి.

### అవసరమైన శిక్షణ ఉచితమే

లఖ్‌పతి దీదీ పథకం ద్వారా రుణానికి దరఖాస్తు చేసుకుని మంజూరైతే వ్యాపారానికి అవసరమైన శిక్షణ ఇస్తారు. ఆర్థిక నిర్వహణ ఆన్‌లైన్ వ్యాపారం, మార్కెటింగ్, వ్యాపార మెలకువలపై శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తారు. ఈ పథకానికి అర్హులైన సభ్యురాలు ఏటా లక్షరూపాయలు వచ్చేలా చూస్తారు. ఆ మొత్తంతో చేపలు, ఆవులు, కోళ్లు, పొట్టేళ్లు వంటివి పెంచుకోవచ్చు. జీవనోపాధి పొందడానికి ఆయా రంగాలపై శిక్షణ పొందవచ్చు. నైపుణ్యశిక్షణ, రుణాల మంజూరు, మార్కెటింగ్ వంటి సదుపాయాలను డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు చూసుకుంటారు. మండలంలో పాడిఆవులు, గొర్రెలు, పొట్టేళ్లు, కోళ్లఫారాల వంటి వాటిపై ఆధారపడి జీవిస్తున్నారు. వారు ఇలాంటి జీవనోపాధి లభించే వ్యాపారాలు చేసుకోవచ్చు.

### అవగాహన కల్పిస్తున్నాం



లఖ్‌పతి దీదీ పథకం గురించి సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. అర్హులైన ప్రతీ సభ్యురాలికి రుణాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

- బాబూరావు, ఏపీఎం, సంతనూతలపాడు

# రేపటి ధర్నాను విజయవంతం చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ



కార్మికులతో మాట్లాడుతున్న నారాయణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం ఒంగోలులో ముఠా కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజల సంక్షేమం పక్కన పెట్టి కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇచ్చి పేదలపై భారాలు మోపిందని ఆరోపించారు. అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టడంతో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయడంతో పాటు సొంత ఇంటి కలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు దళిత, గిరిజన కాలనీలకు 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటును ఎత్తివేయడం దారుణంగా ఉందన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం జరిగే ధర్నాలో కార్మికులు, ప్రజలు, పేదలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ శ్రీనివాస్, సీహెచ్.వెంకటేశ్వర్లు, సుబ్బారావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# వరిలో ఉల్లికోడు పట్ల అప్రమత్తంగా ఉండాలి

● ఏవో వెంకట్రావు





తిమ్మసముద్రం రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో వెంకట్రావు



పెళ్లూరులో మాట్లాడుతున్న ఏవో కిషోర్‌బాబు

నాగులుప్పలపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో వచ్చే ఉల్లికోడు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో పి.వెంకట్రావు సూచించారు. తిమ్మసముద్రం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఉల్లికోడు పురుగు నివారణకు బెల్ట్ ఎక్స్‌పర్ట్ 80ఎంఎల్, అగ్గితెగులు సోకితే ఆకులపైన నూలుకండె ఆకారంలో గోధుమరంగు మచ్చలు కనిపిస్తాయని, నివారణకు ఫ్యూజివన్400 ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయాలని వివరించారు. రబీలో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. పంటల బీమా పొందేందుకు ఈ నెల 15 వరకు గడువు ఉందని చెప్పారు. ఈ నెల 20వ తేదీ తర్వాత వరి కోతలు మొదలుకానున్నాయని, రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధరకు అమ్ముకోవాలని కోరారు. 24 గంటల్లో నగదును రైతు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యురాలు అనురాధ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఒంగోలు(రూరల్): పెళ్లూరు చెరువు కింద సాగు చేసిన వరి పంటకు చీడలు ఆశించకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో బి.కిషోర్‌బాబు కోరారు. ఒంగోలు మండలం పెళ్లూరు, యరజర్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహిచారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వరి పైరులో ఆకు ముడత తెగులు కనిపిస్తున్నదని, దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4గ్రాములు ఒకలీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. యరజర్లలో మినప, పెళ్లూరులో వరిపంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవోలు రామకృష్ణారెడ్డి, ఆదిమూర్తి పాల్గొన్నారు.

# నేడు ఉగ్రన్న యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ

పామూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా ఉగ్రన్న యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పామూరులో గురువారం మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం అవుతుందని ఆర్గనైజర్, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించనున్నారని చెప్పారు. ప్రథమ బహుమతిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జేఆర్‌కె ఫౌండేషన్ అధినేత కోటపాటి జనార్దనరావుచే రూ.50,116, ద్వితీయ బహుమతి ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావుచే రూ.35,116, తృతీయ బహుమతి శ్రీబాలాజీ జ్యూయలర్ అధినేత అల్లు శ్రీనివాసులచే రూ.20,116 అందచేయనున్నారు. స్పోర్ట్ కిట్‌ను టీడీపీ నాయకులు యారవ శ్రీను, షీల్డ్‌ను పట్టణ టీడీపీ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ షీల్డ్ దాత ఒంగోలు పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి ఆర్‌ఆర్ రఫీ, మ్యాన్ ఆఫ్ ది సీరిస్ దాత నియోజకవర్గ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ముబినామౌలాలి అందచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### టీడీపీ ఆధ్వర్యంలో మెగా కబడ్డీ టోర్నమెంట్

దొనకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత సీఎం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కుందుర్తి లక్ష్మణ్ తెలిపారు. మొదటి బహుమతి రూ.20116 నగదును మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి మస్నెం గాలయ్య, రెండవ బహుమతి రూ.10116 నగదును టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, మూడో బహుమతి రూ.7116 నగదును నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కుందుర్తి లక్ష్మణ్, నాల్గో బహుమతి రూ.5116లను లైవ్‌స్టాక్ అధ్యక్షులు పల్లె మహీందర్‌దేవ్, విన్నర్స్ రన్నర్స్ ట్రోఫీలు, షీల్డులు శృంగారపు నాగసుబ్బారెడ్డి, షేక్ మస్తాన్, కాళ్ల హనుమంతు, కోటపాటి రామారావు, అంకాల మల్లికార్జున, పోతిపోగు చెన్నయ్యలు అందజేస్తారన్నారు.

ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 11వ తేదీ లోపు ఎంట్రీఫీజు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నా శాఖ.. నా స్తంభం..

# నా వీధి..నా ఇల్లు..!

ఇంటి నిర్మాణానికి అడ్డొచ్చిందని రోడ్డుపైకి విద్యుత్ పోల్ మార్పు

కనిగిరిలో కుచించుకుపోయిన రోడ్డు

ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఆ సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగి

మున్సిపల్ నిబంధనలను కూడా తుంగలో తొక్కి పనులు



స్తంభానికి, స్తంభానికి వైర్లు మెలికలు తిప్పి మరీ నడిరోడ్డులో వేసిన స్తంభం

కనగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి : తన ఇంటి నిర్మాణానికి అడ్డుగా ఉందని ఏకంగా విద్యుత్ స్తంభాన్ని రాత్రికి రాత్రి నడిరోడ్డు పైకి మార్చాడు ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి. దీంతో అక్కడ రోడ్డు మరింత ఇరుకుగా మారడంతో రాకపోకలకు స్థానికులు అల్లాడిపోతున్నారు. ఈ నిర్వాకానికి కారకుడు విద్యుత్‌శాఖ డీఈఈ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి కావటం గమనార్హం. ఈ సంఘటన కనిగిరి పట్టణంలోని సాయిబాబాగుడి వీధిలో చోటుచేసుకుంది. సాధారణ వ్యక్తి తన ఇంటి మీటరో, లేదా తమ పొలంలోకి విద్యుత్ స్తంభమో మంజూరుకావాలంటే యజ్ఞం చేసినంత కష్టపడాలి. నిబంధనల పేరుతో అధికారులు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిప్పుతారన్న విమర్శలు ఉన్నాయి. కానీ అదే శాఖలో ఓ మామూలు వాచ్‌మెన్ ఉద్యోగికి ఆగమేఘాల మీద అడ్డదిడ్డమైన పనులన్నీ జరిగిపోవడం గమనార్హం. విద్యుత్ వైర్లు ఆకాశంలోనే మెలికలు తిప్పుతూ ఇష్టం వచ్చినట్లు స్తంభం బిగించారు. అంతేకాకుండా సదరు వాచ్‌మెన్ తన ఇంటి నిర్మాణంలో మున్సిపల్ నిబంధనలను కూడా తుంగలో తొక్కారు. 4 అడుగులు స్థలం వదిలకుండానే నిర్మాణం చేస్తున్నారు. ఎలాంటి పరిశీలన చేయకుండా ప్లాన్‌కు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వటం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి. అంతేకాకుండా నాలుగు రోడ్లు కూడలిలో రోడ్డుకు మధ్యగా విద్యుత్ స్తంభం వేయటం ప్రమాదరకంగా మారింది. కొత్తదానికి సమాంతరంగా ఉన్న మరో స్తంభానికి దూరం లేకపోవడంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీనిపై ఏఈ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా డీఈఈ రోడ్డుపై వేసుకోవాలని సదరు వాచ్‌మెన్‌కు అనుమతి ఇచ్చినట్లు చెప్పటం గమనార్హం.

## పొగాకు బ్యారన్ దగ్ధం

చీమకుర్తి, జనవరి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనంనేనివారిపాలెం గ్రామంలో బుధవారం రాత్రి క్యూరింగ్‌లో ఉన్న పొగాకు బ్యారన్ అగ్నికి ఆహుతి అయింది. గ్రామానికి చెందిన రైతు సోమినేని సుబ్బారావుకు చెందిన బ్యారన్‌లో సుమారు 1400 కర్రను అల్లి క్యూరింగ్ చేస్తున్నారు. ప్రమాదవశాత్తు కర్ర జారిపడటంతో మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళం మంటలను వ్యాపించకుండా అదుపులోకి తీసుకువచ్చారు. కానీ బ్యారన్ పూర్తిగా అగ్నికి ఆహుతి కావటంతో రైతుకు రూ.లక్షల్లో ఆస్తినష్టం వాటిల్లింది. పొగాకు బోర్డు అధికారులు రైతును ఆదుకోవాలని కోరుతున్నారు

## వరికి 15లోపు బీమా చేయించుకోవాలి

మద్దిపాడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో వరిపంట సాగు చేసిన రైతులు ఈనెల 15వ తేదీలోపు వరి పంటకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఏవో జి.రమేష్ బాబు బుధవారం కోరారు. స్థానిక రైతు సేవా కేంద్రాలో ఇన్సూరెన్స్ చేయించుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

## రేపటి నుంచి ఒంగోలులో ప్రాపర్టీ, రియాలిటీ షో

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఏ1 ఫంక్షన్ హాలులో ఈనెల 10వ తేదీ నుంచి మూడు రోజులపాటు క్రెడాయ్ ప్రాపర్టీ, మెటీరియల్ షో ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఒంగోలులోని ఎన్‌జీఏ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధ్యక్షుడు జి.రాజేంద్ర మాట్లాడుతూ ఇల్లు కొనుగోలు చేయాలనుకునే వారికి సులభతరంగా ఉండేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా ఇల్లు కట్టుకునేవారికి అవసరమైన మెటీరియల్, ఇంటీరియర్ వర్క్‌లకు అవసరమైన వాటని అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శనను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా తొలిరోజు ప్రారంభకులుగా ప్రజాప్రతినిధులు, కలెక్టర్ తమీమ్ అన్సారియా ముఖ్య అతిథులుగా హాజరవుతారని వివరించారు. సమావేశంలో ట్రెజరర్ మునగా తిరుమల, సెక్రటరీ ప్రస న్నాంజనేయులు, ప్రతినిధులు ఇలింద్ర వీరబాబు, హరి శ్రీనివాసరావు, ఐజక్, సీహెచ్.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

కురిచేడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : కురిచేడు సమీపంలోని దర్శి బ్రాంచి కాలువలో బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైంది. దర్శి బ్రాంచి కాలువలో నమశ్శివాయపురం బ్రిడ్జి సమీపంలో కాలువలోకి వంగిన చెట్ల మధ్య యువకుని మృతదేహం ఇరుక్కుంది. దానిని గొర్రెల కాపరులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీయించారు. మృతదేహంపై ప్యాంటు మాత్రమే ఉంది. కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

కురిచేడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 28 మందిని పట్టుకుని వారికి రూ.1.49 లక్షలు, అలాగే అదనపు లోడ్ వాడుతున్న 44 మందిని గుర్తించి వారికి రూ.168 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ హైమవతి, దర్శి ఈఈ శ్రీనివాసులు, డీఈఈలు వీ క్రిష్ణారెడ్డి, హరిబాబు, కె.వెంకటేశ్వర్లు, కురిచేడు ఏఈ రామక్రిష్ణారెడ్డి, దర్శి డివిజన్‌లోని 11 మండలాలకు చెందిన ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.

## పాము కాటుతో వ్యక్తి మృతి

వెలిగండ్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇమ్మడిచెరువు గ్రామానికి చెందిన వేసపోగు జాన్(59) పాము కాటుతో మృతి చెందాడు. మంగళవారం ఇంటి బయట నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో పాము కాటు వేసింది. వెంటనే మేలుకుని పామును చంపేశాడు. ఆ తర్వాత కుటుంబసభ్యులు అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

## గుండెపోటుతో రిటైర్డ్ వాచ్‌మన్ మృతి

పామూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల రిటైర్డ్ వాచ్‌మన్ చావ వీరాంజనేయులు గుండెపోటుతో బుధవారం పాఠశాల వద్దే కిందపడి మృతి చెందారు. మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన అతను బుధవారం పాఠశాలలో జరుగుతున్న పేరంట్ కమిటీ సమావేశానికి వచ్చారు. అక్కడ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేదు.

## వైసీపీకి బీసీ నేత రాజీనామా

తాళ్లూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంబొట్లపాలెం వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మూరబోయిన తిరుపతయ్య ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆ మేరకు బుధవారం ఆయన ప్రకటించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. అంతేగాక ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి అనుచరుడిగా ఉంటూ గ్రామంలో పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. పార్టీలో ప్రాధాన్యత లేకపోవటంతో మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు తిరుపతయ్య తెలిపారు.

## దోబీఘూట్ స్థలాన్ని కాపాడండి

కనిగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హనుమంతునిపాడులో ఎర్రవాగులో ఆక్రమణకు గురైన దోబీఘాట్ స్థలాన్ని కాపాడాలని కోరుతూ రజకవృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో హనుమంతునిపాడులో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య మాట్లాడుతూ 1997లో హనుమంతునిపాడులోని 52 సర్వేనెంబరులో 8.62ఎకరాలను దోబీఘాట్ కోసం కేటాయించారని తెలిపారు. వీటి ఆక్రమణ వల్ల కులవృత్తినే నమ్ముకుని జీవించే వారికి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, రజకవృత్తిదారులు చెన్నయ్య, నాగేశ్వరరావు, బాలకృష్ణ, చందు, సూరి, లక్ష్మయ్య, రమేష్, కేశవులు, కేశవరావు, చిన్నబాబు, బాల పాల్గొన్నారు.

## పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

● ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్‌జీవో హోంలో ఎస్టీయూ మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిలిచిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులను జిల్లాలో చేపట్టాలని కోరారు. ఉద్యోగుల యాప్‌లను రద్దు చేయాలని, అలాగే 117 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెలవులలో 10వ తరగతి స్టడీ నిర్వహణలో పాల్గొనే ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని కార్యవర్గ సభ్యులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ముందుగా నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించి దాతల సహకారంతో ఇచ్చిన బ్యాగులను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తిరుపతినాయక్, జిల్లా కౌన్సిలర్ బి. శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి మాలకొండనాయక్, కార్యవర్గ సభ్యులు డీజే.ప్రభాకరరావు, గుల్షన్ బేగ్, ముండ్ల జాకోబ్, జిడ్డు వెంకటేశ్వర్లు, ఎంజే ప్రసాద్, సతీష్, బి.శ్రీనివాసరావు, ఆత్మానంద ప్రభాకర్, నాగలక్ష్మి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

## ఆలయాల్లో ధనుర్మాస ప్రత్యేక పూజలు

● వేంకటేశ్వరునికి ముత్యాల హారతులు



ముత్యాలహారతి పూజల్లో పాల్గొన్న భక్తులు

త్రిపురాంతకం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, పాత రామాలయం, కోదండ రామాలయాల్లో ధనుర్మాసం సందర్భంగా గత నెల 16 నుంచి పూజలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం 24వ రోజు శ్రీగోదారంగనాయకస్వామి వారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు ముత్యాల హారతులు అందజేశారు. వేంకటేశ్వరుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## అవీ..ఇవీ


కంభంలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి

### ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు

కంభం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణంలోని పలు ట్రాన్స్ పోర్టు కార్యాలయాలో ఇతర ప్రాంతాలకు పంపుతున్న సీల్ ప్యాక్‌లను కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తనిఖీలు చేశారు. పట్టణంలోని కార్గోపార్సిల్స్, ఎస్‌ఆర్‌ఎంటీ, నవత, సేఫ్‌ఎక్స్ తదితర కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. రవాణా అవుతున్న పార్సిల్స్‌లో నిషేధిత మత్తుపదార్థాలు ఉన్నాయనే అనుమానంతో తనిఖీలు నిర్వహించామని సీఐ తెలిపారు. పార్సిల్స్ అనుమానంగా ఉన్నట్లయితే అధికారులు తెలియచేయాలన్నారు.


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

### ముందస్తు సంక్రాంతి సంబరాలు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నగర్‌లోని సాయి చైతన్య హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజక వర్గ టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి పాల్గొని తొలుత సంక్రాంతి పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శ్రద్ధతో చదువుకోవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. చదువుతోనే అన్నిరకాల అభివృద్ధి చేకూరుతుందని చదువుతో పాటు ఆటలలో నైపుణ్యం కనబర్చాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక మన పండుగలు అన్నారు. అనంతరం బాలబాలికలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అనారోగ్యంతో ఉన్న పెన్షనర్ వద్ద ఐరిస్ తీస్తున్న సంఘం నాయకులు

### ఇంటికే పరిమితమైన పెన్షనర్లకు చేయూత

పొదిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల డిజిటల్ సర్టిఫికెట్‌ల నమోదు ప్రక్రియ ప్రారంభమై వారం రోజులు కావస్తోంది. ఈ తరుణంలో ఇంటికే పరిమితమైన 30 మంది పెన్షనర్లకు అసోసియేషన్ సభ్యులు ఇంటింటికీ వెళ్లి వారి ఐరిస్ తీసుకొని అక్కడికక్కడే డిజిటల్ సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న, నడవడానికి వీలుకాని, వివిధ రకాలుగా ఇబ్బందులు పడుతున్న విశ్రాంత ఉద్యోగులకు సంఘం నాయకులు చేయూతను అందించడంతో పెన్షనర్‌లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈకార్యక్రమంలో పెన్షనర్‌ల సంఘం అధ్యక్షులు ఏ బాదుల్లా, ప్రధాన కార్యదర్శి మదార్‌వలి, చిట్టెం సుబ్బారావు, కేజే మోహన్‌రావులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న కమిషనర్

### గుంతల పూడ్చివేత పనుల పరిశీలన

గిద్దలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కల్వర్టులకు, రోడ్ల మధ్యలో ఏర్పడిన గుంతలను పూడ్చే కార్యక్రమానికి మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో కల్వర్టులకు పడిన గుంతను, పలు రోడ్లలో గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టారు. కమిషనర్ వెంకటదాస్ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు.


ఆధార్ అప్‌లోడ్ చేసి రసీదు అందజేస్తున్న ఎంపీడీవో, సీడీపీవో


### పిల్లలకు ఆధార్ నమోదు ప్రారంభం

పొదిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో శోభన్‌బాబు బుధవారం ప్రారంభించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశామని, ఎవరైనా చిన్న పిల్లలకు ఆధార్ నమోదు చేయించాల్సిన వారు ఉంటే వెంటనే నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.



# కంభం చెరువులో 8 అడుగుల నీరు

### తాగునీటి అవసరాలకు నిల్వ


కంభం చెరువులో ఉన్న నీరు

కంభం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద చెరువుగా పేరు గాంచిన కంభం చెరువులో ప్రస్తుతం 8 అడుగులమేర నీరు మాత్రమే ఉన్నది. 5వేల హెక్టార్ల విస్తీర్ణంలో 21 అడుగుల లోతు గల కంభం చెరువుకు నీరు చేరాలంటే నల్లమల అడవుల్లో భారీ వర్షాలు కురిస్తే గుండ్లకమ్మ, జంపలేరు వాగుల ద్వారా నీరు చేరుతుంది. 2021లో కురిసిన భారీ వర్షాలకు కంభం చెరువుకు 18 అడుగులమేర నీరు చేరింది. 2023, 2024లో చెదురుమదురు వర్షాలతో చెరువుకు కొద్దిమేర మాత్రమే నీరు చేరింది. మొత్తం 36 అడుగుల లోతు కలిగిన కంభం చెరువులో ప్రస్తుతం 16 అడుగుల మేర పూడిక ఏర్పడింది. అదిపోను 21 అడుగుల పైన నీరు వస్తే చెరువు అలుగు పారుతుంది. ప్రస్తుతం ఉన్న 8 అడుగుల నీటిని తూముల నుంచి బయటకు వదలకుండా అలాగే ఉంచుతున్నట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. చెరువులో నిల్వ ఉన్న నీటి వలన కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లో భూగర్భజలాలు పెరిగి బోర్లలో నీరు ఉంటుందన్నారు. చెరువులో 10 అడుగులపైన నీరు ఉంటేనే సాగునీటికి వదులుతామని తెలిపారు. ప్రస్తుతం రైతులు శనగ పంటను వేసినందున నీటి అవసరం లేదని తెలిపారు.

### వందేళ్లలో నిండింది 11 సార్లే

కంభం చెరువు గత వందేళ్లలో నిండింది కేవలం 11 సార్లేనని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. 1917, 1948, 1949, 1950, 1956, 1963, 1966, 1975, 1983, 1996, 2022 సంవత్సరాలలో చెరువు నిండి అలుగు పారింది. 2009, 2021 సంవత్సరాలలో కురిసిన భారీ వర్షాలకు చెరువుకు 18 అడుగుల మేర మాత్రమే నీరు చేరింది. మొత్తం 20 అడుగుల లోతు కలిగిన చెరువుకు మరో 2 అడుగులమేర నీరు చేరి ఉంటే 13 సార్లు నిండి ఉండేది. చెరువు కింద 10వేల ఎకరాలు అధికారికంగా, 7వేల ఎకరాలు అనధికారికంగా సాగు చేస్తున్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీతో రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య


రచ్చబండ వద్ద రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

గిద్దలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మునూరు, తాళ్ళపల్లి గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం గురించి రైతులకు వివరించారు. దీని ద్వారా ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తామని పేర్కొన్నారు. భూమి గల రైతు, కౌలు రైతు, వ్యవసాయ కూలీ, వ్యవసాయ ఆధారిత వృత్తులపై జీవించే వారు అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల రాయితీలు, భూ ఆధారిత చెల్లింపులు, పంటల బీమా, పంట నష్టపరిహారం, వడ్డీ రాయితీ, వ్యవసాయ పనిముట్లు, ఫార్మర్ రిజిస్ట్రీ నెంబరు ఉన్న వారు పొందవచ్చని పేర్కొన్నారు. గ్రామసభల అనంతరం కంది, శనగ పంటలను నేరుగా పరిశీలించి చీడపీడలు, నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సహాయకులు యూసఫ్, మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

### కొమరోలులో..

కొమరోలు : భూమి కలిగిన ప్రతి రైతు తమ వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకుని ప్రభుత్వం నుంచి లబ్ధిపొందాలని మండల వ్యవసాయాధికారి రాజశ్రీ తెలిపారు. మండలంలోని అల్లీనగరం, గోనెపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. మండలంలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో ఈ ఐడీ నెంబరు నమోదు చేసుకోవచ్చునన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కే శిరీష, గ్రామ సహాయకులు రమణమ్మ, లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.

# శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

తర్లుపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన శనగ పంటకు ప్రస్తుతం పచ్చపురుగు, ఎండు తెగులు ఉధృతంగా ఉందని, దీని నివారణకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తుమ్మలచెరువు, జగన్నాథపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంది, శనగ, మినుము, మిరప పంటలు పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఉద్యాన శాఖాధికారి రమేష్ మాట్లాడుతూ బొప్పాయి పంటకు ప్రస్తుతం మొజాయిక్ వైరస్ తెగులు ఉన్నదని, దీని నివారణకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు భోపాల్, శ్రీనివాసులరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### పంటలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఎర్రగొండపాలెం రూరల్ : రైతులు సాగు చేసిన పంటల వివరాలను స్థానిక సచివాలయంలో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని ఎర్రగొండపాలెం ఏవో కేవీ శేషారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గంగాపాలెం, నరసాయపాలెం గ్రామాలలో రైతులు సాగు చేసిన కంది, మిరప, పత్తి తదితర పంటలను పరిశీలించారు. ముందుగా రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి సబ్సిడీ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది బి. నాగేంద్ర కుమార్, కె. మంత్రునాయక్ రైతులు పాల్గొన్నారు.


ఎర్రగొండపాలెం : మిరపలో తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

### తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

పొదిలి : తుఫాన్ అనంతరం పంటలకు సోకిన తెగుళ్ల పట్ల అన్నదాతలు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి షేక్ జైనలుబ్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని కుంచేపల్లి, దాసర్లపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. అధిక వర్షాల వలన కందిలో పూత రాలిపోయి దిగుబడి తగ్గుతుందని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పూతరాలకుండా ప్లోనోఫిక్స్ లీటర్ నీటిలో 2ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు. అనంతరం కంది, మిరప, పొగాకు తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



గొబ్బూరులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్

పెద్దారవీడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తున్నదని తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్ అన్నారు. మండలంలోని గొబ్బూరులో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఐ గోపి, సర్వేయర్ గోపాల్‌రెడ్డి, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

### ఎర్రగొండపాలెంలో..

ఎర్రగొండపాలెం రూరల్ : రెవెన్యూ సదస్సుల ద్వారా స్థానిక భూ సమస్యలు అక్కడిక్కడే పరిష్కరించవచ్చునని ఎర్రగొండపాలెం తహసీల్దార్ ఏ బాల కిషోర్ అన్నారు. బుధవారం మండలంలోని గంగాపాలెం సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వో బాలేశ్వరరావు, సర్వేయర్ రాజు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### తర్లుపాడులో..

తర్లుపాడు: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నదని తహసీల్దార్ విజయ్ భాస్కర్ అన్నారు. బుధవారం తర్లుపాడులో రెవెన్యూ గ్రామసదసున నిర్వహించారు. వైసీపీ నాయకులు చేసిన అక్రమాలపై పలువురు అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 39 అర్జీలు వచ్చాయి. వీటిపై తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సభలో ఇచ్చిన అర్జీలకు 45 రోజుల్లోపు పరిష్కారం చూపుతా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూరెడ్డి భూలక్ష్మి, గ్రామ సర్పంచ్ పల్లెపోగు వరాలు, ఎండోమెంట్ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### గిద్దలూరులో..

గిద్దలూరు : గిద్దలూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో 31 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఆంజనేయరెడ్డి తెలిపారు. మ్యూటేషన్ కోసం 20, సర్వేకు 9, ఇతరత్రా 2 దరఖాస్తులు వచ్చాయని, వెంటనే వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



కొమరోలు మండలం తాటిచర్లలో అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి

### రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక చర్యలు

కొమరోలు : మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తాటిచర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో బుధవారం తహసీల్దార్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని రైతుల సమస్యలు అన్ని పెండింగులో ఉంటున్నాయని, వాటిపై ప్రత్యేక శ్రద్ధతీసుకుని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి : ఎస్టీయూ

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కే ఎర్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్‌జీవో హోంలో ఎస్‌టీయూ మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిలిచిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులను చేపట్టాలని కోరారు. ఉద్యోగుల యాప్‌లను రద్దు చేయాలని, అలాగే 117 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెలవులలో 10వ తరగతి స్టడీ నిర్వహణలో పాల్గొనే ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని కార్యవర్గ సభ్యులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ముందుగా నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించి దాతల సహకారంతో ఇచ్చిన బ్యాగులను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి తిరుపతి నాయక్, జిల్లా కౌన్సిలర్ బి. శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి మాలకొండ నాయక్, కార్యవర్గ సభ్యులు డీజే ప్రభాకర రావు, గుల్షన్ బేగ్, ముండ్ల జాకోబ్, జిడ్డు వెంకటేశ్వర్లు, ఎంజే ప్రసాద్, సతీష్, బి. శ్రీనివాస రావు, ఆత్మానంద ప్రభాకర్, నాగలక్ష్మి, ఈశ్వరమ్మలతో పాటు పలువురు పాల్గొని మాట్లాడారు.

## వైరస్‌పై అపోహలు వద్దు

● సూపరింటెండెంట్ డాక్టర్ యాదిద్వ

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంపీవీ వైరస్ అంత ప్రమాదం కాదని నిపుణులు చెబుతున్నారని, ప్రమాదకరం కాకపోయినా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ యాదిద్వ దేవర సూచించారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. వైరస్. జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస తీసుకోవడం లాంటివి ఉంటే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని అన్నారు. ఏరియా వైద్యశాల పరిధిలోని ప్రజలు ఏదైనా సమస్యలు ఉంటే డాక్టర్లను కలవాలని సూచించారు. జలుబు, దగ్గు ఉంటే మాస్క్ ధరించి, చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు.


ఎఫ్‌ఏలకు ఫీల్డ్‌లో శిక్షణ ఇస్తున్న ఉపాధి హామీ అధికారులు

## ఉపాధి పనులపై ఫీల్డ్ అసిస్టెంట్‌లకు శిక్షణ

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులపై ఫీల్డ్ అసిస్టెంట్‌లకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. మండలంలోని నరసాయపాలెం గ్రామంలో చేపట్టిన ఈ శిక్షణ తరగతులలో మార్కాపురం ఏపీడీ జీకే నిర్మలా దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రానున్న కాలంలో పంట పొలాల్లో రైతులకు ఉపయోగపడే పనులపై దృష్టి సారించి వాటిపై శిక్షణ పొంది పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఎర్రగొండపాలెం ఏపీవో ఎంశైలజ, ఐటీడీఏ ఏపీవో కె. నాగేశ్వరరావులు పొలాల్లో చేపట్టే ట్రెంచులు, కందకాలు, ఫారంపాండ్స్, కుంటలు, కొలతలు తదితర వాటిపై ఫిల్డ్ అసిస్టెంట్‌లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల ఈసీలు, టీఏలు, ఫిల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### పెద్దారవీడుకు 121 ఉపాధి యూనిట్ల మంజూరు

పెద్దారవీడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుద్యోగ యువతకు 121 ఉపాధి యూనిట్లు మంజూరైట్లు ఎంపీడీవో ఎస్. జాన్‌సుందరం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని నాన్ బ్యాంకింగ్ పరిధిలో 104 యూనిట్లు, బ్యాంకింగ్ పరిధిలో 17 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుబడిన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఈనెల 16వ తేదీలోపు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.


త్రిపురాంతకంలో ముత్యాలహారతి పూజల్లో పాల్గొన్న భక్తులు

## ఆలయాల్లో ధనుర్మాస ప్రత్యేక పూజలు

● వేంకటేశ్వరునికి ముత్యాల హారతులు

త్రిపురాంతకం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, పాత రామాలయం, కోదండ రామాలయాల్లో ధనుర్మాసం సందర్భంగా గత నెల 16 నుంచి పూజలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం 24వ రోజు శ్రీగోదారంగనాయకస్వామి వారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ముత్యాల హారతులు అందజేశారు. వేంకటేశ్వరుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### 42 కోతులు పట్టివేత

గిద్దలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోతులు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు లోను చేస్తున్నాయన్న స్థానికుల ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు స్పందించారు. వెంటనే వాటిని పట్టుకుని ప్రజల ఇబ్బందులు తీర్చాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దాంతో స్పందించిన మున్సిపాలిటీ అధికారులు కోతులు పట్టేవారిని పిలిపించి తొలిరోజు 42 కోతులను బంధించారు. వాటిని నల్లమల అటవీ ప్రాంతంలో వదిలిపెడుతున్నట్లు కమిషనర్ వెంకటదాస్ తెలిపారు.


బోనులో బంధించిన కోతులు

## పాము కాటుతో వ్యక్తి మృతి


జాన్(ఫైల్)

వెలిగండ్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇమ్మడిచెరువు గ్రామానికి చెందిన వేసపోగు జాన్(59) పాము కాటుతో మృతి చెందాడు. మంగళవారం ఇంటి బయట నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో పాముకాటు వేసింది. వెంటనే మేలుకుని పామును చంపేశాడు. ఆ తర్వాత కుటుంబసభ్యులు అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

## గుండెపోటుతో రిటైర్డ్ వాచ్‌మన్ మృతి

పామూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల రిటైర్డ్ వాచ్‌మన్ చావ వీరాంజనేయులు గుండెపోటుతో బుధవారం పాఠశాల వద్దే కిందపడి మృతి చెందారు. మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన అతను బుధవారం పాఠశాలలో జరుగుతున్న పేరంట్ కమిటీ సమావేశానికి వచ్చారు. అక్కడ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేదు.

## సాగర్ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

కురిచేడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : కురిచేడు సమీపంలోని దర్శి బ్రాంచి కాలువలో బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైంది. దర్శి బ్రాంచి కాలువలో నమశ్శివాయపురం బ్రిడ్జి సమీపంలో కాలువలోకి వంగిన చెట్ల మధ్య యువకుని మృతదేహం ఇరుక్కుంది. దానిని గొర్రెల కాపరులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీయించారు. మృతదేహంపై ప్యాంటు మాత్రమే ఉంది. కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## 16 నుంచి దివ్యాంగ పింఛన్లపై విచారణ

పీసీపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : వివిధ దీర్ఘకాలిక అనారోగ్య కారణాలు చూపించి హెల్త్ పెన్షన్‌లు తీసుకుంటున్న వారి ఆరోగ్య స్థితిని తనిఖీ చేసేందుకు ఈనెల 16నుండి వైద్యబృందం మండలంలో పర్యటిస్తుందని ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు. అలా మండలంలో 18మంది పింఛన్లు పొందుతున్నారని చెప్పారు. తనిఖీ బృందం వచ్చిన సమయంలో లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని కోరారు. తనిఖీ బృందం వచ్చినప్పుడు అందుబాటులో లేని లబ్ధిదారుల పెన్షన్‌ను నిలుపుదల చేస్తామని చెప్పారు.

## హుండీ ఆదాయం రూ.1,71,100

పామూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానానికి సంబంధించిన రెండు హుండీలను బుధవారం లెక్కించారు. భక్తులు కానుకల ద్వారా రూ.1,71,100 వచ్చినట్లు దేవస్థాన చైర్మన్‌లు కావిటి సుబ్బయ్య, గుత్తి రాజలు తెలిపారు.

## క్రీడలతో స్నేహబంధాన్ని పెంపొందించుకోవాలి

కనగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు ప్రజల మధ్య సత్సంబంధాలను, స్నేహబంధాలను పెంపొందించాలని సీఐ ఖాజావలి చెప్పారు. స్థానిక శివనగర్ కాలనీలో ఎస్‌ఎన్‌సీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను సీఐ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రికెట్ ఆడి యువతను ప్రోత్సహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి నిరోధానికి యువత కృషి చేయాలని కోరారు. గంజాయి అమ్మకాలు సాగించే వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గంజాయి సేవించే, అమ్మకాలు సాగించే వారి సమాచారం అందించాలని కోరారు.

## విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

కురిచేడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 28 మందిని పట్టుకుని వారికి రూ.1.49 లక్షలు, అలాగే అదనపు లోడ్ వాడుతున్న 44 మందిని గుర్తించి వారికి రూ.168 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ టీ హైమవతి, దర్శి ఈఈ శ్రీనివాసులు, డీఈఈలు వీ క్రిష్టారెడ్డి, హరిబాబు, కె.వెంకటేశ్వర్లు, కురిచేడు ఏఈ రామక్రిష్ణారెడ్డి, దర్శి డివిజన్‌లోని 11 మండలాలకు చెందిన ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.



# బస్సు.. బుస్సు..!

### అలంకారప్రాయంగా పీసీపల్లి బస్టాండ్





పీసీపల్లి బస్టాండ్ అలంకారప్రాయంగా మారింది. లక్షలాది రూపాయలతో నిర్మించిన బస్సు షెల్టర్ ఉన్నా అక్కడికి మాత్రం ఆర్టీసీ బస్సులు రావడం మానేశాయి. మొదట్లో బస్సుల కోసం ఎదురు చూసిచూసి విసిగిపోయిన ప్రయాణికులు ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. పీసీపల్లిలో 20 ఏళ్ల క్రితం ఎంపీ నిధులు, పంచాయతీ నిధులతో బస్సు షెల్టర్‌ను నిర్మించారు. ఆర్టీసీకి ఆదాయాన్ని పెంచేందుకు అందులో 5గదులను దుకాణాల కోసం నిర్మించారు. అప్పట్లో కొంతకాలంబస్సులు బస్టాండ్ వరకు వచ్చి తిరిగి వెళ్లేవి. ప్రస్తుతం పీసీపల్లి-పెదయిర్లపాడు.. కనిగిరి-బెంగళూరు వెళ్లే ఆర్టీసీ బస్సులు బస్టాండు వరకు రాకుండా బ్యాంకు సెంటరు మీదుగానే వచ్చి పోతున్నాయి. ఆర్టీసీ ఉన్నతాధికారులకు ప్రయాణికులు ఫిర్యాదులు చేసినా బస్‌లు మాత్రం బస్టాండ్‌లోకి రాకపోవడం గమనార్హం.

-పీసీపల్లి, ఆంధ్రజ్యోతి

# నేడు ఉగ్రన్న యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

పామూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా ఉగ్రన్న యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పామూరులో గురువారం మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం అవుతుందని ఆర్గనైజర్, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించనున్నారని చెప్పారు. ప్రథమ బహుమతిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జేఆర్‌కె ఫౌండేషన్ అధినేత కోటపాటి జనార్ధనరావుచే రూ.50,116, ద్వితీయ బహుమతి ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావుచే రూ.35,116, తృతీయ బహుమతి శ్రీ బాలాజీ జ్యూయలర్ అధినేత అల్లు శ్రీనివాసులచే రూ.20,116 అందచేయనున్నారు. స్పోర్ట్ కిట్‌ను టీడీపీ నాయకులు యారవ శ్రీను, షీల్డ్‌ను పట్టణ టీడీపీ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ షీల్డ్ దాత ఒంగోలు పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి ఆర్‌ఆర్ రఫి, మ్యాన్‌ఆఫ్ ది సీరిస్ దాత నియోజకవర్గ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ముబినామౌలాలి అందచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### టీడీపీ ఆధ్వర్యంలో మెగా కబడ్డీ టోర్నమెంట్

దొనకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత సీఎం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుండి నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కుందుర్తి లక్ష్మణ్ తెలిపారు. మొదటి బహుమతి రూ.20116 నగదును మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి మన్నెం గాలయ్య, రెండవ బహుమతి రూ.10116 నగదును టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, మూడో బహుమతి రూ.7116 నగదును నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కుందుర్తి లక్ష్మణ్, నాల్గో బహుమతి రూ.5116లను లైవ్‌స్టాక్ అధ్యక్షులు పల్లె మణీందర్‌దేవ్, విన్నర్స్, రన్నర్స్ ట్రోఫీలు, షీల్డులు శృంగారపు నాగసుబ్బారెడ్డి, షేక్ మస్తాన్, కాళ్ల హనుమంతు, కోటపాటి రామారావు, అంకాల మల్లికార్జున, పోతిపోగు చెన్నయ్యలు అందజేస్తారన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 11వ తేదీలోపు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

### రసవత్తరంగా క్రికెట్ పోటీలు

దర్శి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : దర్శిలో గొట్టిపాటి - నారపుశెట్టి మెగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రస్తవత్తరంగా సాగుతున్నాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు గెలుపు కోసం హోరాహోరీగా పోటీపడుతున్నారు. బుధవారం ఆరు జట్లు పోటీపడ్డాయి. మరో నాలుగు రోజుల పాటు ఈ పోటీలు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


దర్శిలో క్రికెట్ టోర్నమెంట్‌లో పోటీపడుతున్న జట్లు

# దోబీఘాట్ స్థలాన్ని కాపాడండి

రెవెన్యూ సదస్సులో

### రజక సంఘం నేతల వినతి

కనిగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : హనుమంతునిపాడులో ఎర్రవాగులో ఆక్రమణకు గురైన దోబీఘాట్ స్థలాన్ని కాపాడాలని కోరుతూ రజకవృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో హనుమంతునిపాడులో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య మాట్లాడుతూ 1997లో హనుమంతునిపాడులోని 52 సర్వేనెంబరులో 8.62ఎకరాలను దోబీఘాట్ కోసం కేటాయించారని తెలిపారు. వీటి ఆక్రమణ వల్ల కుల వృత్తినే నమ్ముకుని జీవించే వారికి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు బీ వెంకటేశ్వర్లు, రజకవృత్తిదారులు చెన్నయ్య, నాగేశ్వరరావు, బాలకృష్ణ, చందు, సూరి, లక్ష్మయ్య, రమేష్, కేశవులు, కేశవరావు, చిన్నబాబు, బాల పాల్గొన్నారు.


అర్జీ ఇస్తున్న రజకవృత్తి దారుల సంఘం నాయకులు

### వేములబండలో...

ముండ్లమూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములబండలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ, సర్వేయర్ కోటం రాజు, మోదేపల్లి డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, సర్పంచ్ సిమ్మిలి కోటేశ్వరమ్మ, రాజేంద్ర ప్రసాదు, వీఆర్‌వోలు జీ కోటయ్య, గురవయ్య, పెద్దన్న, దయానందం, రాఘవరెడ్డి, ఆర్‌ఐ వీవీఎస్ఆర్ మూర్తి, గ్రామ సర్వేయర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

### ముగిసిన రెవెన్యూ సదస్సులు

పామూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ భూముల సమస్యలపై అర్జీలు అందజేయాలని ప్రత్యేకాధికారి ఎం పానకాలరావు, తహసీల్దార్ బీవీ రమణారావు చెప్పారు. మండలంలోని మార్కొండాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని నాసికత్రయంబకం రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇప్పటి వరకు నిర్వహించిన 29 సదస్సుల్లో 557 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, వీఆర్వో గాబ్రియేల్, పంచాయతీ కార్యదర్శి ఇండ్ల హరినారాయణ, మండల సర్వేయర్ స్వప్న, ఎండోమెంట్ ఈవో నరసింహబాబు పాల్గొన్నారు.

## నా శాఖ.. నా స్తంభం..

# నా వీధి..నా ఇల్లు..!

**ఇంటి నిర్మాణానికి అడ్డొచ్చిందని రోడ్డుపైకి విద్యుత్ పోల్ మార్పు**
**కనిగిరిలో కుచించుకుపోయిన రోడ్డు**
**ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఆ సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగి**
**మున్సిపల్ నిబంధనలను కూడా తుంగలో తొక్కి పనులు**

కనగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి : తన ఇంటి నిర్మాణానికి అడ్డుగా ఉందని ఏకంగా విద్యుత్ స్తంభాన్ని రాత్రికి రాత్రి నడిరోడ్డు పైకి మార్చాడు ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి. దీంతో అక్కడ రోడ్డు మరింత ఇరుకుగా మారడంతో రాకపోకలకు స్థానికులు అల్లాడిపోతున్నారు. ఈ నిర్వాకానికి కారకుడు విద్యుత్‌శాఖ డీఈఈ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి కావటం గమనార్హం. ఈ సంఘటన పట్టణంలోని సాయిబాబాగుడి వీధిలో చోటుచేసుకుంది. సాధారణ వ్యక్తి తన ఇంటి మీటరో, లేదా తమ పొలంలోకి విద్యుత్ స్తంభమో మంజూరుకావాలంటే యజ్ఞం చేసినంత కష్టపడాలి. నిబంధనల పేరుతో అధికారులు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిప్పుతారన్న విమర్శలు ఉన్నాయి. కానీ అదే శాఖలో ఓ మామూలు వాచ్‌మెన్ ఉద్యోగికి ఆగమేఘాల మీద అడ్డదిడ్డమైన పనులన్నీ జరిగిపోవడం గమనార్హం. విద్యుత్ వైర్లు ఆకాశంలోనే మెలికలు తిప్పుతూ ఇష్టం వచ్చినట్లు స్తంభం బిగించారు. అంతేకాకుండా సదరు విద్యుత్‌శాఖ వాచ్‌మెన్ తన ఇంటి నిర్మాణంలో మున్సిపల్ నిబంధనలను కూడా తుంగలో తొక్కారు. 4 అడుగులు స్థలం వదిలకుండానే నిర్మాణం చేస్తున్నారు. ఎలాంటి పరిశీలన చేయకుండా ప్లాన్‌కు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వటం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి. అంతేకాకుండా నాలుగు రోడ్లు కూడలిలో రోడ్డుకు మధ్యగా విద్యుత్ స్తంభం వేయటం ప్రమాదరకంగా మారింది. కొత్తదానికి సమాంతరంగా ఉన్న మరో స్తంభానికి దూరం లేకపోవడంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా డీఈఈ రోడ్డుపై వేసుకోవాలని సదరు వాచ్‌మెన్‌కు అనుమతి ఇచ్చినట్లు చెప్పటం గమనార్హం.


స్తంభానికి, స్తంభానికి వైర్లు మెలికలు తిప్పి మరీ నడిరోడ్డులో వేసిన విద్యుత్ స్తంభం

# తెలుగునాడు ఉపాధ్యాయ క్యాలెండర్ ఆవిష్కరణ

కురిచేడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : కురిచేడు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో బుధవారం తెలుగునాడు క్యాలెండర్, డైరీలను ఎంఈవో వస్రాంనాయక్ ఆవిష్కరించారు. మార్కాపురం, కనిగిరి డివిజన్ల సంయుక్త అధ్యక్షులు రెహమాన్, ముండ్ల శ్రీనివాసులు కూడా పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలపై ఎంఈవోతో వారు చర్చించారు.

### దొనకొండలో...

దొనకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం, కనిగిరి డివిజన్ల సంయుక్త అధ్యక్షుడు రెహమాన్, ప్రధాన కార్యదర్శి మండ్ల శ్రీనివాసులు, సహ కార్యదర్శి మందా ప్రసాదు మరికొందరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తెలుగునాడు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో వస్రాం నాయక్, ఉపాధ్యాయులు

## మిస్సింగ్ డేటా సర్వేను పూర్తిచేయాలి

అవీఇవీ


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

పామూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలకు సంబంధించిన మిస్సింగ్ డేటాను సచివాలయ సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో సురేష్ చెప్పారు. స్థానిక పామూరు 1వ సచివాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో వలంటీర్ల నిర్లక్ష్యంతో చేసిన హౌస్‌హోల్డ్, మిస్ మ్యాపింగ్ సర్వేల్లో లోపాల కారణంగా అర్హులు ప్రభుత్వ పథకాలను పొందలేకపోయారని చెప్పారు.ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరవిందారెడ్డి, పంచాయతీ గుమస్తా రత్నకుమార్ పాల్గొన్నారు.

## బహువార్షిక పశుగ్రాసాల సాగుకు ప్రోత్సాహం

తాళ్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : బహువార్షిక పశుగ్రాసాల సాగుకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మన్నేపల్లి, తురకపాలేల్లో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏ సీహెచ్ బ్రహ్మయ్య, వీఏఏ సుధీర్ పాల్గొన్నారు.

## వైసీపీకి బీసీ నేత మూరబోయిన రాజీనామా


తిరుపతయ్య

తాళ్లూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగంబొట్లపాలెం వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మూరబోయిన తిరుపతయ్య ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆ మేరకు బుధవారం ఆయన ప్రకటించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. అంతేగాక ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి అనుచరుడిగా ఉంటూ గ్రామంలో పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. పార్టీలో ప్రాధాన్యత లేకపోవటంతో మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు తిరుపతయ్య తెలిపారు.

## రుణాల కోసం ఈనెల 16 వరకు దరఖాస్తులు

దొనకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-25 బీసీ యాక్షన్ ప్లాన్ కింద వివిధ రకాల రుణాల మంజూరు నిమిత్తం ఈనెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీదేవి చెప్పారు. బీసీ-ఏ వర్గానికి ఎనిమిది యూనిట్లు, బీసీ-బీ వర్గానికి మూడు యూనిట్లు, బీసీ-డీ వర్గానికి 22 యూనిట్లు, బీసీ-ఈ వర్గానికి రెండు యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. అదేవిధంగా ఈడబ్ల్యూఎస్ యాక్షన్ ప్లాన్ కింద 12 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు.

### కురిచేడులో...

కురిచేడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీసీలు కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సతీష్‌బాబు చెప్పారు. ఈ నెల 8 నుంచి 19వ తేదీ లోపు సచివాలయంలో 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. గొర్రెల పెంపకం, మినీ డెయిరీ, ఆటో మొదలగు యూనిట్లకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఎంపీడీవో చెప్పారు. కురిచేడు మండలానికి బ్యాంక్ లింక్ స్కీమ్స్ 16 యూనిట్లు, ఈడబ్ల్యూఎస్ స్కీమ్స్ 9, జనరిక్ మెడికల్ షాపు 1 యూనిట్లు కేటాయించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

## సోలార్ ప్లాంట్‌ను సందర్శించిన విద్యార్థులు


ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

ముండ్లమూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు మారెళ్లలోని సోలార్ పవర్ ప్లాంట్‌ను బుధవారం సందర్శించారు. వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా విద్యుత్ ఉత్పత్తి గురించి ప్లాంట్ మేనేజర్ వివరించారు. ప్రిన్సిపల్ కే పూర్ణచంద్రరరావు, వృత్తి కోర్సు డైరెక్టర్ అంజిరెడ్డి, నరసింహారెడ్డి, ఫిజిక్స్ లెక్చరర్ లక్ష్మీనారాయణ, గ్రేసీ పాల్గొన్నారు.

## తమ్మలూరులో ముమ్మరంగా ఫాగింగ్


ఫాగింగ్ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

ముండ్లమూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో తమ్మలూరు, పెదరావిపాడు గ్రామాల్లో బుధవారం పలు వీధుల్లో ఫాగింగ్ నిర్వహించారు. ఇటీవల గ్రామంలో చికెన్ గున్యాతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మూడు రోజుల నుంచి వీధుల్లో పేరుకు పోయిన చెత్తాచెదారం తొలగించటంతో పాటు దోమల నిర్మూలనకు సర్పంచ్ గొర్రె శ్రీదేవి రాముడు ఆధ్వర్యంలో ఫాగింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాజు, పంచాయతీ కార్యదర్శి కే సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


కర్రలోడుతో ఉన్న ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

పీసీపల్లి, జనవరి8 (ఆంధ్రజ్యోతి): బ్యారెన్‌లకు కర్ర తోలే ట్రాక్టర్ డ్రైవర్లు నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని కనిగిరి సీఐ ఖాజావలి హెచ్చరించారు. పీసీపల్లిలో కర్రలోడుతో వెళ్తున్న పలు ట్రాక్టర్‌లను బుధవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సైడ్‌డోర్‌లు తీసి వాటి వెలుపలకు కర్రలు, మొద్దులు ఉంచడం, ట్రాలీకి వెనకాల రెడ్‌కలర్ రేడియం స్టిక్కర్లు లేకపోవడం, ట్రాక్టర్‌లో ఉన్న లోడ్ కనిపించేలా లైట్లు అమర్చకపోవడాన్ని ఆయన గుర్తించారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్లందరినీ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్సై జి.కోటయ్య పాల్గొన్నారు.

## కస్టమర్ల వివరాలు నమోదు చేయాలి

పామూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : లాడ్జీల్లో రూములు తీసుకొనే కస్టమర్ల వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని ఎస్‌ఐ కిశోర్ బాబు సూచించారు. పట్టణంలోని పలు లాడ్జీలను కనిగిరి డీఎస్పీ మహేశ్వరరావు ఆదేశాల మేరకు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లాడ్జి గదులను, రిజిస్టర్లను పరిశీలించారు. లాడ్జి పరిసరాలు కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.



## నేడు సాగర్ పీసీ తొలి సమావేశం

నరసరావుపేట,జనవరి 8(ఆంధ్రజ్యోతి): సాగునీటి వ్యవస్థ ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన ఎన్నికల ద్వారా ఎన్నికైన సాగునీటి సంఘాలకు కాల్వల బాగు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన సాగునీటి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నీటి సంఘాలు కృషి చేయనున్నాయి. నాగార్జున సాగర్ జవహర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ అధికారం చేపట్టాక తొలి సమావేశం గురువారం జరగనుంది. సత్తెనపల్లిలోని జలవనరుల శాఖ అతిథి గృహంలో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు అధ్యక్షతన జరిగే సమావేశానికి వైస్ చైర్మన్ ఉప్పల పాటి చక్రపాణి, డిస్ట్రిబూటరీ కమిటీ అధ్యక్షులు, జలవనరుల శాఖ అధికారులు హాజరుకానున్నారు.

## గుంతల రహదారికి మోక్షం


గోతుల మయంగా ఉన్న కొండమోడు రహదారి

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా పనులను ప్రారంభించడంతో కొండమోడు - పేరేచర్ల జాతీయ రహదారికి మహర్దశ పట్టనుంది. రహదారి పనులకు నిధులు మంజూరు.. భూసేకరణ.. టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు ప్రారంభించేందుకు జాతీయ రహదారుల అథార్టీ చర్యలు చేపట్టింది. దశాబ్దాలుగా కొండమోడు రహదారిని విస్తరించాలని వాహనదారులు కోరుతున్నారు. సత్తెనపల్లి - కొండమోడు మధ్య రహదారిపై పెద్దఎత్తున గోతులు ఉన్నాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. ఈ రహదారిలో ప్రయాణించేందుకు వాహనదారులు సాహసించడంలేదు. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు నరసరావుపేట నుంచి వెళ్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. మొత్తం మీద ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా పనులకు శంకుస్థాపన చేయడంతో రహదారిని వేగవంతంగా విస్తరించేందుకు సాకారం ఏర్పడింది. పేరేచర్ల నుంచి కొండమోడు మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఒక్కొక్క వైపు 8.75 మీటర్లు రహదారి నిర్మిస్తారు. 1.5 మీటర్లు డివైడర్.. రెండు వైపులా మార్జిన్లతో కలిపి మొత్తం 22.5 మీటర్ల వెడల్పుతో రహదారిని విస్తరిస్తారు. సుమారు 585 ఎకరాల భూమిని రహదారి విస్తరణ కోసం సేకరించారు. కేంద్ర ప్రభుత్వం రూ.882 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. మేడికొండూరులో సుమారు ఐదు కిలోమీటర్లు, సత్తెనపల్లి పట్టణానికి 11 కిలోమీటర్లు మేర బైపాస్ నిర్మించనున్నారు. కాంట్రాక్టర్‌ను ఖరారు చేయడంతో త్వరలోనే పనులు ప్రారంభంకానున్నాయి.

## తీరంలో.. అనుసంధానం


ఎన్‌హెచ్ 216 జాతీయ రహదారి

(బాపట్ల - ఆంధ్రజ్యోతి)

జిల్లా పరిధిలోని 72 కిలోమీటర్ల మేర తీర ప్రాంతాన్ని కలుపుతూ జాతీయ రహదారి 216 విస్తరణ పనులను 2017లో కేంద్రం ప్రారంభించింది. రూ.786 కోట్ల వ్యయంతో 62.13 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టిన ఎన్‌హెచ్ 216 పనులు 2023లో పూర్తి కాగా 2024 నుంచి ప్రజలకు ఉపయోగంలోకి వచ్చింది. ఈ రహదారిని ప్రధాని విశాఖ వేదికగా జాతికి అంకితం చేశారు. రేపల్లె నుంచి ప్రారంభమయ్యే 216 రెండు వరుసల రహదారి భట్టిప్రోలు, చెరుకుపల్లి, కర్లపాలెం, బాపట్లతో పాటు చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలను అనుసంధానం చేస్తోంది. ప్రాజెక్టు ప్రారంభించినప్పుడు అంచనా వ్యయం రూ.487 కోట్లుకాగా, నిర్మాణం పూర్తయ్యేనాటికి అది రూ.786 కోట్లకు చేరుకుంది. ఈ రహదారి వల్ల బాపట్లలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడుతుంది.

**వైసీపీ ప్రభుత్వంలో నత్తనడకన..**

2017లో ప్రారంభమైన 216 జాతీయ రహదారి పనులు రెండేళ్ల పాటు శరవేగంగా కొనసాగాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనుల్లో వేగం లోపించింది. నిర్మాణ పనుల్లో జాప్యంతో తొలి అంచనాలకు మించి ఖర్చు అయింది. దీనికి తోడు భూసేకరణలో కూడా వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరించడం కూడా నిర్మాణ వ్యయం పెరగడానికి కారణమైంది. ప్రారంభించిన మూడేళ్ల వ్యవధిలోనే నిర్మాణం పూర్తి చేయాలని తొలుత లక్ష్యం నిర్దేశించుకున్నప్పటికీ ఎట్టకేలకు గతేడాది అది వాడుకలోకి వచ్చింది.

## సాగర్ నుంచి మల్లాయపాలెం వరకు..

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ - దావులపల్లి జాతీయ రహదారిని 47 కిలోమీటర్ల మేర రెండు వరుసలుగా విస్తరించారు. రూ.230 కోట్లతో పనులు పూర్తి చేయగా రహదారిని ప్రధాని ప్రారంభించారు. దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నారు. రూ.312 కోట్లతో 20 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తారు. ఈ పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రహదారి నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. భూసేకరణ పనులు పూర్తయ్యాయి. రహదారి విస్తరణ పనులు వెనువెంటనే ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథార్టీ చర్యలు చేపట్టింది.


ప్రధాని ప్రారంభించిన నాగార్జున సాగర్ - దావులపల్లి రహదారి


జిల్లాకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులను విశాఖపట్టణం నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధానమంత్రి మోదీ, వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డీప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్రమంత్రి రాంమోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత తదితరులు

**పలు ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభం.. శంకుస్థాపన**

**కొండమోడు రహదారి, నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్‌కు మహర్దశ**

**చిలకలూరిపేట బైపాస్, దావులపల్లి, ఎన్‌హెచ్-216 రహదారులు జాతికి అంకితం**

**విశాఖపట్టణం నుంచి వర్చువల్‌గా శిలాఫలకాలను ఆవిష్కరించిన మోదీ**

# జాతికి అంకితం.. జిల్లా అభివృద్ధికి.. ఆవిష్కారం

రహదారులు జాతికి అంకితంతో పాటు వివిధ పనులకు సంబంధించిన శిలాఫలకాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం నుంచి బుధవారం ఆవిష్కరించారు. కొండమోడు రహదారి.. నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్.. పనులకు శంకుస్థాపన చేయగా చిలకలూరిపేట బైపాస్, దావులపల్లి, ఎన్‌హెచ్-216 రహదారులు జాతికి అంకితం చేశారు. ఒకే రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని వివిధ పనుల ప్రారంభోత్సవాలతో పాటు రహదారులను జాతికి అంకితం చేశారు. ఆయా పనులకు సంబంధించిన శిలాఫలకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి మోదీ ఆవిష్కరించారు. ప్రధాని స్వయంగా ప్రారంభించడంతో కొండమోడు రహదారితో పాటు నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్ పనులు శరవేగంగా పూర్తి అవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. కాగా బుధవారం మోదీ పనులకు శంకుస్థాపన దృశ్యాలను గుంటూరు, నడికుడి తదితర రైల్వేస్టేషన్లలో తెరలు ఏర్పాటు చేసి ప్రయాణికులు వీక్షించే సౌకర్యాన్ని కల్పించారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే సరుకు రవాణాతో పాటు రైళ్ల వేగం కూడా పెరిగే అవకాశం ఉంది. దేశంలోనే మొదటి మోడల్ ప్రాజెక్టుగా చేపట్టిన చిలకలూరిపేట బైపాస్ రోడ్డును ప్రధాని జాతికి అంకింతం చేశారు. నాగార్జున సాగర్ - దావులపల్లి జాతీయ రహదారిని నరేంద్ర మోదీ ప్రారంభించారు. దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించే పనులకు మోదీ ప్రారంభోత్సవం చేశారు. రేపల్లె నుంచి ఈపూరుపాలెం 216 రహదారితో రేపల్లె, బాపట్ల, చీరాల నియోజకవర్గాలకు అనుసంధానం ఏర్పడింది. బాపట్ల జిల్లా పరిధిలోని 62.13 కిలోమీటర్ల మేర 216 జాతీయ రహదారిని ప్రధాని జాతికి అంకితం ఇవ్వడం పట్ల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

## పట్టాలెక్కిన డబ్లింగ్ ప్రాజెక్టు



(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

గుంటూరు రైల్వే డివిజన్ దశ దిశ మార్చబోయే కీలకమైన నల్లపాడు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టు పట్టాలెక్కింది. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి పింక్‌బుక్‌లో చేర్చిన రైల్వే శాఖ బుధవారం ప్రధానమంత్రి శంకుస్థాపన చేయించింది. రూ.2853.23 కోట్ల అంచనా విలువకాగల ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో వేల మందికి ఉపాధి లభించనుంది. అలానే ప్రాజెక్టు పూర్తి అయితే తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ మధ్య రైలు కనెక్టివిటీ గణనీయంగా పెరుగుతుంది. వాణిజ్యపరంగానూ రెండు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలకు మేలు కలుగుతుంది. నల్లపాడు - బీబీనగర్ మధ్యన ప్రస్తుతం సింగిల్ లేన్ రైలు మార్గం అందుబాటులో ఉన్నది. దీని వల్ల లైన్ కెపాసిటీ 215కి చేరింది. దీంతో కొత్తగా రైళ్లను ప్రవేశపెట్టలేని పరిస్థితి నెలకొన్నది. గత ఏడాది ప్రకృతి విపత్తుల సమయంలో కాజీపేట మార్గానికి ప్రత్యామ్నాయంగా నల్లపాడు - బీబీనగర్ రైల్వేలైన్‌ని వినియోగించడంతో రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. కాగా ఈ మార్గాన్ని డబ్లింగ్ చేయాలని దశాబ్దాల తరబడి ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. ఎట్టకేలకు ఎన్‌డీఏ-3 ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు మంజూరైంది. 238.99 కిలోమీటర్ల పొడవునా ఈ డబ్లింగ్ ప్రాజెక్టుని చేపడతారు. ఇందులో కృష్ణానదిపై మేజర్ బ్రిడ్జిని కూడా నిర్మించాల్సి ఉన్నది. అలానే వలిగొండ, నాగార్జునసాగర్ లెఫ్టు మెయిన్ కెనాల్, మూసినదిపై వంతెనల నిర్మాణాలు చేయాలి. పగిడిపల్లి నుంచి కుక్కడం వరకు భూమి అందుబాటులో ఉండటంతో మూడు సెక్షన్లుగా విడగొట్టి పనులు చేపట్టేందుకు టెండర్లను కూడా రైల్వే శాఖ నిర్వహించింది. కుక్కడం - నడికుడి, కుక్కడం - వలిగొండ, పగిడ్డి - బొమ్మాయిపల్లి మధ్య ఇప్పటికే భూమి చదును పనులు మొదలయ్యాయి. మరోవైపున నడికుడి - నల్లపాడు మధ్య గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భూసేకరణ చేయాల్సి ఉండగా రెండు జిల్లాల ఆర్‌డీవోలు ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశారు. రైతుల వద్ద తీసుకోబోయే భూమికి అవార్డులు జారీ చేస్తే పనులు ప్రారంభించడానికి అవరోధాలు తొలగిపోతాయి. కనీసం 80 శాతం భూమి అందుబాటులోకి వస్తే పనులు ప్రారంభిస్తామని రైల్వేవర్గాలు తెలిపాయి.



## బైపాస్‌తో కష్టాలకు చెక్

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

చిలకలూరిపేట బైపాస్ రహదారిని ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. రూ.907 కోట్లతో బైపాస్ నిర్మించారు. 16వ నెంబరు జాతీయ రహదారి బొప్పూడి సమీపం నుంచి తిమ్మాపురం వరకు బైపాస్ 16.384 కిలోమీటర్ల మేర నిర్మించారు. దేశంలోనే మోడల్ బైపాస్ ఇది. రహదారికి ఇరువైపులా శాశ్విత గోడ నిర్మించారు. బైపాస్ విశాలమైన ప్రాంతాల్లో ఒక మోగా వాట్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను రాత్రి వేళ రహదారిపై ఏర్పాటు చేసిన లైటింగ్‌కు వినియోగిస్తారు. దాదాపు 3,500 మొక్కలు నాటారు. బైపాస్‌తో చికలూరిపేట పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తీరాయి.

## నేడు కేంద్ర బృందం పర్యటన

బాపట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశస్థాయిలో ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి అనే నినాదంతో బాపట్లజిల్లా చీరాల సిల్క్‌శారీస్ ఉప్పాడ వస్త్రాలను ఎంపిక చేయటానికి కేంద్ర బృందం గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఒకేజిల్లా, ఒకే ఉత్పత్తి బృందం పర్యటన వివరాలను చేనేత, జౌళీ శాఖాధికారులు కలెక్టర్‌కు వివరించారు. చీరాల సిల్క్‌శారీస్‌ను ఉప్పాడ జాతీయ స్థాయిలో అవార్డుకు ఎంపిక చేయటానికి కేంద్ర బృందం పర్యటిస్తుందన్నారు. కేంద్రబృందం సభ్యులు ఇష్‌దీప్, ద్రాదివ్య విజయవాడ నుంచి బయలుదేరి బాపట్లజిల్లా కేం ద్రానికి ఉదయం 10గంటలకు చేరుకుంటారన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసిన ప్రదర్శన పరిశీలిస్తారన్నారు. సమావేశంలో చేనేత, జౌళీశాఖ జాయింట్ డైరెక్టర్ కె.కన్న బాబు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ భీమయ్య పాల్గొంటారని కలెక్టర్ వివరించారు.

# సంపూర్ణం అస్తవ్యస్తం

కేవీపీ కాలనీలో అసంపూర్తిగానే పాఠశాల భవనం


- నాడు నేడు పనులపై ఆడిట్
- కాంట్రాక్టర్ల వెన్నులో వణుకు
- పేరుకు తల్లిదండ్రుల కమిటీలు
- పెత్తనం అంతా నాటి వైసీపీ నాయకులదే
- రూ.కోట్లు ఖర్చుచేసినా.. ఇంకా అసంపూర్తిగానే పనులు

గుంటూరు(విద్య),జనవరి 8(ఆంధ్రజ్యోతి): సర్కారు పాఠశాలల్లో అభివృద్ధి పేరుతో నాటి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన "నాడు నేడు" పనులపై ఆడిట్ చేయాలని నిర్ణయించడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు వణికిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం గత ప్రభుత్వం "నాడు నేడు పథకం" పేరుతో ప్రారంభించిన పనులు అనేక చోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి. రెండు దశల్లోనూ పనులు అస్తవ్యస్తంగా నిర్వహించారు. దీంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా నిర్మాణ సామగ్రి అనేక చోట్ల పాడై పోతున్నది. కొన్ని చోట్ల దొంగలపాలవుతున్న ఉదంతాలూ ఉన్నాయి.

### అస్తవ్యస్తంగా పనులు అడ్డగోలు నిర్ణయాలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ప్రభుత్వం నాడు నేడు పేరుతో నూతన తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, తాగునీటి కోసం వాటర్ ప్లాంట్స్, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబులు, కిచెన్‌షెడ్లు, సైన్స్‌ల్యాబుల నిర్మాణం, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నిచర్ సౌకర్యం కల్పించడం, పాఠశాలలకు రంగులు వేయడం తదితర తొమ్మిది రకాల పనుల్ని "నాడు నేడు పథకం"లో చేపట్టాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2 వేలకుపైగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలల్ని ఎంపిక చేశారు. ఇందుకోసం దాదాపు రూ. 1500 కోట్లకుపైగా నిధులు కేటాయించారు. నిధులు సక్రమంగా ఖర్చుచేయకపోవడంతో ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ 45 శాతంపై పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. వందల సంఖ్యలో భవనాలు ఇంకా వివిధ దశల్లోనే ఉన్నాయి. కొన్ని చోట్ల పునాదుల స్థాయిలో మరికొన్నిచోట్ల శ్లాబ్ పూర్తి అయినా పార్టీషన్, ప్లాస్టరింగ్, విద్యుత్, ప్లంబింగ్ పనులు పూర్తికాలేదు. మరికొన్ని చోట్ల పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఇలా వివిధ దశల్లో ఉమ్మడి జిల్లాలో వందల సంఖ్యలో భవనాలు ఉన్నాయి. ఆయా పనులపై తాజాగా ఆడిట్ నిర్వహిస్తారు.

### బూడిదలో పోసిన పన్నీరులా నిధులు

పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం తీసుకువచ్చిన నిర్మాణ సామగ్రి అనేక చోట్ల పాడైపోతోంది. ఇసుక, కంకర, డస్ట్ ఇప్పటికే అనేక స్కూల్స్‌లో మట్టిలో కలిసి పోయింది. సిమెంట్‌కు రక్షణ లేకపోడంతో గడ్డకట్టి ఉపయోగించడానికి వీలులేకుండా తయారైంది. ఇక శానిటరీ, ప్లంబింగ్, విద్యుత్ పరికరాలు పాఠశాలల్లోని తరగతి గదుల్లో పేరుకుని పోయి ఉన్నాయి. కొన్ని ఇప్పటికే ధ్వంసం కాగా, మరికొన్ని దొంగల పాలైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా కోట్లాది రూపాలయ ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అనేక స్కూల్స్‌లో ఇప్పటికి వాటర్‌ప్లాంట్స్ ఇన్‌స్టలేషన్ పూర్తి అయినా వినియోగంలోకి రాలేదు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ఆడిట్ త్వరగా పూర్తిచేసి అసంపూర్తి పనులు పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## 30 ఏళ్లుగా క్రికెట్ పోటీలు అభినందనీయం

- పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ
- రావినూతలలో అట్టహాసంగా ప్రారంభమైన పోటీలు

మేదరమెట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రావినూతలలాంటి చిన్న గ్రామంలో స్టేడియం నిర్మించి 30 ఏళ్లకు పైగా సంక్రాంతి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యుల కృషి అభినందనీయమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ తెలిపారు. బుధవారం రావినూతలలో శ్రీభ్రమర సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖర్చుతో కూడుకున్న క్రికెట్ పోటీల నిర్వహణ, స్టేడియం అభివృద్ధి, ఆటగాళ్ల వసతి సౌకర్యాలపై సభ్యులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ప్రాంతాన్ని, సింగరకొండ వద్ద భవనాసి రిజర్వాయర్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. సినీనటుడు రఘుబాబు మాట్లాడుతూ తాను అతిథిగా రాలేదని, ఆర్ఎన్‌సీఏ ప్రారంభం నుంచి తాను కూడా సభ్యుడినేనన్నారు. స్టేడియం అభివృద్ధికి నాగేశ్వరరావు(బాబు) ఎంతగానో పాటుపడ్డారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి తాము ఎప్పుడూ ముందుంటామని శ్రీ భ్రమర టౌన్ షిప్స్ చైర్మన్ గల్లా రామచంద్రరావు తెలిపారు. అనంతరం రఘుబాబు, బాలాజీ బ్యాటింగ్ చేశారు. కార్యక్రమ అనంతరం స్టేడియంలో నూతనంగా నిర్మించిన ఇండోర్ షటిల్ కోర్టును భారత బ్యాడ్మింటన్ సమాఖ్య మాజీ కార్యదర్శి కరణం చెంచుపున్నయ్యచౌదరి ప్రారంభించి కొద్దిసేపు షటిల్ ఆడారు. కార్యక్రమంలో అద్దంకి మల్లికార్జునరావు, ఎస్ఐ షేక్ మహమ్మద్‌రఫి, అసోసియేషన్ కార్యదర్శి మోపర్తి శేషారావు, కారుసాల సుబ్బయ్య, రామినేని శ్రీనివాసరావు, చేబ్రోలు నాగేశ్వరరావు, యడ్లపల్లి నరసింహారావు, కారుసాల బ్రహ్మానందం, కారుసాల గురుబాబు, చెన్నుపాటి హరిబాబు, మేదరమెట్ల శ్రీనివాసరావు, సాధినేని మస్తాన్‌రావు, నాదెండ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**ఉత్కంఠగా క్రికెట్ పోటీలు**

రావినూతలలో జరుగుతున్న క్రికెట్ పోటీలు మొదటి రోజున గుంటూరు, తిరుపతి జట్ల మధ్య హోరాహోరీగా జరిగాయి. జీడీసీఏ 12 గుంటూరు జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. స్పార్టమ్ వారియర్స్ తిరుపతి జట్టు బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 168 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన జీడీసీఏ 12 గుంటూరు జట్టు 19.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి గెలుపు లక్ష్యాన్ని సాధించింది. జట్టులోని మహిత్ కుమార్ అత్యధికంగా 49 పరుగులు చేశాడు. పోటీలకు ఎంపైర్‌లుగా శ్రీనివాస్, రాజ్, స్కోరర్‌గా సాయినాథ్ ఉన్నారు.

**నేటి పోటీల వివరాలు**

గురువారం ఉదయం నెక్స్‌జన్ 12 హైదరాబాద్, మస్తాన్ 12 మార్టూరు జట్లు మధ్య పోటీ జరుగుతుంది. సాయంత్రం ఎంఆర్‌సీసీ 12 చెన్నై, ఎస్‌సీ రైల్వే సికింద్రాబాద్ జట్ల మధ్య పోటీ జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర టూరిజం చైర్మన్ నూకసాని, సినీ నటుడు రఘుబాబు, భ్రమర టౌన్ షిప్ చైర్మన్ రామచంద్రరావు



రోటరీ గవర్నర్‌తో కలిసి మొక్కలు నాటుతున్న సభ్యులు

## సేవా కార్యక్రమాలలో రోటరీ ముందంజ

మార్టూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సేవా కార్యక్రమాలలో రోటరీ ముందంజలో ఉంటుందని, రోటరీ సమాజసేవ, వ్యక్తిగత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని రోటరీ జిల్లా 3150 గవర్నర్ కే శరత్ చౌదరి అన్నారు. బుధవారం ఆయన మార్టూరు రోటరీ క్లబ్ చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత స్థానిక వివేకానంద విద్యాసంస్థలో కంటి వైద్య నిపుణులు కే సుబ్రమణ్యం ఆధ్వర్యంలో చిన్నారులు కోసం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం నాగరాజుపల్లి సెంటర్ సమీపంలో ఉపాధిహామీ నిధులతో నిర్మాణం చేసిన సీసీ రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డు పక్కనే ఇరువైపులా రోటరీ సహకారంతో చెట్ల పెంపకం కోసం కృషి చేస్తామన్నారు. తొలిగా క్లబ్ సభ్యులచేత కొన్ని మొక్కలను నాటించారు. ఈ రహదారి పక్కనే పూర్తిగా రోటరీ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం చేపడతామన్నారు. ఎఫర్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోటరీ కళాపరిషత్ ద్వారా ఏటా కళా పరిషత్ నాటికలను నిర్వహించడంతో మార్టూరు రోటరీ క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు దక్కిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఎస్‌కే మహమ్మద్ రఫీ, క్లబ్ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు, కార్యదర్శి మాదాల సాంబశివరావు, కోశాధికారి గరిమిడి శ్రీనివాసరావు, ఇంకా జాష్టి వెంకట మోహనరావు, ఇంటూరి ఆంజనేయులు, జీహెచ్ అంజిబాబు, రావి అంకమ్మచౌదరి, చెరుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ముగిసిన రెవెన్యూ సదస్సులు

చినగంజాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గత నెల డిసెంబరు 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయి. మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ సమస్యలకు సంబంధించి రైతులు అందజేసిన అర్జీలను స్వీకరించారు. పట్టాదారు పాసుపుస్తకాల కోసం 10, పేరు సరిచేయటకు ఒకటి, 1బీ అడంగల్ కోసం రెండు, భూ సర్వేకు 8 అర్జీలు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పీ.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఆర్‌ఐ నాగేశ్వరరావు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### ద్రోణాదులలో 49 అర్జీలు

మార్టూరు : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 49 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టీ ప్రశాంతి తెలిపారు. వాటిలో పట్టాదారు పాస్ పుస్తకాల కోసం 21, భూముల సర్వే కోసం 27, దేవదాయ భూములకు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ ఈవో శిరీషమండల సర్వేయర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



విజేతలకు బహుమతులను అందిస్తున్న న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో బుధవారం ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. చీరాల కోర్టు భవన సముదాయంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిపారు. ఈసందర్భంగా ముగ్గులు, పోటీలు, మ్యూజికల్ చైర్స్ వంటిపోటీలు నిర్వహించారు. విజేతలకు న్యాయాధికారి సుధ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రమేష్‌బాబు, న్యాయవాదులు పాల్గొన్నారు. పాపరాజు తోటలోని శ్రీరాఘవేంద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ప్రాంగణాన్ని పచ్చతోరణాలతో అలంకరించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ కార్డులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ కార్డులు మంజూరు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక ఇస్లాంపేటలో ఏర్పాటు చేసిన బాల ఆధార్ నమోదు శిబిరాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఆధార్ కోసం పిల్లల వివరాలను నమోదు చేస్తున్న తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

# ఇంత మోసమా

- పొదిలిలో వైసీపీ మార్క్ మాయాజాలం
- ఎన్నికల వేల హడావుడిగా రక్షిత నీటి పథకం పనులు
- ఉత్తుత్తి అనుమతులు మంజూరు
- టెండర్ల ప్రక్రియ నిర్వహించిన అధికారులు
- వెంటనే ప్రారంభించిన కాంట్రాక్టర్
- ఎం-బుక్ నమోదు కాకపోవడంతో లబోదిబో
- రూ.10కోట్ల పెట్టుబడి పరిస్థితేమిటో..?
- అర్ధంతరంగా ఆగిన పనులు

దర్శి సాగర్ కాలువ నుంచి పైపులైన్ ద్వారా నీటిని తెచ్చుకోవడం పొదిలి ప్రజల చిరకాల స్వప్నం. ఆ కలను తాము నిజం చేస్తున్నామంటూ వైసీపీ ప్రభుత్వం గతంలో డాంబికాలు పలికింది. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి స్వయంగా పనులు ప్రారంభిస్తూ శిలాఫలకం ఆవిష్కరించారు. చోటామోటా నేతల నుంచి ప్రజాప్రతినిధులు వరకు అందరూ అది తమ కీర్తిగా చెప్పుకున్నారు. అనుకున్నదే తడువుగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే ఈ పనులకు అసలు ఆర్థికశాఖ అనుమతే లేదు. దీంతో విషయం తెలిసి కాంట్రాక్టర్ కాడి కిందేశారు. ఇప్పటివరకు రూ.10కోట్ల మేర ఖర్చుపెట్టినట్లు పేర్కొంటున్న అతను తన పెట్టుబడి కూడా వెనక్కు వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

పొదిలి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సక్రమంగా అనుమతులు తీసుకోకుండా ఎన్నికలకు ముందు హడావుడిగా వైసీపీ ప్రభుత్వ పెద్దలు చేసిన మాయాజాలం పొదిలి ప్రజలకు శాపంగా మారింది. ఏళ్లుగా వెంటాడుతున్న తాగునీటి సమస్య తీరుస్తామంటూ ఆ పార్టీ నేతలు ప్రగల్భాలు పలికి చివరకు చేతులెత్తేశారు. అధికారులు నేతల బాటలోనే సాగారు. పనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. తీరా ఎంబుక్ చేసే సమయంలో పథకం బండారం బయటపడింది. దీంతో సదరు కాంట్రాక్టర్ లబోదిబోమంటూ పనులను అర్ధంతరంగా నిలిపేశారు. వివరాల్లోకి వెళితే.. దర్శి సాగర్ కాలువ నుంచి పైపులైన్ ద్వారా పొదిలి పెద్దచెరువుకు నీటిని నింపి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం కోసం గతంలో వైసీపీ ప్రభుత్వం రూ.50.13కోట్ల అంచనాలను ప్రతిపాదించింది. ఈ పనులకు 2022లో పరిపాలన అనుమతులు ఇచ్చింది. దీంతో ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆగమేఘాల మీద టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. 2023 ఏప్రిల్‌లో మార్కాపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన అప్పటి సీఎం జగన్ వర్చువల్ విధానం ద్వారా భారీ రక్షితనీటి పథకానికి శిలాఫలకం ఆవిష్కరించారు.

### అప్పట్లో భారీగా సంబరాలు

ప్రజల ఆకాంక్షల మేరకు వైసీపీ హామీ ఇచ్చినట్లు రక్షితనీటి పథకాన్ని ప్రారంభించి పొదిలి ప్రాంతప్రజల చిరకాలవాంఛ నేరవేర్చామని ఆర్భాటంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి పర్యటన తరువాత స్థానిక వైసీపీ నాయకులు అత్యుత్సాహంగా రక్షితనీటి పథకం తెచ్చిన ఘనత మాదేనంటూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో పెద్ద ఎత్తున ప్రార్థనలు చేసి నానా హంగామా చేశారు. ఈ పనులకు సంబంధించి కాంట్రాక్టును రఘురామ పైపుల కంపెనీ దక్కించుకుంది. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ పైపులైన్ నిర్మాణ పనులను చురుగ్గా చేపట్టింది. ఇప్పటివరకు రూ.10 కోట్ల మేర పనులు పూర్తిచేశారు. ఇక్కడే కథ మరో మలుపు తిరిగింది. చేసిన పనులకు ఎం-బుక్ రికార్డ్ చేసే సమయంలో ఈ పైపులైన్ వర్క్‌కు అసలు ఆర్థిక శాఖ అనుమతులు లేవని బయటపడింది. దీంతో లబోదిబోమనడం కాంట్రాక్టర్ వంతైంది.



బిల్లులు రాకపోవడంతో అర్ధంతరంగా నిలిచిన పనులు

### ఎంబుక్ చేయడం కష్టమే

ప్రభుత్వం ఇచ్చిన జీవో నకలు కిందిభాగంలో ఆర్థిక అనుమతులు ఉన్నట్లు పొందుపరచకపోవడంతో ఎం-బుక్ రికార్డ్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. మరి ఆర్థిక అనుమతులు లేకుండా టెండర్లు పిలవడంపై అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్లు తెల్లముఖం వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు ప్రక్రియ ఎలా నిర్వహించారని ప్రజలు మండిపడుతున్నారు.

### ఎనిమిది నెలలుగా నిలిచిన పనులు

ఎంబుక్ నమోదు కష్టం కావడంతో సదరు కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. ఏడెనిమిది నెలలుగా పనులు నిలిచిపోవడంతో పొదిలి ప్రజల ఆశలు ఆవిరవుతున్నాయి. అయితే ప్రస్తుత శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సమ్మర్ స్టోరేజ్ పనులు పూర్తిచేయిస్తామని పేర్కొంటున్నారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ఈ విషయం వెల్లడించారు. మొత్తం మీద వైసీపీ ప్రభుత్వం పశ్చిమప్రాంత ప్రజలను మభ్యపెట్టిందనే విషయం తేటతెల్లమైంది. ఒకవైపు పనులు పూర్తికాకుండానే వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం వంటి గారడీలు వైసీపీకే చెల్లుతాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

### ప్రజలను మభ్యపెట్టేందుకే ఉత్తుత్తి జీవోలు

అభివృద్ధి పనులు చేపట్టకుండానే చేసినట్లు చూపి ప్రజలను మభ్యపెట్టడం వైసీపీకే చెల్లుతోంది. వెలిగొండ పూర్తికాకుండానే జాతికి అంకితం చేస్తున్నామని అప్పటి సీఎం జగన్‌రెడ్డి గొప్పలు చెప్పారు. ఐదేళ్ల పాలనలో కనీసం 10 శాతం పనికూడా చేయలేదు. అదేవిధంగా దర్శి-కొత్తరెడ్డిపాలెం నుండి పైపులైన్ ద్వారా పొదిలి పెద్దచెరువుకు నీరుతెచ్చి మండల ప్రజల నీటి కష్టాలు తీరుస్తానన్నారు. రూ.50.13 కోట్లతో ఉత్తుత్తి జీవో విడుదల చేశారు. ఇప్పుడు ఆ జీవోకు ఆర్థిక అనుమతలు లేవని స్పష్టమైంది. ఇప్పటి కూటమి ప్రభుత్వం పంతాలకు పోకుండా నిధులు విడుదల చేయించి పనులు పూర్తిచేయిస్తాం.

**- కందుల నారాయణరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే**

### శాఖ నుంచి వచ్చిన జీవో ఆధారంగానే పనులు

గత ప్రభుత్వ పాలనలో ఇరిగేషన్ శాఖ నుంచి రూ.50.13 కోట్లు పైపులైను పనులకు జీవో విడుదలైంది. దాని ఆధారంగానే టెండర్లు పిలిచారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థలకు పార్ట్ పేమెంట్ కోసం ఎం-బుక్ నమోదు చేస్తుండగా ఆర్థికశాఖ అనుమతులు లేవని స్పష్టమైంది. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో అనుమతులు వస్తాయి. పనులు ప్రారంభించి పూర్తిచేస్తాం.

**- ఇరిగేషన్ డీఈ శివరాంప్రసాద్**

## ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం అభివృద్ధికి రూ.30లక్షలు మంజూరు



- వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ
- అందుబాటులోకి రానున్న క్రీడా స్టేడియం
- వెల్లడించిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం అభివృద్ధికి ప్రభుత్వం రూ.30 లక్షల నిధులను విడుదల చేసిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి పర్చూరులో రూ.2కోట్లతో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేసిన క్రీడా స్టేడియంలో ఆయన పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ట్రాన్స్‌పోర్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్, ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ ఛైర్మన్ అనిమిని రవి నాయుడుకు లేక రాశా రు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో క్రీడా వికాస కేంద్రాన్ని నిర్మించామని, గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రారంభోత్సవానికి నోచుకోలేదన్నారు. దీంతో మొక్కలతో శిథిలావస్థకు చేరుకుందన్నారు. దీనికి స్పందించిన ప్రభుత్వం అసంపూర్తి పనులు పూర్తి చేయడంతో ఎ ా ట ఀ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, జిమ్, వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ నిర్మాణం కోసం నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. వారం రోజుల్లో ఈపనులకు డెండర్లు పిలిచి త్వరితగతిన వినియోగంలోకి తీసుకొస్తామని ఆయన భరోసా ఇచ్చారు. గ్రామీణ క్రీడాకారులను పోత్సహించేందుకు ఎన్టీఆర్ క్రీడా వికాసాన్ని ఏర్పాటు చేశామని, కొద్ది రోజుల్లోనే దీనిని క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు.

## హైస్కూల్‌కు 50 బెంచీల బహూకరణ



దాతలు బహూకరించిన బెంచీలు

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో కొల్లా వీరవసంతరావు జడ్పీ హైస్కూల్‌కు వింజనంపాడు గ్రామానికి చెందిన ఎన్నారై తుమాటి కిషోర్ బెస్ట్ రన్నర్స్ యూఎస్‌ఏ వారు రూ.1.50 లక్షల విలువైన 50 బెంచీలను బహూకరించారు. వాటిని బుధవారం కిషోర్ తల్లి రాజరాజేశ్వరి, సోదరులు శ్రీనివాసు, బాలకృష్ణ హైస్కూల్‌కు అప్పగించారు. దాత లను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు శాలువాతో కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాఘవరెడ్డి, తల్లిదండ్రుల సంఘం అధ్యక్షురాలు రమాజ్యోతి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు తుర్లపాటి శ్రీనివాసు, పూర్వ విద్యార్థులు పెడవల్లి రమేష్, ఎం.నరేంద్ర, కొత్తపల్లిరాఘవ, గ్రామస్థులు మురకొండ రోశయ్య, రావి రత్తయ్య, వీరయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ సౌకర్యాలను వినియోగించుకోవాలి

చినగంజాం, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : ఉద్యాన రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఏ.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా సాగు చేస్తున్న మామిడి తోటను ఆమె బుధవారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామానికి చెందిన గాజుల జగదీష్ తన రెండు ఎకరాలలో సాగు చేస్తున్న మామిడి మొక్కలను పరిశీలించారు. మామిడి మొక్కలలో అంతర పంటను సాగు చేస్తూ ఆదాయాన్ని పొందడం అభినందనీయమని పీడీ అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం నిధులను ఉద్యాన రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఉపాధిహామీ ద్వారా ఉద్యాన రైతులను ప్రొత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, ఏపీవో లక్ష్మీదేవి, టెక్నికల్ అసిస్టెంట్లు మారుతి, ఎల్.ఏ.ప్రసన్న, టి.రాజశేఖర్, ఎస్.సుదర్శన్, ఫీల్డ్ అసిస్టెంట్ వడ్లమూడి రామకృష్ణ పాల్గొన్నారు.

# మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం





విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

## భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

# వైసీపీ నిర్లక్ష్యంతో ఆగిన పనులు

- గోతులమయమైన పాతమద్రాస్ రోడ్డు
- బిల్లులు చెల్లించకపోతే చేయలేనన్న కాంట్రాక్టర్
- పాతమద్రాస్ రోడ్డును పరిశీలించిన ఆర్‌అండ్‌బీ అధికారులు



పాతమద్రాస్ రోడ్డును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

ఇంకొల్లు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇం కొల్లు - పర్చూరు పాతమద్రాస్ రోడ్డు ప నులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. రో డ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో ఈ రోడ్డున ప్రయాణిస్తున్న వాహనదారులు నరకం చూస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం రోడ్డును పరిశీలించా రు. మూడు సంవత్సరాల కిందట ఓ కాం ట్రాక్టర్ రూ.22 కోట్లతో టెండర్ దక్కించుకొని రోడ్డు పనులు ప్రారంభించారు. నేలచప్టాలు ఉన్న చోట కొత్త బ్రిడ్జిలను నిర్మించి కొంతమేరకు పనులు చేసారు. చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లు లు చెల్లించలేదు. దీంతో పనులు నిలిపివేశారు. అప్పటి నుంచి ఈ రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీనివాసరావు, డీఈ నళిని పరిశీలించారు. కాంట్రాక్టర్‌ను రోడ్డు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరు మిత్రా రాఘవరావుకు సూచించారు. పనులు ప్రారంభించి న నాటికి ఇప్పటికీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని ప్రస్తుతం ఉన్న పరిస్థితులతో ఆ నిధులతో పని చేయడం కష్టమని, కొత్త ప్రతిపాదనలతో మాత్రమే ఈ రోడ్డును పూర్తి చేయగలనని కాంట్రాక్టరు రాఘవరావు అధికారులకు వెల్లడించినట్లు ఏఈ శ్రీకాంత్ తెలిపారు. పాత బిల్లులు ఇస్తే తప్ప పనులు చేయలేమని కాంట్రాక్టర్ తెగేసి చెప్పినట్లు సమాచారం. కనీసం బ్రిడ్జిల ఏర్పడిన గుంతలను పూడ్చి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎస్‌ఈ శ్రీనివాసరావు ఏఈ శ్రీకాంత్‌ను ఆదేశించారు.

# పోలీస్ వర్సెస్ ఎక్సైజ్

- బెల్ట్ షాపుల నిర్వహణలో లైసెన్సీల మధ్య ఆధిపత్య పోరు
- వైన్ షాపుల వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌లు
- చూసీచూడనట్లు వదిలేస్తున్న ఎక్సైజ్ శాఖ
- కన్నెర్ర చేస్తున్న పోలీస్ శాఖ
- రాజకీయ రంగు పులుముకుంటున్న మద్యం వ్యాపారం
- 265 మద్యం సీసాలు పట్టుకున్న వేటపాలెం పోలీసులు

వేటపాలెం(చీరాల), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వైట్ కాలర్ వ్యాపారంలోకి మద్యం దుకాణాలు కూడా చేరాయి. మద్యం దుకాణాలకు సంబంధించి లైసెన్స్‌లు ఎవరి పేరున ఉన్నప్పటికీ అంతిమంగా వారి వెనుక రాజకీయ కోణం దాగి ఉంటుంది. ఇది బహిరంగ రహస్యం. ఇదిలావుంటే మద్యం బెల్ట్ షాపులు అనేవి ఉండకూడదు. ఎంఆర్‌పీల కన్నా అదనపు ధరకు మద్యం విక్రయించకూడదని సాక్షాత్తు సీఎం చంద్రబాబు పదేపదే చెప్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఆ మాటలకు అటు రాజకీయ నాయకులు, ఇటు అధికారులు కట్టుబడి ఉండడం లేదు. తాజాగా వేటపాలెం మండలం కఠారిపాలెంలో బుధవారం 265 క్వార్టర్ మద్యం బాటిల్స్, 25 బీరు సీసాలను వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి పట్టుకున్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ విచ్చలవిడిగా జరుగుతుందనేందుకు ఇదొక నిదర్శనమని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. బెల్ట్ షాపులను నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు ఏంచేస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇదిలావుంటే వైన్ షాపుల వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌లకు సంబంధించి పోలీస్ శాఖ వారు సంబంధీకులకు నోటీసులు ఇచ్చారు. దీనిపై స్పందించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం వ్యాపారానికి సంబంధించిన నిబంధనలు అమలులో ఎక్సైజ్ వర్సెస్ పోలీస్ అన్నట్లుగా అడుగులు పడుతున్నాయి. జరుగుతున్న పరిణామాలు అందుకు దర్పణం పడుతున్నాయి.

**సింగిల్‌గా వద్దు.. సిండికేట్ ముద్దు**

చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మొత్తం 24 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో పాలక, ప్రతిపక్షాలకు చెందిన వారు భాగస్తులుగా ఉన్నారు. ఈ క్రమంలో అదనపు సంపాదన కోసం బెల్ట్‌షాపుల నిర్వహణకు తెరతీశారు. అయితే ఎవరికివారు సింగిల్‌గా వెళదామా, సిండికేట్‌గా వెళదామా అనే విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. వీలున్నచోట ఎవరికివారు బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

**అన్నదమ్ముల వివాదానికి రాజకీయ రంగు**

దీర్ఘకాలంగా మద్యం వ్యాపారంలో ఉన్న ఇద్దరు అన్నదమ్ముల మధ్య నెలకొన్న వివాదం రాజకీయ రంగు పులుముకుంది. సర్కిల్ పరిధిలో టీడీపీ, జనసేన, కాంగ్రెస్, వైసీపీలకు చెందిన వ్యక్తులు మద్యం దుకాణాల లైసెన్స్ పొందినవారిలో ఉన్నారు. వారికి కొందరికి ఆ అన్నదమ్ముల్లో ఒకరు, మరికొందరికి మరొకరు ప్రాతినిధ్యం వహించేందుకు ముందుకొచ్చారు. అయితే ఆ అన్నదమ్ముల మధ్య ఉన్న విభేదాలతో అది రాజకీయ రంగు పులుముకుంది. ఆ రంగు కాస్తా అధికార పార్టీకి చెందిన కీలక నేతలకు అంటుకుంటుంది.

**పోలీస్ X ఎక్సైజ్**

వాస్తవానికి మద్యం విక్రయాల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టాలి. అయితే వారు ఆ విషయాన్ని పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాల వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసినవారికి పోలీస్‌శాఖ పరంగా నోటీసులు ఇచ్చారు. తాజాగా కఠారిపాలెంలో బెల్ట్‌షాపులో విక్రయిస్తున్న 265 క్వార్టర్ బాటిళ్లు, 25 బీర్ బాటిళ్లను వేటపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై తమ ఇలాకాలో పోలీస్ చర్యలేంటని ఎక్సైజ్ అధికారులు గుర్రగా ఉన్నట్లు సమాచారం.



కఠారిపాలెంలో పట్టుబడ్డ మద్యం సీసాల వివరాలు తెలుపుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

**స్వామి కార్యం ఎంత.. స్వకార్యం ఎంత**

బెల్ట్ షాపుల నిర్వహణ, అధిక ధరలకు విక్రయాలకు సంబంధించి కొందరు అధికారులు రాజకీయ నాయకలకు అండగా నిలిచారని విశ్వసనీయ వర్గాల భోగట్టా. అయితే అందులో స్వామి కార్యం ఎంత .. స్వకార్యం ఎంత అని విషయం తెలిసినవారు నర్మగర్భంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత నేతలు జాగ్రత్తగా ఉండకపోతే ఆ మకిలీ వారికి వారికి అంటుకునే ప్రమాదం ఉందనడంలో సందేహం లేదని ఆ రంగంలో ఉన్నవారు అంటున్నారు.



ఆలయంలో రామనామ భజన చేస్తున్న భక్త సమాజం

## శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సప్తాహం

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని రామనామం జపిస్తూ సప్తాహ కార్యక్రమం చేపట్టారు. స్థానిక అవధూతేంద్ర భక్త సమాజం ఏడు రోజుల పాటు నిర్వహిస్తున్న భజన కార్యక్రమంలో పంగులూరు, చందలూరు, జాగర్లమూడివారిపాలెం, ముప్పవరం గ్రామాలకు చెందిన భక్త సమాజ సభ్యులు పాల్గొని భజన చేస్తున్నారు. సప్తాహం ముగింపు సందర్భంగా ఈ నెల 11న ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

## కందిలో కాయ తొలుచు పురుగు



కందిని పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ తదితరులు

అద్దంకిటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కంది పూత, పిందె దశలో ఉన్నందని, అందులో కాయ తొలుచు పురుగును గమనించడం జరిగిందని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని మైలవరం, ఉప్పలపాడు గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో సాగు చేస్తున్న కంది పంటలను ఏవో వెంకటకృష్ణ, ఉద్యాన అధికారి ఎస్.దీప్తి, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కందిలో కాయ తొలుచు పురుగు నివారణకు న్యూవలరాన్ 10శాతం, ఈసీ 300 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ రఫీ పాల్గొన్నారు.

**కత్తెర పురుగును నివారించుకోవాలి**

ఇంకొల్లు : మొక్కజొన్నలో కత్తెర పురుగును నివారించుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని నాగండ్ల, సూదివారిపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న పం టను పరిశీలించారు. రబీ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

యద్దనపూడి : రైతులు అందరూ తమ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మేరమ్మ అన్నారు. బుధవారం మండలంలోని జాగర్లమూడి, పడమర పెద్దివారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

పంగులూరు : రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంట సాగు చేపట్టడం లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కొండమూరు, జనకవరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. సాగులో ఉన్న శనగ పంటను రైతులో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది నవనీతం, దినేష్, రైతులు పాల్గొన్నారు.

## రేపు డార్మెటరీ హాల్ ప్రారంభం

అద్దంకి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండపై లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద దాతలు కంభంపాటి శ్రీనివాసరావు, నాగ జ్యోతి దంపతుల సహకారంతో తమ కుమారుడు కంభపాటి వెంటేష్ డార్మెటరీ హాల్ ప్రారంభోత్సవం ఈ నెల 10వ తేదీ ఉదయం 9-32 గంటలకు జరుగుతుందని ఈవో కోటిరెడ్డి తెలిపారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు డార్మెటరీ హాల్ వినియోగించనున్నట్లు ఈవో కోటిరెడ్డి తెలిపారు.



## జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీలు

- మంత్రి గొట్టిపాటి ఆదేశం
- హద్దులపై మొదులలైన చర్యలు

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని భగవాన్‌రాజుపాలెం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారికి ఇరు వైపులా డ్రైనేజీ ఏర్పాటులో భాగంగా హైవే, రెవెన్యూ అధికారులు హద్దులను నిర్ధారించేందుకు చర్యలు చేపట్టారు. హైవేపై రోడ్డు విస్తరణ సమయంలో డ్రైనేజీ నిర్మాణం జరగలేదు. దీంతో నివాస గృహాల వద్ద వర్షపు నీటితో పాటు మురుగు నీరు ముందుకు పోక రోజుల తరబడి నిలిచి పోవడంతో సమీప ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు తమ ఇబ్బందులను మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వివరించారు. సమస్యపై స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటుకు వీలుగా హ ద్దులు నిర్ధారించేందుకు తహసీల్దార్ సింగారావు, హైవే అధికారులు బుధవారం సర్వే చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, హైవే అధికారులతో పాటు మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



భగవాన్‌రాజుపాలెం వద్ద ఇరు వైపులా హద్దులు నిర్ధారణకు రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

## పింఛన్ అందలేదని ఎంపీడీవోకు ఫిర్యాదు

సంతమాగులూరు, జనవరి 8 : ( ఆంధ్రజ్యోతి ) : మండలంలోని సజ్జాపురం గ్రామంలో ఆరుగురికి పింఛన్ అందలేదని ఎంపీడీవో జ్యోతిర్మయికి లబ్ధిదారులు పిర్యాదు చేశారు. దీనిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

## విద్యా బుద్ధులు అలవర్చుకోవాలి



సర్టిఫికెట్లను అందిస్తున్న ప్రతినిధులు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశనుంచే పిల్లలు విద్యా బుద్ధులను అలవర్చుకోవాలని ఈపూరుపాలెం బాలుర ఉన్నతపాఠశాల హెచ్‌ఎం సుధావాణి, ఐటీసీ సభ్యులు మహేష్ అన్నారు. ఐటీసీ ఆధ్వర్యంలో పాఠశాలకు సుమారు రూ.1.50లక్షలు విలువగల డిజిటల్ డ్యాష్‌బోర్డును అందించారు. ఈ డ్యాష్ బోర్డు ద్వారా విద్యార్థులకు బోధన సులువుగా ఉంటుందని చెప్పారు. డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీసీ శ్రీను, ఓఆర్‌డబ్ల్యు అరుణ జ్యోతి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## చందలూరులో శాస్త్రోక్తంగా మానుపూజ

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న ముత్తయిదువులు**

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవ అంకురార్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. బుధవారం రాత్రి బ్రహ్మశ్రీ వేదమూర్తి వర్యులు చల్లా సత్యనారాయణశాస్త్రి వేద మంత్రాలతో మానుపూజ నిర్వహించారు. గ్రామంలోని పంతంగి వంశస్తులు అమ్మవారికి ఆనవాయితీగా మోయనం సమర్పించగా, మురకొండ వంశస్తులు పసుపు, కుంకుమలతో పాటు వడపప్పు, పానకం మానుపూజ స్థలానికి తోడ్కొని వచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వందలాది మంది ముత్తయిదువులు పంచ మాంగళ్యాలను స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పింఛన్‌ల పరిశీలన

ఇంకొల్లు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ రూ.15వేల పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం పరిశీలించారు. డాక్టరు అంజలి ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ వైద్యులు బుధవారం పరిశీలించారు. మండల పరిధిలో మొత్తం 41 మంది ఆరోగ్య పింఛన్లు పొందుతున్నారు. ఇంకొల్లులో 19, దుద్దుకూరు పరిధిలో 22 మంది ఉన్నట్లు డాక్టర్ అంజలి తెలిపారు. ఇంకొంల్లు ఆరోగ్య కేంద్రం పరిధిలో నాగండ్ల, ఇడుపులపాడు, వంకాయలపాడు, పూసపాడుతోపాటు ఇంకొల్లులో ఉన్న లబ్ధిదారులను పరిశీలించినట్లు ఆమె తెలిపారు.

**నేటి మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేత**

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో గురువారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ విస్తరణ పనులలో భాగంగా సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- గృహోపకరణాలు, బంగారు వస్తువులు దగ్ధం
- రూ.6లక్షల మేర అస్తినష్టం
- రోడ్డున పడిన కుటుంబం

బల్లికురవ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పల్లపు వీరవసంతరావు అను నిరుపేద కుటుంబానికి చెందిన ఇళ్లు దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న గృహోపకరణాలు, బంగారు వస్తువులు పూర్తిగా అగ్నికి అహుత య్యాయి. అందిన సమాచారం మేరకు అంబడిపూడి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి పల్లపు వసంతరావు మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. దీంతో భయాందోళన చెందిన వీర వసంతరావు కుటుంబ సభ్యులు పిల్లలతో కలిసి ఇంట్లో నుంచి పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకున్నారు. ఇల్లు మొత్తం గోడలు కాలి పోయి బీరువాలో ఉన్న నగదు, బంగారు వస్తువులు, వెండి వస్తువులు పూర్తిగా కాలి బూడిద య్యాయి. సుమారు రూ.6లక్షల పైబడి అస్తి నష్టం సంభవించిందని బాధితుడు తెలిపారు. మంటలు పెద్దవి కాకుండా ఇరుగు పొరుగు ఉన్న గృహాల వారు వెంటనే మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో తాము కట్టుబట్టలతో బయటపడ్డామని, ప్రభుత్వం తమ కుటుంబాన్ని అదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



కాలిపోయిన గృహోపకరణాలను చూపిస్తున్న ఇంటి యజమాని

**తక్షణ సహాయంగా 25కిలోల బియ్యం అందజేత**

అంబడిపూడి గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగిన పల్లపు వీర వసంతరావు ఇంటిని డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ పరిశీలించారు. తక్షణ సహాయం గా ప్రభుత్వ పరంగా 25కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నాయని బాధితుడు అధికారులకు విన్నవించారు. తదుపరి ప్రభుత్వ ద్వారా వచ్చే పరిహారాన్ని అందజేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకటేశ్వ ర్లు, టీడీపీ నాయకులు దద్దాల అంజయ్య పాల్గొన్నారు.

**చందలూరులో అగ్ని ప్రమాదం**

**మంటల్లో కాలిన సామగ్రి**

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామం వెలుపల పెంట్యాల రామాంజనేయ స్వామి ఓ షెడ్‌లో నిలువ ఉంచిన లక్షల విలువ చేసే రెస్టారెంట్ సామగ్రి మంటలలో కాలి బూడిదైంది. సమాచారం అందుకున్న అద్దంకి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఇది ప్రమాదవశాత్తు జరిగినదిగా అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.



షెడ్‌లో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



తిరుప్పావై ప్రవచనాలు వినిపిస్తున్న స్వర్ణ అన్నపూర్ణ

## భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

అద్దంకి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారం తిరుప్పావై పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త రమాసుందరి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామాలను చదివారు. అమ్మవారికి సారే సమర్పించారు. వివిధ రకాల పండ్లు సమర్పించారు. కార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ వూటుకూరి ఉమాఅన్నపూర్ణ, కొల్లిపర లావణ్య, పద్మావతి, శిరీష, విజయలక్ష్మి, అంజలి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

**వీనులవిందుగా తిరుప్పావై ప్రవచనాలు**

అద్దంకి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తిరుప్పావై ప్రవచనాలు వీనులవిందుగా సాగుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానములు ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ధనుర్మాస పూజలు జరుగుతున్నాయి. డిసెంబర్ 16 నుంచి ప్రారంభమైన ధనుర్మాస పూజలలో స్వర్ణ అన్నపూర్ణ తిరుప్పావై ప్రవచనాల ను ప్రతి రోజు సాయంత్రం విన్పిస్తున్నారు. బుధవారం 24వ పాశురము వివరించారు. ఈ నెల 13వ తేదీ చివరి రోజు భోగి పండుగ సందర్భంగా గోదా కృష్ణుల కల్యాణం జరుగుతుందని స్వర్ణ అన్నపూర్ణ తెలిపారు.

**శింగరకొండలో గోవుకు పూజలు**

శింగరకొండలోని శ్రీరామస్తూపం వద్ద గోవుకు బుధవారం స్వర్ణ వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముప్పవరంలో నేత్ర దానం

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామంలో నేత్ర దానం జరిగింది. గ్రామానికి చెందిన ధూళిపాళ్ల నాగరత్నమ్మ (90) మంగళవారం మృతి చెందింది. ఆమె కుమారుడు భావన్నారయణస్వామి తల్లి నాగరత్నమ్మ నేత్రాలను దానం చేస్తానని రోటరీ ప్రతినిధి జగన్మోహన్‌కు తెలపగా శంకర్ కంటి వైద్యశాల వైద్యులను పిలిపించి దాత కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో ఆమె కుమారులు భావన్నారాయణస్వామి, సత్యనారాయణ, రోటరీ క్లబ్ కార్యదర్శి బత్తుల వీరనారాయణ, క్యాంప్ ఇన్‌చార్జి వీరరాఘవయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఇంకొల్లు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ రామలింగారెడ్డి మాక్సీ విజన్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో గురువారం ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి తెలిపారు. ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డు ఉన్నవారికి అన్ని రకాల కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు వారి కుటుంబసభ్యులు వినియోగించుకోవాలని కోరారు.

## రేషన్‌షాపులో విజిలెన్స్ తనిఖీ

ఇంకొల్లు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగండ్లలో రేషన్ షాపులో విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాప్ నెంబర్-27లో తనిఖీలు చేయగా రిజిస్టర్‌కు, ఉన్న స్టాక్‌కు తేడా ఉండడంతో 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు.

## ధాన్యం కొనుగోలు చేయండి

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య కోరారు. పంగులూరులో బుధవారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో గంగయ్య మాట్లాడుతూ మండలంలోని రామకూరు గ్రామంలో 400 ఎకరాలలో రైతులు వరి సాగు చేశారన్నారు. కోతలు కోసి నూర్పుళ్లు జరుగుతున్నందున ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు తలపనేని రామారావు, వినోద్‌బాబు, సుబ్బరాజు, హరిబాబు, ఏలియా, ప్రభాకర్ పాల్గొన్నారు.

## మలుపులో క్రషర్ లారీ బోల్తా



బోల్తాపడిన క్రషర్ లారీ

బల్లికురవ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ - సంతమాగులూరు రోడ్డులోని క్వారీల సమీపంలో ప్రమాదవశాత్తు మలుపులో క్రషర్ లారీ మంగళవారం రాత్రి బోల్తా కొట్టింది. అందిన సమాచారం మేరకు బల్లికురవ వైపు వస్తున్న క్రషర్‌కు చెందిన ఖాళీ లారీ మలుపు వద్దకు వచ్చేసరికి డ్రైవర్‌కు రోడ్డు కనిపించక పోవడంతో ఒక్కసారిగా మార్జిన్‌లోకి పోనివ్వడంతో లారీ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ బయటకు దూకి ప్రాణాలతో బయటపడ్డారు.

## వైసీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా ఈదా

**వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా గునుపూడి నియామకం**

అద్దంకి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ బాపట్ల జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా అద్దంకి మండలం మణికేశ్వరానికి చెందిన మాజీ సర్పంచ్ ఈదా శ్రీనివాసరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా అద్దంకి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, ఆర్యవైశ్య నాయకుడు గునుపూడి రఘురామగుప్తాను నియమిస్తూ వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఇద్దరు నేతలకు సమాచారం అందించారు.

## పొన్నూరులో అర్చకునిపై దాడి హేయం

**జిల్లా అర్చక సంక్షేమ సంఘం**

చీరాలటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా పొన్నూరు నాగేంద్రస్వామి దేవాలయంలో అర్చకులు నూతలపాటి నాగేశ్వరశర్మపై దాడి చేయడం హేయమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బాపట్ల జిల్లా అర్చక సంఘం ప్రతినిధులు వాసుదేవ సంపత్‌కుమార్ ఆచార్యులు అన్నారు. రెండు కుటుంబాల మధ్యలో నెలకొన్న వివాదాన్ని ఓ వ్యక్తి ఉద్దేశపూర్వకంగా దేవాలయంకు వచ్చి అర్చకునిపై దాడి చేసినట్లు ఆరోపించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.






## క్రిస్ సిటీతో

# జిల్లా రూపురేఖల మార్పు

- విశాఖ నుంచి ప్రధాని శంకుస్థాపన
- మూడు దశలుగా ప్రాజెక్టు అమలు
- 2500 ఎకరాల్లో రూ. 2139 కోట్లతో తొలిదశ పనులు
- 2027 ఫిబ్రవరి నాటికి ఫేజ్-1 పూర్తి చేయాలని లక్ష్యం
- రూ. 7500 కోట్ల పెట్టుబడులు, 50 వేల ఉద్యోగాలు వస్తాయని అంచనా
- రూ. 1173 కోట్ల పనులకు టెండర్లు పూర్తయి నిర్మాణాల ప్రారంభం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం విశాఖపట్టణం నుంచి శంకుస్థాపన చేసిన క్రిస్ సిటీ ప్రాజెక్టు ఉమ్మడి జిల్లా రూపురేఖలు మార్చనున్నది.సీఎం నారా చంద్రబాబు నాయుడుతో కలసి ప్రధాని ఈ పారిశ్రామిక నగరికి శ్రీకారం చుట్టడం జిల్లా చరిత్రలో మైలు రాయిగా నిలిచిపోనుంది. మొత్తం మూడు దశలుగా చేపట్టనున్న క్రిస్ సిటీ నిర్మాణం పూర్తయితే రూ. 37,500 కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా 4.67 లక్షల మందికి ఉద్యోగావకాశాలను కల్పించనుంది. ప్రస్తుతానికి తొలి దశ కింద రూ. 2139 కోట్లతో 2500 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అవస రమైన మౌలిక సదుపాయాలు కల్పించే పనులు మొదలయ్యాయి. రానున్న రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

**● తొలిదశ పనులకు కేంద్రం ఆమోదం**

గత కొన్నేళ్లుగా ప్రతిపాదనలు, ప్రణాళికల రూపంలో మగ్గుతూ వచ్చిన క్రిస్ సిటీ ప్రాజెక్టు పనులకు ఇపుడు యుద్ధప్రాతిపదికన అనుమతులు




లభించడం విశేషం. ప్రధాని మోదీ విశాఖ నుంచి బుధవారం శంకుస్థాపన చేసే కార్యక్రమం ఖరారు కావడంతోనే ఈ ప్రాజెక్టు ఫైళ్ళు వేగంగా క్లియర్ అయ్యాయి. గత నెల 30న ఢిల్లీలో అత్యవసరంగా సమావేశమైన కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ జిల్లాకు సంబంధించిన చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన క్రిస్ సిటీ (కృష్ణపట్నం నోడ్) తొలి దశ పనులకు ఆమోదం తెలిసింది. చిల్లకూరు మండలం తమ్మినపట్నం, తూర్పు కనుపూరు, కోట మండలం కొత్తపట్నం, శిద్ధవరం గ్రామాల పరిధిలో 2500 ఎకరాలలో రూ. 2139.43 కోట్లతో అభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పన పనులకు అనుమతినిచ్చింది.

**● రూ. 1173 కోట్లతో తొలి దశ పనులు**

క్రిస్ సిటీలో తొలి దశ మౌళిక సదుపాయాల కల్పన కింద రోడ్ నెట్‌వర్క్, వాటర్ సప్లై నెట్‌వర్క్, రీ యూజ్ వాటర్ నెట్‌వర్క్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్,

మిగతా 6వ పేజీలో

# జిల్లాలో కమలనాథుడెవరు ?

● పోటీలో ముగ్గురున్నా వంశీధర్‌కే అవకాశం ● రేపు ప్రకటించే అవకాశం

నెల్లూరు(క్రైం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎవరు...? అనే చర్చ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో సాగుతుంది. నిబంధనల ప్రకారం జిల్లా అధ్యక్ష పదవి కాలపరిమితి మూడేళ్లు. 2012కి ముందు రెండేళ్లే ఉండేది. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి 17 నెలలు మాత్రమే అయింది. బీజేపీలో ఆరేళ్లకొకసారి సభ్యత్వ నమోదు జరుగుతుంది. ఈ క్రమంలో ఇటీవలే దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు ముగిసింది. ఈ క్రమంలో బూత్ అధ్యక్షుడి నుంచి జాతీయ అధ్యక్షుడి వరకు మార్పు జరగనున్నది. ఇందులోభాగంగా జిల్లా అధ్యక్షుడి ఎన్నికపై ఈనెల 4న రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్, జిల్లా ఎన్నికల అధికారి సామంచి శ్రీనివాస్ అభిప్రాయ సేకరణ చేశారు. కొత్తగా ఎన్నికైన పార్టీ మండల అధ్యక్షులు, మండలస్థాయి ప్రతినిధులు, కోర్ కమిటీ సభ్యులతో కలిపి మొత్తం 69 మందితో విడివిడిగా అభిప్రాయాలు తీసుకున్నారు. ఆ నివేదికను రాష్ట్రశాఖకు అందజేశారు. అంతేకాక జిల్లా అధ్యక్ష పదవికి కూడా దరఖాస్తులు స్వీకరించారు.

**● వంశీధర్‌కే అవకాశం ?**

అధ్యక్ష పదవి రేసులో ఉన్న శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, గుండ్లపల్లి భరత్‌కుమార్, బైరి శ్రీనివాస్‌ల మధ్యే పోటీ ఉన్నట్లు సమాచారం. ప్రధాని మోదీ విశాఖ పర్యటన పూర్తవడంతో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా అధ్యక్షుల జాబితాను శుక్రవారం విడుదల చేసే అవకాశం ఉంది. గురువారం(నేడు) రాత్రి జిల్లా అధ్యక్షుడి ఎంపికపై స్పష్టత వస్తుందని నేతలు చర్చించుకుంటున్నారు. అయితే మరోసారి జిల్లా అధ్యక్ష పదవి శీపారెడ్డి వంశీధర్‌రెడ్డికే దక్కుతుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.




**11 మంది దరఖాస్తు**

జిల్లా అధ్యక్ష పదవికి 11 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ప్రస్తుత జిల్లా అధ్య క్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, రాష్ట్ర విపత్తులశాఖ కన్వీనర్ మండ్ల ఈశ్వరయ్య, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగరాల సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘునాథ రాజు, కోవూరు అసెంబ్లీ కన్వీనర్ ఇండ్ల రాఘవేంద్ర, జిల్లా జనరల్ సెక్రటరీ గడ్డం విజయకుమార్, జిల్లా కార్యదర్శి పరుశు రామ్, నాయకులు సమాధి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు పీవీ నారాయణ రెడ్డి ఉన్నారు.

# ఉత్తరద్వార దర్శనం.. మోక్ష మార్గం

● రేపు ముక్కోటి ఏకాదశి ● వైష్ణవాలయాల్లో భారీగా ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం)/ ఆత్మకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాక్షసుల బాధలు భరించలేక దేవతలు, ప్రజలు వైకుంఠంలోని విష్ణుమూర్తిని ఉత్తరద్వారం ద్వారా దర్శించుకుని తమ బాధలు తెలియజేస్తారు. దుష్టశిక్షణ కోసం విష్ణుమూర్తి గరుడ వాహనంపై భువికి దిగివస్తారు. అలా వచ్చినరోజే ముక్కోటిగా జరుపుకుంటారు. ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకుంటే స్వర్గానికి తలుపులు తెరిచి ఉంటాయని భక్తుల విశ్వాసం. తెలుగు నెలలు చైత్రం నుంచి పాల్గొణం వరకు 12 నెలల్లో మొత్తం 24 ఏకాదశిలు వస్తాయి. వీటిలో సూర్యగమనం ప్రకారం ధనుర్మాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశిని వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి వ్యవహరిస్తారు.



ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి ఘడియలు ఈనెల 9 మధ్యాహ్నం 12.22 గంటలకు ప్రారంభమై 10వతేదీ ఉదయం 10.19గంటల వరకు ఉంటాయి. సూర్యోదయ తిథి కారణంగా దేశవ్యాప్తంగా 10వ తేదీన ముక్కోటిని జరుపుకుంటారు. ఆ రోజున ఉపవాస దీక్షలు తీసుకొని, మరుసటి రోజు దీక్ష విరమిస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి వైష్ణవాలయాల్లో వైకుంఠ ద్వారదర్శనం కల్పించనున్నారు. ఇందుకుగాను ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి.కాగా ఆత్మకూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీదేవి భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయాలు ముక్కోటికి సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. శుక్రవారం వేకువజాము నుంచే ఉత్తరద్వార దర్శ నానికి ఏర్పాటు చేశారు. ఉదయగిరిలోని సుద్ధబావి వీధిలో ఉన్న శ్రీసీతారాముల ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరింది.

# క్యారమ్స్ ఛాంపియన్లు జనార్దన్, పూజ

● సీడెడ్ ఆటగాళ్లపై జూనియర్‌లదే పైచేయి ● ముగిసిన ఆలిండియా పోటీలు

నెల్లూరు(విద్య), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నెల్లూరు క్లబ్‌లో నిర్వహించిన 29వ ఆలిండియా ఫెడరేషన్ క్యారమ్స్ కప్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన జనార్దన్‌రెడ్డి, పుదుచ్చేరికి చెందిన పూజ ఛాంపియన్‌లుగా నిలిచారు. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో సీడెడ్ ఆటగాళ్లు జూనియర్‌ల చేతిలో ఘోర పరాజయం చెందారు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ కె.శ్రీనివాస్ (పీఎస్‌పీబీ) జైన్ ఇరిగేషన్‌కు చెందిన సందీప్‌దైవ్ చేతిలో ఓడిపోగా, మరో ప్రపంచ ఛాంపియన్ వి.ఖాజిమా (పిఎస్‌పిబీ) యూపీకి చెందిన మంటషాఇక్బాల్ చేతిలో ఓటమి చెందారు. మెన్స్ సింగిల్స్ విభాగంలో ఆంధ్రా క్రీడాకారుడు జనార్దన్‌రెడ్డి ఆర్‌బీఐకు చెందిన టాప్ సీడ్ ఆటగాడు ప్రశాంత్‌పై సెమీస్‌లో విజయం సాధించడంతో పాటు ఫైనల్స్‌లో జైన్‌ఇరిగేష్‌కు చెందిన క్రీడాకారుడు సందీప్ దైవ్‌పై రెండు సెట్‌లలో ఓడించి పురుషుల టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 70 ఏళ్ల అనంతరం ఏపీకి చెందిన తెలుగు క్రీడాకారుడు ఆలిండియా ఛాంపియన్ షిప్‌ను దక్కించుకోవడంతో క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. మహిళల సింగిల్స్‌లో పుదుచ్చేరికి చెందిన 14 ఏళ్ల జూనియర్ క్రీడాకారిణి వి.పూజ పీఎస్‌పీబీకి చెందిన మాజీ జాతీయ ఛాంపియన్ ఇలవజిపై ఫైనల్‌లో వరుసగా రెండు సెట్‌లలో గెలిచి తన తొలి మహిళల సింగిల్స్ టైటిల్‌ను దక్కించుకుంది.




ట్రోఫీలతో పురుషుల సింగిల్స్ విజేతలు




ట్రోఫీలతో మహిళల సింగిల్స్ విజేతలు

**● విజేతలు వీరే..**

ఫైనల్స్‌లో పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. పురుషుల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీహెచ్.జనార్దన్‌రెడ్డి ప్రథమస్థానంతో ఛాంపియన్‌గా నిలవగా జైన్ ఇరిగేషన్‌కు చెందిన బీటీ.సందీప్ ద్వితీయస్థానంలో నిలిచారు. కె.శ్రీనివాస్(పీఎస్‌పీబీ) తృతీయస్థానం, ప్రశాంత్‌మోర్(ఆర్‌బీఐ) నాలుగవస్థానం సాధించారు. మహిళల సింగిల్స్‌లో పుదుచ్చేరికి చెందిన వి.పూజ జాతీయ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను సాధించగా తమిళనాడుకు చెందిన ఇలవజి ద్వితీయస్థానంలో నిలిచారు. పీఎస్‌పీబీకు చెందిన కాజల్‌కుమారి తృతీయస్థానం, వి.మిత్ర నాలుగవస్థానం దక్కించుకున్నారు. డబుల్స్ మహిళల విభాగంలో పీఎస్‌పీబీకి చెందిన ఖాజీమా-వి.మిత్రలు ప్రథమస్థానం, మహారాష్ట్రకు చెందిన

మిగతా 6వ పేజీలో

# కార్యకర్తలకే పెద్ద పీట

- వారిని కష్టపెట్టినవారు సెల్యూట్ అనేలా చేస్తా..
- జడ్పీటీసీ, ఎంపీపీల సమావేశంలో జగన్



నెల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పటివరకు జరిగింది మరచిపోండి, భవిష్యత్తులో అన్ని విషయాల్లోనూ కార్యకర్తలకే పెద్దపీట వేస్తా'... అని వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా ద్వితీయశ్రేణి నాయకులకు భరోసా ఇచ్చారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి నెల్లూరుజిల్లా పరిధిలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్లతో జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగింది మరిచిపోండి, ఇక భవిష్యత్తులో అన్నీ విషయాల్లోనూ కార్యకర్తలకే పెద్ద పీట వేస్తామని హామీ ఇచ్చారు. మిమ్మల్ని ఇబ్బందులు పెట్టినవారి పేర్లు రాసిపెట్టుకోండి, రెడ్‌బుక్ అక్కర్లేదు.. మీ దగ్గరున్న పుస్తకంలో రాసి పెట్టుకోండి.. మనం మళ్లీ అధికారంలోకి వచ్చాక వారి చేత మీకు సెల్యూట్ కొట్టిస్తాను.. అని జగన్ అన్నారు. రాజకీయ పదవుల్లో కానీ, అభివృద్ధి పనుల విషయంలో కానీ కార్యకర్తలకే అగ్రతాంబూలమని తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ మేరిగ మురళి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అనీల్‌కుమార్ యాదవ్, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఉదయగిరి, వెంకటగిరి ఇన్‌చార్జులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం నియోజకవర్గాల వారీగా నేతలతో జగన్ కొంత సేపు ముచ్చటించారు.

# ఎందుకంత ఉదాసీనత

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న సామెతలా మారింది జిల్లాలోని రైతాంగం పరిస్థితి. సాగునీటి కాలువలను బాగు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినా వాటిని పంపడంలో ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వేగంగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరుతుంటే జిల్లాలో మాత్రం ఇంతవరకూ ఆ ఊసేలేదు. మొదటి పంట సమయంలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవాల్సిందిపోయి మళ్లీ అదేబాటలో నడుస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

- రెండో పంట విషయంలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం
- ఓఅండ్ఎంకు ప్రతిపాదనలు పంపాలన్న ప్రభుత్వం
- రోజులు గడుస్తున్నా సిద్ధం కాని వైనం




నెల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో మూడేళ్ల పాటు కాలువల నిర్వహణను గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని సూచించింది. దీంతో జిల్లా నుంచి రికార్డు స్థాయిలో రూ.100 కోట్లతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలు చూసిన రాష్ట్రస్థాయి అధికారులు కూడా ఆశ్చర్యపోయారు. ఇందుకు గల కారణాలను జిల్లా అధికారులు వివరించినా ఓఅండ్ఎం హెడ్ కింద నిధులు లేక అంతస్థాయిలో అనుమతులు ఇవ్వలేకపోయారు. ఆ రూ.100 కోట్లను రూ.40 కోట్లకు తగ్గించి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ఉన్నతాధికారులు సూచించారు. ఆవిధంగానే ప్రతిపాదనలు కుదించి అత్యవసర వర్కులను మాత్రమే పెట్టారు.

**రూ.30 కోట్లతో అనుమతులు**

డిజాస్టర్ మేనేజ్‌మెంట్ హెడ్ కింద ప్రభుత్వం మొదటి పంట సమయంలో కాలువల మరమ్మతులకు రూ.30 కోట్లతో అనుమతులు మంజూరు చేసింది. అయితే మొదటి పంట సమయంలో మిగిలిపోయిన పలు అత్యవసర పనులను ఇప్పుడు చేపట్టాల్సి ఉంది. కొన్ని కాలువల్లో పూడిక తీయడమే కాకుండా షట్టర్లు, తూములు కూడా బాగు చేయాల్సి ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే రెండో పంట సమయంలో అవసరమైన ఓఅండ్ఎం ప్రతిపా దనలు పంపాలని గత నెలలోనే ఈఎన్‌సీ లేఖ రాశారు. కానీ జిల్లా అధికారులు మాత్రం ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒకటీ రెండు సబ్ డివిజన్లు మినహా మిగిలిన సబ్ డివిజన్లలో ప్రతిపాదనల తయారీ పూర్తి కాలేదు. క్షేత్రస్థాయిలో కాలువ లను ఎప్పుడు పరిశీలించాలి ? ప్రతిపాద నలు ఎప్పుడు తయారు చేయాలి? వాటిని జిల్లాస్థా యిలో ఆమోదించి ఇంకెప్పుడు ప్రభుత్వానికి పంపాలి ? అన్న ప్రశ్నలు రైతాంగంలో తలెత్తు తున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది నెమ్మదిగా కదులుతుండగా, వారిని పరిగెత్తించడంలో ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

**● ఆలస్యంతో అనర్థం**

అవకాశం వచ్చినప్పుడే అందిపుచ్చుకోవాలి. లేదంటే అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అనుభవజ్ఞులు చెబుతుంటారు. మొదటి పంట సమయంలో ఇరిగేషన్ శాఖలో కూడా ఇదే జరిగింది. ఓఅండ్ఎం పనులు ప్రతిపాదించే సమయంలోనే లస్కర్లను కూడా నియమించుకునేందుకు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు అన్ని జిల్లాల నుంచి ప్రతిపాదనలు వెళ్లగా, అన్నిచోట్ల లస్కర్లను నియమకానికి అనుమతులు లభించాయి. ఆఖరుకు జిల్లా పరిధిలో తెలుగు గంగ ప్రాజెక్టు పరిధిలో కూడా లస్కర్ల నియామకానికి అనుమతులొచ్చాయి. కానీ డెల్టా ప్రాంతంలో మాత్రం ఇప్పటికీ అనుమతులు రాలేదు. అందుకు ప్రధాన కారణం ఇరిగేషన్ అధికారులు సకాలంలో ప్రతిపాదనలు పంపకపోవడమే. రెండేళ్ల నుంచి లస్కర్లు లేక నీటి యాజమాన్యం గందరగోళంగా మారి, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది మాదిరిగానే ఇప్పుడు కూడా లస్కర్లు లేకుండానే సాగు జరుగుతోంది. ఈ సీజన్‌లోనైనా త్వరగా ప్రతిపాదనలు పంపితే కేటాయింపుల్లో కోత లేకుండా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.





సమావేశానికి హాజరైన కూటమి నాయకులు, కార్యకర్తలు, (ఇన్‌సెట్)లో మాట్లాడుతున్న వీపీఆర్

## తాము ఈ స్థాయిలో ఉన్నామంటే

# అది మీ కష్టమే : ఎంపీ వేమిరెడ్డి

వింజమూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తాను ఎంపీగా, కాకర్ల సురేష్ ఎమ్మెల్యేగా ఉన్నామంటే.. అది నాయకులు, కార్యకర్తల కష్టమేనని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వింజమూరు ఎస్వీ కల్యాణ మండపం ఆవరణలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన ఉదయగిరి నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో ప్రచారానికి వారం రోజులు మాత్రమే వచ్చానని, కూటమి నాయకులు, కార్యకర్తలు తన గెలుపు కోసం 45 రోజులపాటు రేయింబవళ్లు కష్టపడ్డారన్నారు. తనకు 7.66 లక్షల ఓట్ల మెజార్టీ వస్తే 98 వేల ఓట్లు ఈ నియోజకవర్గంలోనే వచ్చాయన్నారు. బీపీసీఎల్ ఏర్పాటుతో జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతోపాటు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ మా ఇద్దరికి కష్టం విలువ తెలుసన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంతో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు, పరిశ్రమల స్థాపనకు చర్యలు చేపడతానన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రజలను రాక్షస పాలన నుంచి కాపాడిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. అనంతరం సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు, పలువురు నాయకులు మాట్లాడారు. అనంతరం నేతలను కూటమి నేతలు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబు, నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రతిభ చూపాలి

● నెల్లూరు మేయర్ స్రవంతి

నెల్లూరు(విద్య), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు ప్రతిభ చూపాలని నెల్లూరు నగర మేయర్ స్రవంతి పిలుపు నిచ్చారు. నెల్లూరు టౌన్ హాలులో నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో బుధ వారం జరిగిన యువజన్ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. యువతలోని ప్రతిభా పాటవాలను వెలికితీ యడం, వారి నైపుణ్యాలను మరింత ఉన్నతంగా తీర్చిది ద్దాలన్నదే ఉత్సవ్ ముఖ్య ఉద్దేశ మన్నారు. దేశ ఔన్నత్యాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన స్వామి వివేకా నందను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విక్రమ సింహపురి విశ్వవిద్యా లయం ఉపకులపతి ఆచార్య విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్య, ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజహితం కోసం, దేశంకోసం కృషి చేయాలని కోరారు. ఆధునిక శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంపై ఆసక్తి పెంచుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలు తిలకించి యువతను అభినందించారు. వ్యవ సాయంలో సైన్స్ టెక్నాలజీ, ప్లాస్టిక్‌ను అరిక డుతూ జూట్ బ్యాగుల వినియోగం, సేంద్రీయ ఉత్పత్తుల స్టాల్స్, మొబైల్ ఫొటోగ్రఫీ, యువ రచయితల పోటీ, డ్రాయింగ్, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో యువజన అధికారి మహేంద్ర రెడ్డి, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధి కారి సత్యవాణి, ఎంఈవో హమీద్, నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



యువ ఉత్సవ్‌ను ప్రారంభిస్తున్న మేయర్ స్రవంతి

# హెల్మెట్ ధరిస్తేనే ప్రవేశం

● పోలీసు కార్యాలయంలో కొత్త నిబంధన ● ప్రజాచైతన్యం కోసమే...

నెల్లూరు(క్రైం), జనవరి8 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ వినియోగంపై జిల్లా పోలీసు శాఖ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. పోలీసు అధికారులు అందరూ కలిసి నెల్లూరులో ఇటీవల హెల్మెట్ వినియోగంపై భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోకి ద్విచక్ర వాహనంపై వచ్చే వారు ఎవరైనా సరే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే అన్న నిబంధన తీసుకువచ్చారు. దీంతో అధికారుల నుంచి సిబ్బంది వరకు అందరూ ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించే వెళుతున్నారు. ఈ నిబంధన పాటించని వారిని గేటు వద్దే ఆపేస్తున్నారు. వారి వాహనాలు బయట పెట్టించి నడుచుకుంటూ లోపలికి వెళ్లాలని సూచిస్తున్నారు. ఈ నిబంధన పోలీసులకే కాదు, కార్యాలయానికి వచ్చే విలేకర్లు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, సాధారణ ప్రజలకు కూడా వర్తింపజేసేలా ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎస్పీ కార్యాలయానికి వెళ్లాలనుకునే వారంతా హెల్మెట్ ధరించడం తప్పనిసరి అయింది.

**పోలీసులు ఆదర్శంగా నిలవాలి : కృష్ణకాంత్, ఎస్పీ**

హెల్మెట్ వినియోగంపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన దారులకు అవగాహన కల్పిస్తున్నాము. ముందుగా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు ఆదర్శంగా నిలిచేలా హెల్మెట్ ధరించాలి. జిల్లా కార్యాలయం లోపలికి వచ్చే ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆదేశించాం. దీంతో కార్యాలయానికి వచ్చే వారిలో మార్పు వచ్చింది. ప్రజలు కూడా ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం శ్రేయస్కరం.



## జాతీయ సైన్స్ ఫెయిర్‌కు జిల్లా ప్రాజెక్టు ఎంపిక

● రాష్ట్రస్థాయిలో 'త్రికోణమితి'కి ప్రశంసలు



జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్ట్

నెల్లూరు(విద్య), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రద ర్శించిన ప్రాజెక్టులలో జిల్లాలోని టీపీగూడూరు మండలం కోడూ రు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపి కైంది. ఆ పాఠ శాల విద్యార్థినులు బీ కీర్తి, డీ రాజశ్రీ ప్రదర్శించిన నిత్యజీవి తంలో త్రికోణమితీయ అనువర్త నాలు అనే ప్రాజెక్టును జాతీయ సదరన్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా సదరు విద్యా ర్థినులను, వారికి మార్గదర్శకం వహించిన ఉపాధ్యాయురాలు సీహెచ్ కామాక్ష మ్మను జిల్లా సైన్స్ అధికారి డీ కరుణాకర్‌రెడ్డి అభి నందించారు. ఈ నెల 20 నుంచి 25వతేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే జాతీయ సైన్స్ ఫెయిర్‌లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

## భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహిం చిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్ప ట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి

## అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు

● ప్రభుత్వ భూముల్లో లేఅవుట్ల స్వాధీనం
● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (జడ్పీ), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నుడా పరిధిలో అక్రమ లేఅవుట్లపై కఠినంగా వ్యవహరిస్తామని, ఎవరినీ ఉపేక్షించేది ఉండదని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేశారు. నుడా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 200కుపైగా అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ లేఅవుట్లపై చర్యలకు ప్రత్యేక బృందాలను ఏర్పా టు చేశామని చెప్పారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండ దండలతో ఇష్టానుసరంగా అక్రమ లేఅవుట్లు వేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను సైతం వదల కుండా అనధికార లేఅవుట్లు ఏర్పాటు చేశారని విమర్శించారు. ఆ భూముల న్నింటిని తిరిగి స్వాధీ నం చేసుకునేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అక్రమ లేఅ వుట్లు వేయాలంటేనే భయపడేలా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఎంజీబీ లేఅవుట్లతో నుడాకు ఆర్థిక వనరులను సమ కూర్చేం దుకు కసరత్తు జరుగుతోందన్నారు.

● రెడ్‌క్రాస్‌లో అవినీతిపై విచారణ జరిపిస్తాం

రెడ్‌క్రాస్‌లో అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మంత్రి నారాయణపై విమర్శలు చేయడం సిగ్గుచేటని నుడా చైర్మన్ అన్నారు. రెడ్‌క్రాస్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామన్నారు. ఈ సమావేశంలో నుడా పట్ట ణ ప్రణాళిక అధికారి హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న దేహదారుఢ్య పరీక్షలు

● ఇప్పటివరకు గైర్హాజరైన వారికి మరో అవకాశం

నెల్లూరు(క్రైం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాని స్టేబుల్ ఉద్యోగ నియామ కాలకు సంబంధించి నెల్లూ రులోని పోలీసు కవాతు మైదా నంలో అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. డిసెంబరు 30వ నుంచి ఈ పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు పరీక్షలకు గైర్హాజరైన అభ్యర్థులు చివరి రోజు పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. కాగా, బుధవారం జరిగిన ఫిజికల్ టెస్టుకు 600 మంది అభ్యర్థులకుగాను 554 మంది హాజర య్యారు. వారిలో 482 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఎస్పీ జీ కృష్ణకాంత్ ఈ పరీక్షలను పర్యవేక్షించారు.

### మున్సిపల్ కమిషనర్ల సీనియారిటీ జాబితా

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న 22 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ స్పెషల్ గ్రేడ్‌లకు, 49 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-1 కేడర్‌కు సంబంధించి ప్రభుత్వం సీనియారిటీ జాబితా ప్రకటించింది. అలాగే, 13 మంది గ్రేడ్-2 కేడర్‌కు, 26 మంది గ్రేడ్-3 కేడర్‌కు సీనియారిటీ జాబితా ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.



దివ్యాంగులకు విద్యుత్ ట్రైసైకిళ్ల పంపిణీ చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ తదితరులు

## దివ్యాంగుల అభ్యున్నతే వీపీఆర్ ఫౌండేషన్ ధ్యేయం

● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ● 145 మంది దివ్యాంగులకు విద్యుత్ ట్రైసైకిళ్ల పంపిణీ

వింజమూరు/ఉదయగిరి రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభ్యున్నతే ధ్యేయం గా వీపీఆర్ ఫౌండేషన్ పనిచేస్తోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం వింజమూరు పట్టణంలోని ఎస్వీ కల్యాణ మండపం ఆవరణలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, విశిష్ట అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్‌తో కలిసి నియోజకవర్గంలోని 145 మంది దివ్యాంగులకు విద్యుత్ ట్రైసైకిళ్లు పం పిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గత పదేళ్ల క్రితం వీపీఆర్ ఫౌండేషన్ ఏర్పాటుచేసి రాజకీయాలతో సంబంధం లేకుం డా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 150 శుద్ధిజల కేంద్రా లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రచారం లో భాగంగా అధికంగా దివ్యాంగులను గుర్తిం చామని, అందుకే వారికి తొలుత విద్యుత్ ట్రైసై కిళ్లు అందజేశామన్నారు. అలాగే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని దివ్యాంగులందరికీ ట్రై సైకిళ్లు అందజేస్తామన్నారు. ట్రైసైకిళ్లు మరమ్మ తులకు గురైతే వాటిని బాగుచేసేందుకు ప్రత్యేక వ్యవస్థను సైతం నియమించామన్నారు. త్వర లో దివ్యాంగులకు రుణాలు సైతం ఇప్పించి ఆదుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ సమాజ అవ సరాలకనుగుణంగా విస్తృతమైన సేవలు అంది స్తోందని, వారికి జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఆర్‌సీ ద్వారా దివ్యాం గులకు మండలస్థాయిలో సేవలందిం చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ సేవలు మరువలేనివని, అడిగిన వెంటనే నియోజకవర్గానికి 34 ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసినందుకు ఎంపీకి ప్రత్యేక కృత జ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ కోట్ల రూపాయలు ఆస్తులున్నా సహాయం చేసే గుణం కొందరికే ఉంటుందని, అలాంటి వారిలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డన్నారు. మంచి నాయకులను ఎం చుకుంటే మంచి పాలన అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కూటమి నా యకులు, అధికారులు పాల్గొన్నారు.

## క్యారమ్స్ ఛాంపియన్లు జనార్దన్, పూజ

( 5వ పేజీ తరువాయి)

బి.శోభిఖ-ఎస్.ప్రీతిప్రిన్సిలు ద్వితీయ స్థానం సాధించారు. పీఎస్‌పీబీకి చెందిన రష్మీకుమా రి-ఇలవజిలు తృతీయస్థానం, సీసీఎస్‌సీఎస్ బీకి చెందిన కె.నాగజ్యోతి -నీలంగోదాఖేలు నాలుగవస్థానంలో నిలిచారు. పురుషుల విభాగంలో ఆర్‌బీ ఐకు చెందిన జహీర్‌పా షా-ప్రశాంత్ మోర్‌లు ప్రథమస్థానం, మహారాష్ట్రకు చెందిన వికాస్ హరీష్ ధారియా-పంక జ్ అశోక్‌లు ద్వితీయస్థానంలో నిలిచారు. జైన్ ఇరిగేషన్‌కు చెందిన రహీం కరీంఖాన్-అభిజిత్ త్రిపాంకర్ తృతీయస్థానం, సం దీప్ డైవ్-జైద్ అహ్మద్ ఫారూఖీ నాలుగవస్థానం సాధించారు. విజేతలకు అంతర్జాతీయ క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసఫ్‌మేయర్ (స్విట్జర్లాండ్), అంతర్జాతీయ క్యారమ్ పెడరే షన్ ప్రధాన కార్యదర్శి వీడీ .నారాయణ, అఖి లభారత క్యారమ్స్ సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ నీరజ్‌కుమార్ సంపతి, ప్రధాన కార్యదర్శి భారతి నారాయణ్‌లు. తెలంగాణా రాష్ట్రం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంలు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్యారమ్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.అబ్దుల్‌జలీల్, ఫెడరేషన్ కప్ కో చైర్మన్ మలిరెడ్డి కోటారెడ్డి, నెల్లూరుక్లబ్ కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్.శ్రీమన్నారాయణ, కార్యదర్శి వీ.రఘురామ్ శ్రీధర్, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు, క్లబ్ కోశాధికారి విశ్వనాథ్ పాల్గొన్నారు.



బహుమతులతో పురుషుల డబుల్స్ విజేతలు



బహుమతులతో మహిళల డబుల్స్ విజేతలు

**గర్వపడుతున్నా**

చిన్నతనం నుంచి క్యారమ్స్‌పై ఉన్న మక్కువతో కష్టపడుతూనే వివిధ స్థాయిల్లో ఇప్పటి వరకు 17 సార్లు రాష్ట్ర పతకాలు సాధించా. తొలిసారిగా ఆలిండియా పోటీల్లో ఛాంపియన్‌గా నిలవడం గర్వంగా ఉంది. భవిష్యత్‌లో ప్రపంచ వేదికపై భారత పతాకాన్ని రెపరెపలాడించడమే ధ్యేయంగా మరింత సాధన చేస్తా.

- సీహెచ్.జనార్దన్‌రెడ్డి, ఆలిండియా పురుషుల ఛాంపియన్

**ఛాంపియన్‌షిప్ దక్కడం ఆనందంగా ఉంది**

అతిచిన్న వయసులో ఆలిండియా ఛాంపియన్‌షిప్ దక్కడం ఆనందంగా ఉంది. పదోతరగతి చదువుతున్న నేను సీనియర్స్ విభాగంలో పోటీ పడ్డా. అందరికీ గట్టిపోటీనిచ్చి విజేతగా రికార్డు సాధించడం సంతో షాన్నిస్తోంది. ఇదే స్ఫూర్తితో ప్రపంచ ఛాంపియన్ షిప్‌పై దృష్టి సారిస్తాను.

- పూజ, ఆలిండియా మహిళా ఛాంపియన్

## క్రిస్ సిటీతో జిల్లా రూపురేఖల మార్పు

(5వ పేజీ తరువాయి)

కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 132-33 కేవీ సబ్ స్టేషన్, 33-11 కేవీ ఇంటర్నల్ సబ్ స్టేషన్లు వంటివి నిర్మించనున్నారు. మొత్తం అంచనా వ్యయం రూ. 2139 కోట్లు కాగా అందులో రూ. 1173 కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అందులో భాగంగా రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాల పనులు మొదలయ్యాయి.

● రెండేళ్లలో రూ.7,500 కోట్ల పెట్టుబడులు... 50 వేల ఉద్యోగాలు

తొలి దశ పనులు 2027 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయా లని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ ఫేజ్ -1 పనులు పూర్తయితే వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా క్రిస్ సిటీకి రూ. 7500 కోట్ల పెట్టుబడులు వస్తా యని కేంద్ర, రాష్ట్రాలు అంచనా వేస్తున్నాయి. తద్వారా ఈ ప్రాంతంలో 50 వేల మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నాయి.

● పూర్తయితే అభివృద్ధికి మేలిమలుపు

కృష్ణపట్నం పోర్టును, చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌ను అనుసంధానం చేస్తూ జిల్లాలోని చిల్లకూరు, కోట మండలాల్లో మూడు దశలుగా ఏర్పాటవుతున్న క్రిస్ సిటీ పూర్తయితే జిల్లా అభివృద్ధికి మేలి మలుపు అవుతుంది. గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలం తమ్మిన పట్నం, తూర్పు కనుపూరు, మోమిడి, వెల్లపాలెం, బల్లవోలు గ్రామాలు, అలాగే కోట మండలం కొత్తపట్నం, సిద్ధవరం, కర్లపూడి గ్రామాల నుంచీ 10,834 ఎకరాల భూములను ప్రభుత్వం సేకరిస్తోంది. మొత్తం ప్రాజెక్టు పూర్తయితే ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్ అండ్ అప్పారెల్స్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఇంజనీరింగ్ అండ్ ఎంఎస్‌ఎంఈ, ఇతర బిల్డింగ్ మెటీరియల్స్ వంటి పరిశ్రమలు కానున్నాయి. వాటి ద్వారా రూ. 37,500 కోట్ల పెట్టుబడులు వస్తాయని, 4,67,500 మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంచనా వేస్తున్నాయి.

## రెడ్‌క్రాస్ కమిటీ నిబంధనలు పాటించాలి

● కొత్త చైర్మన్‌ను ఎన్నుకోండి : కలెక్టర్



రెడ్‌క్రాస్ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం) జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ నిబంధనల ప్రకారం సభ్యులం తా పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ చాం బర్‌లో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ సభ్యులు తటస్థంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనరాద న్నారు. అయితే కొందరు నిబంధనలు ఉల్లం ఘిస్తున్నట్లు రాష్ట్ర కమిటీకి లేఖలు వచ్చాయ న్నారు. ఇప్పటికే కొంతమంది సభ్యులపై ఆధారాలతో ఫిర్యాదులు అందాయని, వారికి నోటీసులు ఇస్తామని చెప్పారు. అలాంటి వారంతా కమిటీ నుంచి స్వచ్ఛందంగా వైదొల గాలన్నారు. మిగిలిన సభ్యులలో ఒకరిని చైర్మన్‌గా ఎంపిక చేసుకో వాలని తెలిపారు. రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనపోతే 24 గంటల్లో వివరణ ఇస్తే పరిశీలిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభా స్కర్, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బైక్ మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తా : ఇంటూరి



బైక్ మెకానిక్‌ల అసోసియేషన్ సభ్యులతో ఎమ్మెల్యే ఇంటూరి, ఎంవీఐ రాంబాబు

కందుకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని బైక్ మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బైక్ మెకానిక్‌ల అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం బుధవారం సాయంత్రం పట్టణంలోని ఇస్లాంపేట షాదీఖానాలో జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలో పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీచేసే సమయంలో బైక్ మెకానిక్‌లకు కూడా న్యాయం చేయటం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంవీఐ రాంబాబు, కార్మికశాఖ అధికారి మేరీసుజాత, బైక్ మెకానిక్‌ల అసోసియేషన్ ప్రతినిధులు డి ధర్మా తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ పాలీఫెస్ట్‌లో 'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఏపీ పాలీఫెస్ట్‌లో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రదర్శించిన నేచురల్ అండ్ మల్టీపర్పస్ సస్టైనబుల్ కోల్డ్ స్టోరేజీ అనే ప్రాజెక్టు ప్రశంసలందుకుందని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రశంసలు, జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసిన విద్యార్థులను రాష్ట్ర ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనకు మార్గనిర్దేశం చేసిన డాక్టరు ఎం లక్ష్మణరావు, బీ సంపత్‌కుమార్‌ను, విద్యార్థులను ఆయన అభినందించారు.

## రేపు ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు

● ఎమ్మెల్యే దగుమాటికి ఆహ్వానం



బిట్రగుంట: ముక్కోటి ఏకాదశికి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని ఆహ్వానిస్తున్న ఈవో రాధాకృష్ణ

బిట్రగుంట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు జరుగుఆయని ఆలయ ఈవో రాధాకృష్ణ బుధవారం తెలిపారు. ఆలయంలో జరిగే ప్రత్యేక పూజలకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని ఆలయ సాంప్రదాయ ప్రకారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ పాలక మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, అర్చకులు సత్యనారాయణా చార్యులు తదితరులు ఉన్నారు. అలాగే సీఎల్ పురంలోని కోదండరామాలయం, బృందావనంలోని రామాలయాలో ముక్కోటి ఏకాదశి పూజలంటాయని నిర్వాహకులు తెలిపారు.

## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఉదయగిరి, జనవరి 8 (ఆంధజ్యోతి): పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండలంలోని గడ్డంవారిపల్లి, కృష్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూరు శాతం ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, శివరామిరెడ్డి, ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో ఇళ్లలో చేరని లబ్ధిదారులకు నోటీసులు



మద్దూరుపాడులోని టిడ్కో గృహాలు

కావలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మద్దూరుపాడులో ఉన్న టిడ్కో గృహాలలో ఇల్లు మంజూరై రిజిస్ట్రేషన్‌కు రాకుండా, బ్యాంకు మార్టిగేజ్ చేయని 639 మందికి నోటీసులు జారీ చేశారు. మొత్తం 2,112 టిడ్కో గృహాలను మూడు కేటగిరిలుగా విభజించారు. వాటిలో 300 చ.అ విస్తీర్ణం గృహాలు 693 లబ్ధిదారులకు కేటాయించగా వాటిలో 11 మాత్రం వివిధ కారణాల వలన ఖాళీగా ఉన్నాయి. 365 చ.అ గృహాలు 864 ఉండగా వాటిలో 391 మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తి చేయగా 327 గృహాల లబ్ధిదారులు బ్యాంకు మార్టిగేజ్‌తో రుణాలకు అర్హత పొందారు. 430 చ.అ గృహాలు 544 ఉండగా వాటిలో 235కు రిజిస్ట్రేషన్ అవ్వగా 202 గృహాల లబ్ధిదారులు బ్యాంకు మార్టిగేజ్‌తో రుణాలకు అర్హతలు పొందారు. దీంతో వివిధ కారణాల వలన రిజిస్ట్రేషన్‌లు కానివి, బ్యాంకు మార్టిగేజ్ కాని వారిని గుర్తించి వారందరికీ నోటీస్‌లు ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్. జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. వయస్సు పైబడిన వారికి, సిబిల్ కోర్ తక్కువ ఉన్న వారికి బ్యాంకు రుణాలు ఇవ్వనందున కొందరు, స్థానికంగా లేకుండా పోయిన వారు కొందరు, చనిపోయిన వారు కొందరు ఉండటంతో అలాంటి వారందరి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు గృహాలు అందచేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వయస్సు పైబడిన వారు, సిబిల్ కోర్ తక్కువ ఉన్నవారు వారి కుటుంబంలో ఎవరైనా అర్హులు ఉంటే వారికి అవకాశాలు కల్పిస్తామని అధికారులు చెపుతున్నారు. అలా వీలు కాని వారికి వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా రుణం లేకుండా డబ్బులు చెల్లిస్తే వారికి గృహాలు అప్పచెప్పడం జరుగుతోందన్నారు. వీటన్నింటికి ఎవరూ ముందుకు రాకపోతే వారి గృహాలను రద్దు చేసి కొత్త వారికి అవకాశం కల్పించనున్నట్లు అధికారులు చెపుతున్నారు. టిడ్కో గృహాల లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## పంటల బీమాను వినియోగించుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

అల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పంటల బీమాను ప్రతి రైతు వినియోగించుకొని విపత్తుల సమయంలో నష్టాల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి అన్నారు. మండలం లోని సింగపేటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పలు విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కావలి ఏడీఏ నాగరాజు, లీడ్ బ్యాంక్ ఎల్‌డిఎం నర్సోజిరావు, వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

●ఏఎస్ పేట: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వి దేవసేనమ్మ తెలిపారు. బుధవారం ఆమె ఏఎస్ పేట మండల వ్యవసాయ అధికారిణి రజినితో కలసి గుంపర్లపాడు, వేల్పులగుంట గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈవో చిరంజీవి, విఎఎలు పాల్గొన్నారు.

●సీతారామపురం: సింగారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం మండల వ్యవసాయాధికారి పి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సభలో రైతులతో మాట్లాడుతూ ప్రతి రైతు ఈ-పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.



# శిథిలావస్థలో తరగతి గదులు

● అద్దె భవనంలో అరకొర వసతులు
● విద్యార్థుల అవస్థలు



శిథిలమైన గండిపాళెంలోని పాఠశాల భవనం

ఉదయగిరి రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా మారింది మండలంలోని గండిపాళెం గ్రామ ప్రాథమిక పాఠశాల దుస్థితి. అన్ని వసతులతో చూడముచ్చటగా ఉన్న ఆ పాఠశాల తరగతి గదులు మాత్రం కాలంచెల్లి శిథిలావస్థకు చేరుకున్నాయి. శ్లాబు పెచ్చు లూడుతూ తలుపులు, కిటికీలు సైతం అధ్వాన్నంగా మారి ఆ భవనం ఎప్పుడు కూలుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల కాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారడంతో చేసేదేమీ లేక గ్రామంలోని ఓ అద్దె నివాసంలోకి పాఠశాలను తరలించారు. కాగా, అద్దె భవనంలోకి పాఠశాలను తరలించినప్పటికీ అరకొర వసతుల నడుమ చదువులు సాగించాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. ఇరుకైన చిన్నపాటి గదుల్లో విద్యాభ్యాసం సాగించడంతోపాటు బోధన చేయడం ఉపాధ్యాయులకు సైతం తలకుమించిన భారంగా మారుతోంది. మధ్యాహ్న భోజన నిర్వాహకుల పరిస్థితి సైతం అలాగే మారింది.

### దాత సహకారం

విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా అద్దె భవనంలోకి పాఠశాలను తరలించినప్పటికీ ప్రభుత్వం నుంచి నిధులు అందే అవకాశం లేకపోవడంతో ఆ భారాన్ని తల్లిదండ్రులే భరాయించాల్సి వస్తుందని తెలిసి అయోమయానికి గురయ్యారు. తొలుత ప్రతి విద్యార్థి రూ.100 చొప్పున నెల అద్దె రూ.3 వేలు చెల్లించేందుకు నగదు జమచేశారు. దీంతో తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన టిటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం పాఠశాలకు చేరుకొని ప్రతినెలా అద్దె నగదును తాను చెల్లిస్తానని హామీ ఇచ్చి జమ చేసిన నగదు తిరిగి తల్లిదండ్రులకు అందజేయాలని సూచించారు.

### ఉన్నతాధికారులకు నివేదించాం: ప్రధానోపాధ్యాయురాలు

శిథిలావస్థకు చేరిన పాఠశాలతోపాటు అద్దె నివాసంలోని పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించామని ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌జీ షాహిదా తెలిపారు. కొంతమేర ఇబ్బందులు ఉన్నప్పటికీ వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నాం.

# ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



కలువాయి : నృత్యం చేస్తున్న విద్యార్థులు.

కలువాయి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్వం ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యా ర్థుల నృత్యాలు, రైతులు, హరిదాసుల వేషదారణలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు భోగిపండ్లు పోశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●కావలిటౌన్: పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు చీరలు, విద్యార్థులు పంచెలు, లాల్చీలు ధరించి అలరించారు. కళాశాల ప్రాంగణంలో దిద్దిన ముగ్గులు ఏర్పాటు చేసిన బొమ్మరిల్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో పాటు కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు టగ్‌ఆఫ్‌వార్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ శేషయ్య, అకడమిక్ ఇన్‌చార్జ్ ప్రత్యూషా రెడ్డి పాల్గొన్నారు.

● జేబీ డిగ్రీ కళాశాలలో జరిగిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి. విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, లక్ష్మీ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని సంక్రాంతి పండుగ విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ వరకుమారి, పీడీ

ఆత్మకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌ఆర్‌జెడి కళాశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ జి వరకుమారి, పీడి సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు, విశ్వవిద్యాలయం పరిశీలకులు డాక్టర్ ఏ ప్రవీణ్‌కుమార్ క్రీడాపోటీలను ప్రారంభించారు. సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆత్మకూరు ఏఎస్‌ఆర్ కళాశాల జట్టుపై ఉదయగిరి ఎంఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు, ఆత్మకూరు ఎస్‌వి డిగ్రీ కళాశాల జట్టుపై ఎస్‌ఆర్‌జె డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాయి. గురువారం ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని పీడీ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు.

## విజేతలకు బహుమతుల పంపిణీ

ఉదయగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో గిఫ్ట్‌స్కీం విజేతలకు బుధవారం డిపో మేనేజరు శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల నుంచి ఆదరణ పొందేందుకు ఉదయగిరి డిపో ఆధ్వర్యంలో ఉదయగిరి - సీతారామపురం మార్గంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు చేసే ప్రయాణికులు టిక్కెట్ ద్వారా స్కీమ్‌లో పాల్గొనే అవకాశం కల్పించామన్నారు. బస్సుల్లో ఏర్పాటుచేసిన గిఫ్ట్ బాక్సుల్లో ప్రయాణికులు వేసిన టిక్కెట్లను లక్కీడ్రా తీయగా వాణి, మహబూబ్‌బేగం విజేతలుగా ఎంపికయ్యారన్నారు. దీంతో వారికి బహుమతులను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది పాల్గొన్నారు.

## డీపీవోకు సన్మానం

వింజమూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డిని బుధవారం జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ తరఫున డీపీవో కార్యాలయంలో వింజమూరు తాలూకా అధ్యక్షుడు వెలుగోటి మధు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఉద్యోగుల సమస్యలు డీపీవో దృష్టికి తీసుకువెళ్లారు. డీపీవోఓ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఇతర ఏపీఎన్జీవో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

అనంతసాగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద చేస్తున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి చంద్రా రాజగోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రాజెక్టు వద్ద అఫ్రాన్ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పనులు వేగవంతం చేసేలా ప్రభుత్వం అధికారులను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంగళి పుల్లయ్య, అన్వర్‌బాషా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యలో అగ్రగామిగా నిలపాలి

ఉదయగిరి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యా శాఖకు సంబంధించి అన్ని విషయాల్లో ఉదయగిరి మండలాన్ని అగ్రగామిగా నిలపాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రాలను సందర్శించారు. పాఠశాలల్లో వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రంలోని పిల్లల మానసిక, శారీరక వికాసాలు బాగున్నాయని ఐఈఆర్టీలను అభినందించారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, హెచ్‌ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహా, శివనందిని, సుభాష్‌చంద్రబోస్, సీఆర్‌ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలి



బ్రహ్మేశ్వరంలో మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో మోహన్‌రావు తదితరులు

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పథకాలకు సంబంధించిన వాటర్ ట్యాంకుల్లో ప్రతి 15 రోజులకోసారి క్లోరినేషన్ చర్యలు చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని డిప్యూటీ సీఈవో జే మోహన్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని బ్రహ్మేశ్వరం గ్రామంలో గల సీపీడబ్ల్యూఎస్ మంచినీటి పథకాన్ని పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పైపులైన్‌ల లీకులను, మరమ్మతులను వెంటనే చేయించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు, బ్రహ్మేశ్వరం సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శులు షేక్ నజీముల్లా, మల్లికార్జున, నాగరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బ్రహ్మయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిజమైన ఎస్సీలను గుర్తించి న్యాయం చేయాలి

అల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో చోటు చేసుకున్న తప్పిదాలను సవరించి నిజమైన ఎస్సీలను గుర్తించి వారికి న్యాయం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు కోరారు. బుధవారం అల్లూరులో జరగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శంభన్ కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చిన విషయం ఎవ్వరికీ తెలియజేయకుండా పంచాయతీ కార్యదర్శులు గోప్యంగా ఉంచారని, దీనిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టరు, అల్లూరు తహసీల్దారుకు విన్నవించారు. ఇప్పటి వరకు ఈ విషయంపై ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. వన్ మ్యాన్ కమిషన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ తప్పుడు నివేదికలను సిద్ధం చేస్తున్నారని, ఇటువంటివి కాకుండా నిజమైన ఎస్సీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమయంలో దానం మాల్యాద్రి, వేణుగోపాల్, ముసలి నరేంద్ర, పొంగులూరు సుధాకర్ పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

●డిప్యూటీ డీఎంహెచ్‌వో



డిప్యూటీ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన డాక్టరు రజనిని సత్కరిస్తున్న వైద్యాధికారులు, వైద్యసిబ్బంది

కందుకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్యసేవలు అందించాలని వైద్యాధికారులు, సిబ్బందికి కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టరు ఎస్ రజని సూచించారు. పదోన్నతిపై నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం పట్టణంలోని తూర్పు వడ్డెపాలెం అర్బన్ హెల్త్‌సెంటర్‌లో డివిజన్ లోని వైద్యాధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆసు పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవ లను విధిగా అందించాలన్నారు. వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించడంతో పాటు అవకాశం ఉన్న మేర పీహెచ్‌సీ లోనే మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యాధికారులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారులు రజనిని సత్కరించారు.

## ఆన్‌లైన్ ద్వారా పెన్షనర్స్‌కు లైఫ్ సర్టిఫికెట్లు

కావలి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్ పెన్షనర్స్ ఫ్యామిలీ పెన్షనర్స్‌కు కావలి పెన్షనర్స్ భవనంలో ఆన్‌లైన్‌లో చేయిస్తున్న లైఫ్ సర్టిఫికెట్లను పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కావలి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ కావలి అధ్యక్షుడు ఆకుల రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1వ తేదీ నుంచి ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లైఫ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్ ద్వారా చేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 28 లోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. పెన్షనర్స్ భవనం ద్వారా సమర్పించుకునే వారు ఆధార్‌కార్డు, దానికి అనుసంధానమైన ఫోన్‌ను, పీపీవో నంబరు, సీఎఫ్‌ఎంఎస్ ఐడీ నెంబరు, పెన్షన్ పొందు బ్యాంకు అకౌంట్ నంబరును తీసుకు రావాలన్నారు.

## యువతకు స్వామి వివేకానంద ఆదర్శం



స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అపస్ నాయకులు

సంగం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని అడ్వకేట్ కాకు మురళిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక నేతాజీ జూనియర్ కళాశాలలో అపస్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ముందస్తుగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయమన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులకు స్వామి వివేకానంద జీవితంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అపస్ నాయకులు సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నేతాజీ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ మదార్ బాష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం

● జి. ప్రసాద్‌బాబు, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త



కందుకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఆధునిక సాంకేతికత, యంత్ర పరికరాలు, నూతన వంగడాలు, నూతన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కేవీకే హెడ్ డాక్టరు జీ ప్రసాద్‌బాబు తెలిపారు.

ముఖాముఖి

**? కందుకూరు కేవీకేలో సిబ్బంది, శాస్త్రవేత్తలు తగినంతమంది ఉన్నారా.**

! శాస్త్రవేత్తలు ఆరుగురు పనిచేస్తున్నారు. సిబ్బంది కొరత కొంత ఇబ్బందిగా ఉంది. అయినప్పటికీ సామూహిక ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటు ద్వారా దిగుబడుల పెంపునకు కృషి చేస్తున్నాం.

**? కేవీకే ద్వారా ఏ కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు**

! రైతులకు నూతన యంత్ర పరికరాలను, నూతన వంగడాలను పరిచయం చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద ఆ వర్గాల రైతులకు చిన్నచిన్న పనిముట్లు, టార్పాలిన్లు, ప్లాస్టిక్ ట్రేలు, వానపాముల ఎరువుల తయారీకి ప్లాస్టిక్ పెట్టెలు ఉచితంగా అందజేస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహకంలో భాగంగా కందుకూరు రైతుబజారులో ఔట్‌లెట్ ప్రారంభించాం.

**? రైతులతో అనుసంధానం కోసం ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు.**

! సోషల్ మీడియాను ఉపయోగించుకుని తమ సందేశాలు రైతులకు అందేలా చూస్తున్నాం. కేవీకే ద్వారా ప్రారంభించిన కిసాన్ సారథి అనే వాట్సాప్ గ్రూప్‌లో కేవీకే పరిధిలో ఉన్న 28 మండలాల నుంచి 3వేల మంది రైతులు ఉన్నారు.

## న్యూస్ బాక్స్

### క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

కందుకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్, డైరీని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ విజయ్‌భాస్కర్, పి చంద్రయ్య, కార్యాలయ ఏఓ టి శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలను అరికట్టాలి

కొండాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాల్య వివాహాలను అరి కట్టాలని ఐసీడీఎస్ సీడీపీవో పద్మజాకుమారి అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో బుధవారం కిషోర బాలికల వికాస కార్యక్రమంపై అంగన్‌వాడీ టీచర్లు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఎంఈవో-2 ఆనందరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఖాదర్‌బాషా, వైద్యాధికారి నసీరుద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, షకీలా, ఏపీఎం కాంతారావు, పాల్గొన్నారు.

**బోగోలులో...**

బిట్రగుంట : బోగోలు మండలం వెలుగు కార్యాలయంలో బుధవారం కావలి సీడీపీవో శారద అధ్యక్షతన కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు, ఎంఈవో జయమ్మ, అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ఏపీవో శ్రీనివాసులు, అంగన్వాడీ సూపర్ వైజర్లు కోటేశ్వరి, సుభాషిణి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్యసాధనకు కృషిచేయాలి

కావలి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డాక్టర్లు రమ్య, వెంకటేశ్వర్లు తెలిపారు. కావలి పట్టణం బాపూజీ నగర్‌లోని బాలికల వసతిగృహంలో బుధవారం జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య సమస్యలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాల వలన కలుగు దుష్ఫలితాలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారిణి నాగేశ్వ రమ్మ, జేవీవీ బాధ్యులు సీ. శారద, గాదిరెడ్డి హరినాథ్, సుబ్బరాయశర్మ, జానకిరాం, కల్యాణి, ఖాదర్‌బాషా, చలపతిరావు పాల్గొన్నారు.

### పింఛన్ల పంపిణీపై విచారణ

చేజర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ కోసం ప్రభు త్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు బుధవారం చేజర్ల మండలంలోని పలు గ్రామాలలో ప్రత్యేక వైద్య బృందాలు విచారణ చేపట్టారు. మంచానికే పరిమితమై రూ. 15 వేలు పింఛన్ తీసుకుంటున్న మొత్తం 25 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తనిఖీ చేపట్టారు. పూర్తి వివరాలను జిల్లా అధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు.

### పేదలకు దుప్పట్ల పంపిణీ

కావలిటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ నగర్‌లోని సంయుక్త సంస్థ కార్యాలయంలో బుధవారం అర్వపల్లి నాగరాజ సృజన దంపతుల కుమార్తె సులేఖ్య పుట్టిన రోజు పురస్కరించుకుని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.